


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


# తాగునీటి ఎద్దడి సమస్యపై దృష్టి పెట్టండి



- కృష్ణా బేసిన్‌లో వరద నీటి నిర్వహణ చేపట్టాలి
- రవాణా శాఖలో అనవసర నిబంధనలు తీసేయాలి
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో తలెత్తిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు తాగునీటి కొరత రాకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయ ప్రాంగణంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో నిర్వహించిన వివిధ శాఖల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించడమే కాకుండా రాబోయే రోజుల్లో ఎదురయ్యే పశుగ్రాసం కొరత నివారణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. కృష్ణా బేసిన్‌లో వరద నీటి నిర్వహణ చేపట్టాలని సూచించారు. రవాణా శాఖలో అవినీతి రహిత ప్రజా సేవలే లక్ష్యంగా 24 గంటల్లోనే లైసెన్సుల రిజిస్ట్రేషన్ వంటి విప్లవాత్మక మార్పులు తేనున్నట్లు వెల్లడించారు.



## 'ఇంటింటికీ టీడీపీ' @ 20 లక్షలు

- ఎనిమిదో రోజు మూడు లక్షలకు పైగా ఇళ్లకు
- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నిదర్శనం
- నేతలు, శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ అభినందనలు

- వివరాలు 4 లో.



## అసలైన నేర రత్నాలు.. వైసీపీ నేతలు

- చేసేవి ఘోరమైన నేరాలు, అక్రమ కేసులంటూ గగ్గోలు
- నేరస్తులెవరైనా సరే చట్టం నుంచి తప్పించుకోలేరు
- కూటమి ప్రభుత్వంలో అందరికీ న్యాయం, అందరికీ సంక్షేమం
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

- వివరాలు 4 లో.

### విశాఖ రవాణా ఆధునికీకరణకు

## ఏపీ, మాస్కో ప్రభుత్వాల కీలక ఒప్పందం

- అంతర్జాతీయ రవాణా సదస్సులో ఎంవోయూ
- ఫలితాలిచ్చిన మంత్రి లోకేష్ రష్యా పర్యటన




6

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, పారిశ్రామిక రాజధాని విశాఖపట్నంలో అత్యాధునిక, సాంకేతిక ఆధారిత ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులోకి తెచ్చే దిశగా గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కీలక ముందడుగు వేసింది. రష్యన్ ఫెడరేషన్‌కు చెందిన మాస్కో ప్రభుత్వంతో జీవీఎంసీ చారిత్రాత్మక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మాస్కోలో నిర్వహించిన 5వ అంతర్జాతీయ రవాణా సదస్సు సందర్భంగా విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ సమక్షంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, మాస్కో డిప్యూటీ మేయర్ మాక్సిమ్ లిక్సుతోవ్... ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ రష్యా పర్యటన ఫలితంగా రూపుదిద్దుకున్న ఈ ఒప్పందం ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రియల్ టైమ్ ట్రాఫిక్ మానిటరింగ్, డిజిటల్ టికెటింగ్, స్మార్ట్ కనెక్టివిటీ రంగాల్లో మాస్కో అంతర్జాతీయ ప్రమాణాల సాంకేతికత విశాఖకు లభించనుంది.

### ఐదేళ్ల పాలనలో రైతులకు తీరని ద్రోహం...

## ఇప్పుడు మొసలి కన్నీళ్లు

- జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు మండిపాటు
- పొగాకు రైతులను ఆదుకోలేని వ్యక్తికి ఇప్పుడు మాట్లాడే హక్కు లేదు
- వారి కష్టాలపై నాడు జగన్ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర
- నేడు అన్ని విధాలా భరోసాగా నిలిచిన కూటమి ప్రభుత్వం
- రైతులందరూ పంటల బీమా చేయించుకోవాలి



3

### అర్హులందరికీ

## 'నేతన్న సేవలో'



5

- ఏటా చేనేతలకు రూ.25 వేల ఆర్థిక సాయం
- ఈ నెల 7 నుంచి పథకం అమలు
- అదే రోజు చీరాలలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు
- చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

### జగన్ డైరెక్షన్‌లోనే

## వైసీపీ నేతల ఆటవిక చర్యలు



4

- రాష్ట్రంలో అలజడులకు అరాచక మూకల కుట్ర
- మహిళలు, దళిత, బలహీనవర్గాలపై జగన్ పార్టీ నేతల దమనకాండ
- నేరాలపై కేసులు పెడితే కక్ష సాధింపు అంటూ బురదజల్లుడు
- మంత్రి కొలుసు పార్థసారథి

### నేరగాళ్లకు అండగా నిలబడటం

## జగన్ నైజం



- దళిత మహిళకు ఆయన క్షమాపణ చెప్పాలి
- ఎమ్మెల్యే విరూపాక్షిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

- వివరాలు 6 లో.

### ప్రభుత్వాసుపత్రుల్లో

## ఆక్సిజన్ వినియోగం లెక్కలు తేల్చాలి

- పీఎస్ఏ ప్లాంట్ల కొనసాగింపుపైనా నివేదిక ఇవ్వాలి
- అధికారులకు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



5

# తాగునీటి ఎద్దడి సమస్యపై దృష్టి పెట్టండి

- కృష్ణా బేసిన్‌లో వరద నీటి నిర్వహణ చేపట్టాలి
- అంగన్వాడీ కేంద్రాలను తనిఖీలు చేయాలి
- రవాణా శాఖలో అనవసర నిబంధనలు తీసేయాలి
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): ఎల్‌నినో పరిస్థితుల కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి ఎద్దడి సమస్యపై దృష్టిపెట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రిజర్వాయర్లు, నీటి వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ తాగునీటి సరఫరాలో ఇబ్బందులులేకుండా చూడాలని ఆదేశించారు. సచివాలయం ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్షించారు. ఎగువన వర్షాలు కురుస్తున్నం దున్న కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయని అధికారులు వివరించారు. కృష్ణానది లో కొద్దిరోజులుగా నీటి ప్రవాహాలు మొదలైనట్లు వివరించారు. అలాగే గోదావరిలో వరద పరిస్థితిని వివరించారు. కృష్ణా బేసిన్‌లో ఎగువ నుంచి వచ్చే వరదను సద్వినియోగం చేసుకునేలా నీటి నిర్వహణ చేపట్టా లని సీఎం ఆదేశించారు. వర్షాభావం వల్ల రానున్నరోజుల్లో పశుగ్రాసం కొరత వచ్చే అవకాశం ఉందని...దీనికి అవసరమైన చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తరచూ తాగునీటి పరీక్షలు నిర్వహించాలని..ల్యాబ్ టెస్టుల నివేదికలను విడుదలచేయాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్వాడీ కేంద్రాలను తనిఖీలు చేయాలని సీఎం ఆదేశించారు. రవాణ శాఖలో పూర్తిస్థాయి టెక్నాలజీ వినియోగం, అనవసర నిబంధనల తొలగింపు వంటి అంశాలకు తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్, ఫారం-5బీ వంటి పరీక్షలను తొలగించడం వంటిచర్యల ద్వారా అవినీతిని తగ్గించ డం, సులభతర సేవలను అందించే అవకాశం కలు గుతుందని అధికారులుచెప్పారు.దశలవారీగా రవాణా శాఖలో ఈసంస్కరణలు చేపట్టేలా తాము ప్రణాళికను సిద్ధంచేశామని తెలిపారు. వీలైనంత మేరకు అనవసర నిబంధనలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం  సూచించారు. ఈసమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, వివిధశాఖల ఉన్నతా ధికారులు పాల్గొన్నారు.

## టెట్‌కు సర్వం సిద్ధం

**5 నుంచి 16 వరకు పరీక్షలు - శ్రీకాకుళం జిల్లాలో కేంద్రాలు**



శ్రీకాకుళం(చైతన్యరథం): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఈ నెల 5 నుంచి పరీక్షల నిర్వహణకు రంగం సిద్ధం చేశారు. ఏడు కేంద్రాల్లో 12,690 మంది అభ్యర్థులు టెట్ రాయనున్నారు. వీరికి ప్రభుత్వ షెడ్యూల్ మేరకు ఈ నెల 5 నుంచి 21 వరకు ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తారు.

నరసన్నపేటలో కోర్ టెక్నాలజీ, ఎచ్చెర్లలో శివానీ, శ్రీవెంకటేశ్వర, టెక్కలిలో ఐతం ఇంజనీరింగ్ కళాశాలతో పాటు ఒడిశా రాష్ట్రం బరంపురంలో మూడు కేంద్రాలను పరీక్షలకు కేటాయించారు.

ఈ ఏడు కేంద్రాలకు డీవోలతోపాటు రెండు ఫ్లయింగ్ స్కాడ్‌ను నియమించారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు సులభంగా చేరుకునేందుకు ప్రజారవాణా వ్యవస్థ అధికారులకు సమాచారం తెలియజేశారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్యఆరోగ్య శిబిరాలు, నిరంతర విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేపట్టారు. ఈసారి ఇన్‌సర్వీస్ టీచర్లు అధికంగా దరఖాస్తు చేసుకున్నారు.

### ఇన్‌సర్వీసు టీచర్లూ రాయాల్సిందే

విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చిన తర్వాత 2011 నుంచి డీఎస్సీ రాయాలంటే టెట్ పాస్ తప్పనిసరి చేశారు. ఈ నేపథ్యంలో బీఈడీ, టీటీసీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు టెట్ రాస్తున్నారు. కొన్నేళ్ల వరకు ఉపాధ్యాయ, ఉద్యోగార్థులకు మాత్రమే ఈ నిబంధన విధించారు. ప్రస్తుతం ఇన్‌సర్వీస్ టీచర్లు కూడా తప్పనిసరిగా టెట్ పాస్ కావాలనే నిబంధన పెట్టారు. ఇతర రాష్ట్రాల్లో కొందరు టీచర్లు టెట్ మినహాయింపుపై సుప్రీంకోర్టుకు వెళ్లినా ఊరట దొరకలేదు. విద్యాహక్కు చట్టం మేరకు ప్రతీ టీచర్ తప్పనిసరిగా టెట్ పాసై ఉండాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తీర్పు వెలువడే నాటికి ఐదేళ్లలోపు ఉద్యోగ విరమణ పొందే వారిని మినహాయించింది. మిగిలిన ఇన్ సర్వీస్ టీచర్లందరూ 2028 ఆగస్టులోగా టెట్ పాస్ కావాలని, లేదంటే ఉపాధ్యాయ ఉద్యోగా లకు అనర్హులుగా పరిగణింపబడతారని స్పష్టం చేసింది. దీంతో ఇన్‌సర్వీస్ టీచర్లు కూడా టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

## అభివృద్ధిపై చర్చకు రావాలంటే..

# తప్పుడు సవాళ్లెందుకు?

**- వైసీపీ నేతలపై మంత్రి జనార్దన్ రెడ్డి మండిపాటు**



బనగానపల్లె (చైతన్యరథం): అభివృద్ధిపై చర్చకు రావాలని తాను అంటుంటే వైసీపీ నేతలు మాత్రం రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలంటూ తప్పుడు సవాళ్లు విసురుతున్నారని రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం పొట్టిపాడు గ్రామంలో సోమవారం జరిగిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టిపాడు గ్రామంలో దాదాపు 575 మందికి పట్టాదార్ పాస్ పుస్తకాలు అందిస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా ప్రజల భూములతో చెలగాటమాడి రెవెన్యూ సమస్యలు సృష్టించారు. రెవెన్యూ శాఖలో జరిగిన పొరపాట్లను నేడు సరిదిద్దుతున్నాం. పొట్టిపాడు గ్రామంలో 2014 – 19 మధ్య రూ.50 లక్షలతో సీసీ రహదారులు నిర్మించాం. నేడు రూ. 35 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నాం. ఒక్క తల్లికి వందనం పథకం ద్వారానే గ్రామంలో దాదాపు రూ.66 లక్షలు అందిస్తున్నాం. స్థానికంగా గ్రామంలో రూ. 2 కోట్లతో బ్రిడ్జి నిర్మించాం.

ఈ సందర్భంగా బనగానపల్లె నియోజకవర్గ వైసీపీ మాజీ ఎమ్మెల్యే తీరుపై మంత్రి జనార్దన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమంటే.. మళ్లీ ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలవాలని సవాల్ విసురుతున్నాడని విమర్శించారు. మీ ఇష్టం వచ్చినట్లు రాజీనామా చేసి పోటీ చేయడానికి ఇది ప్రజాస్వామ్యమా..రాచరికమా? గత ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించిన సంగతి మర్చిపోయి మళ్లీ పోటీ చేయాలంటూ సవాల్ విసురుతున్నారు. ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి చేశారో ఏ గ్రామంలోనైనా చర్చకు సిద్ధంగా ఉన్నాను. ఎస్పీ దగ్గర పర్మిషన్ తీసుకుని రావాలని మాజీ ఎమ్మెల్యే అంటున్నారు. ఎస్పీ దగ్గర పర్మిషన్ ఎందుకు.. కత్తుల తిప్పడానికి తీసుకోవాలా? 2029లో చూసుకుందాం ప్రజలు ఎవరిని ఆశీర్వదిస్తే వాళ్ళు గెలుస్తారు. వైసీపీ నేతల తరహాలో అంబోతుల్లా మా పార్టీ నేతలు గ్రామాల్లో తిరగడం లేదు. రప్పా.. రప్పా.. ఆడిస్తాం.., కోబలి వంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్యంలో చెల్లవు. ఇటువంటి వ్యాఖ్యలు చేస్తేనే 151 సీట్ల నుంచి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు బుద్ధి చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో మా పార్టీ నేతలపై ఎన్నో కేసులు పెట్టి అరాచకాలు సృష్టించారు. మేము శాంతి కోరుకుంటుంటే, ప్రతిపక్ష నేతలు ఘర్షణ పూరిత వాతావరణం కోరుకుంటున్నారని మంత్రి జనార్దన్ రెడ్డి అన్నారు.

కోవెలకుంట్లలో స్థానికంగా పరిశ్రమలు పెట్టుకునేందుకు వీలుగా రూ.24 లక్షలతో త్రీ పేజ్ విద్యుత్ అందిస్తున్నాం. ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం నిధులు అందిస్తున్నాం. మంత్రి లోకేష్ విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. సన్న బియ్యంతో మధ్యాహ్నం భోజనం అందించడం సాధారణ విషయం కాదు. గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తాను.  పనిచేసే నాయకులకు ప్రజలు అండగా ఉండాల్సిన అవసరం ఉంది. మీ అందరి ఆశీస్సులతో మంత్రి పదవి వచ్చింది. దానిని నిలబెట్టుకుంటూ నియోజకవర్గానికి అత్యధికంగా నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నాను. అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు చౌకబారు విమర్శలు చేస్తున్నారని మంత్రి జనార్దన్ రెడ్డి మండిపడ్డారు.

చైతన్యరథం

## ఐదేళ్ల పాలనలో రైతులకు తీరని ద్రోహం..

# ఇప్పుడు మొసలి కన్నీళ్లు

- జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు మండిపాటు
- పొగాకు రైతులను ఆదుకోలేని వ్యక్తికి ఇప్పుడు మాట్లాడే హక్కు లేదు
- వారి కష్టాలపై నాడు జగన్ ప్రభుత్వం ప్రేక్షకపాత్ర
- నేడు అన్ని విధాలా భరోసాగా నిలిచిన కూటమి ప్రభుత్వం
- రైతులందరూ పంటల బీమా చేయించుకోవాలి

అమరావతి (చైతన్యరథం): అధికారంలో ఉండగా రైతుల సంక్షేమం విషయంలో పూర్తిగా విఫలమైన జగన్ రెడ్డి.. ఇప్పుడు రైతులపై ఎక్కడా లేని ప్రేమ చూపిస్తూ కపట నాటకాలు ఆడుతున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఐదేళ్ల పాలనలో పొగాకు రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినా వారికి అండగా నిలవడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 12.93 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలుతో చేతులు దులుపుకుని రైతులను మార్కెట్ దయాదాక్షిణ్యాలకు వదిలేసిందని మండిపడ్డారు. రైతులకు శాశ్వత ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోవడంలో, మార్కెట్‌లో సమర్థవంతంగా జోక్యం చేసుకోవడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పొగాకు రైతుల సమస్యలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని కార్యాచరణ ప్రారంభించిందని మంత్రి తెలిపారు. గత ఏడాదిలోనే సుమారు 25 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకును రూ.270 కోట్ల విలువతో కొనుగోలు చేసి వేలాది మంది రైతులకు అండగా నిలిచామని చెప్పారు. అలాగే ఎఫ్‌సీవీ (వర్జీనియా) పొగాకు రైతులను ఆదుకునేందుకులో, ఆఫ్ స్టైల్ రకాల పొగాకుకు కిలోకు రూ.10 చొప్పున ప్రభుత్వ ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.100కోట్ల ఆర్థిక సహాయం అందివ్వనున్నట్లు తెలిపారు. సుమారు



100 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి పొగాకు రైతుకు రూ.50 వేల వరకు వడ్డీలేని రుణాలు అందించే కేంద్ర కార్యాచరణ కొనసాగుతోందన్నారు. రైతులకు మార్కెట్ భరోసాతో పాటు ఆర్థిక తోడ్పాటు కూడా అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో నిరంతర సమన్వయంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తమ కృషి ఫలితంగానే కేంద్రం మరోకీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఖరీఫ్ –2026 సీజన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) కింద అన్ని ఖరీఫ్ పంటలకు పంటల బీమానమోదు,ప్రీమియం చెల్లింపు గడువును ఆగస్టు 15 వరకు పొడిగించేలా కేంద్ర వ్యవసాయ శాఖ, బీమా సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా చర్చలు జరిపిందన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడంతో ఈ నిర్ణయం సాధ్యమైందని చెప్పారు.

ప్రకృతి వైపరీత్యాలు,వర్షాభావం, ఇతర అనివార్య పరిస్థితుల వల్ల కలిగే పంట నష్టాల నుంచి రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంలో పంటల బీమా కీలక రక్షణగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. అందు వల్ల రుణగ్రహీతలు, రుణేతర రైతులు అనే తేడా లేకుండా అర్హులైన ప్రతిఒక్క రైతు బీమా చేయించు కోవాలన్నారు. రైతులు అతి తక్కువ ప్రీమియం మొత్తం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, వ్యవసాయ అధికారులు రైతులకు పూర్తి అవగాహన కల్పించి, బీమా ప్రీమియం కట్టించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు ఆగస్టు 15లోపు పంటల బీమాలో నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల కష్టసుఖాలు తెలియని జగన్.. ఇప్పుడు రైతు గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. మాటలతో కాదు... చేతలతో రైతులకు అండగా నిలవడం కూటమి ప్రభుత్వనిబద్ధత అని మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

## ప్రజా సంక్షేమం..

# అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేలా కృషి
- వైసీపీ అరాచకాన్ని గుర్తించి 11 సీట్లకు పరిమితం చేసినా బుద్ధి రాలేదు
- అభివృద్ధిని అడ్డుకునేలా వ్యవహరించే వారికి గుణపాఠం తప్పదు
- మచిలీపట్నంలో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం(చైతన్యరథం): రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను ప్రజలందరికీ తెలియ జేయడమే లక్ష్యంగా ఇంటింటికీ తెలుగు దేశం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం పెద్దయాదరలో ఇంటింటింకీ తిరిగి కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి గురించి వివరించారు. అసందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014లో రాష్ట్ర విభజన జరిగినపుడు దాదాపు రూ.16వేల కోట్ల లోటు బడ్జెట్‌తో పాలన ప్రారంభించామన్నారు.ఐదేళ్లు కష్టబడి రాష్ట్రాన్ని గాడిన పెట్టాం.ఆదాయం పెంచుకుంటూ వృద్ధిలో నడిపించాం. 2019ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి..ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. దాడులు, దౌర్జన్యాలతో రాష్ట్రాన్ని అల్లకల్లోలంచేశారు. వైసీపీ అరాచకాన్ని ఇంక భరించలేమని ప్రజలంతా ఏకమై కూటమి ప్రభుత్వాన్ని భారీ మెజార్టీతో గెలిపించుకున్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 94శాతం సీట్లతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు. ప్రస్తుతం రాష్ట్ర ఆదాయం తక్కువగా ఉంది. దీనికి తోడు జగన్‌రెడ్డి అరాచకం, అప్పుల కారణంగా ఆదాయం మొత్తం ఉద్యోగుల జీతాలకు,అప్పులకే సరిపోతోంది. అయినప్పటికీ చంద్రబాబు నాయుడు పరిపాలనా దక్షతచాటుకుంటూ..పాలన సాగిస్తున్నారు.

పెద్దయాదరలో 424మందికి రూ.18.86లక్షలు పెన్షన్లరూపంలో అందిస్తున్నాం. తల్లికి వందనం పథకం ద్వారా 188 మందికి రూ.28.20లక్షలు అందించాం. అన్నదాత సుఖీభవ ద్వారా 258 మందికి రూ.52.98లక్షలు ప్రయోజనం చేకూర్చాం.ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన ద్వారా 16మందికి లబ్దిచేకూర్చాం. ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా 16మందికి రూ.2.40లక్షలు అందించాం. ఇలా అనేక పథకాలు అమలు చేశాం. కొత్త పెన్షన్లు కూడా గుర్తించి అందిస్తాం.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.4000 పెన్షన్లు అందిస్తున్నాం. పెన్షన్ల కోసమే దాదాపు 64లక్షల మందికి ఏడాదికి రూ.35వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. మరో 8 లక్షల కొత్త పెన్షన్లు త్వరలోనే మంజూరు చేయబోతున్నాం. రాష్ట్రంలో పెన్షన్ల కోసం చేసిన ఖర్చుతో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసేయొచ్చు. అయినప్పటికీ.. ప్రజా సంక్షేమం కూడా ముఖ్యమేనన్న ఉద్దేశ్యంతో పెన్షన్లు అందిస్తున్నాం. పూర్తిగా మంచానికే పరిమితం అయిన వారికి ఏకంగా రూ.15 వేలు అందిస్తున్నాం. గతంలో జగన్‌రెడ్డి కేంద్రం సొమ్ముతో కలిపి రైతులకు రూ.13వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కానీ నేడు అన్నదాత సుఖీభవతో ప్రతి రైతుకు రూ.20వేలు చొప్పున అందిస్తున్నాం. ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ తల్లికి వందనం ద్వారా రూ.10, 500 కోట్లు అందించాం. కొన్ని కుటుంబాల్లో ఐదారు మందికి కూడా తల్లికి వందనం జమ అయింది. ఉచిత గ్యాస్, ఉచిత బస్సు సదుపాయం కల్పించాం.

గతంలో ఎన్నడూ లేని విధంగా రోడ్ల నిర్మాణం పూర్తిచేశాం. కొన్ని విపత్కర పరిస్థితుల కారణంగా యాదర రోడ్డు నిర్మాణ పనులు జాప్యమవుతున్నాయి. త్వరలోనే టెండర్లు పిలిచి పనులన్నింటినీ పూర్తి చేస్తాం. కూటమి అధికారంలోకి వచ్చాకే రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ పనులువేగంగా జరుగుతున్నాయి. మంచినీరు, విద్యుత్ కనెక్షన్లు, డ్రైనేజీపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. వాటన్నింటినీ వీలైనంత త్వరగా పరిష్కరించి చూపిస్తాను. ప్రతి సమస్యనూ అధికారులతో మాట్లాడి పరిష్కరించే బాధ్యత తీసుకుంటానని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచె నాని, చిన్నాపురం మాజీ సర్పంచి గోపాల్‌రావు, కృష్ణమూర్తి, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గోదావరి వరద తగ్గుముఖం

- మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- పెలు గ్రామాల్లో కొనసాగుతున్న సహాయక చర్యలు

పోలవరం(చైతన్యరథం): విలీన మండలాల ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేసిన గోదావరి వరద చివరికి శాంతించి తగ్గు ముఖం పట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణలోని భద్రాచలంవద్ద ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు నీటి మట్టం 41 అడుగులకు చేరుకోగా మొదటి ప్రమాద హెచ్చరికను కూడా ఉపసంహరించారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వరద స్వల్పంగా తగ్గింది. వరద పూర్తి స్థాయిలో తగ్గేందుకు మరో రెండు రోజులు పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కోయిదా వైపు వెళ్లే 33 కేవీ విద్యుత్‌లైన్ వరదలో మునిగిపోవడంతో విద్యుత్‌ను నిలిపివేశారు. ఆదివారం విద్యుత్ సిబ్బంది పడవల ద్వారా విద్యుత్ వైర్లకు చిక్కుకున్న చెట్ల కొమ్మలు, చెత్తా చెదారం తొలగించి తెగిపోయిన వైర్లు సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కుక్కునూరు గ్రామ శివారులోని గుండేటివాగు ప్రాంతంలో జామాయిల్ వేసిన పంట పొలాలు వరద నీటిలోనే ఉన్నాయి. మండలంలో అధికారులు పారిశుధ్యం పై దృష్టి పెట్టారు. విషజ్వరాలు, అంటువ్యాధులు, వ్యాప్తి చెందకుండా గ్రామాల్లో బ్లీచింగ్ చల్లిస్తున్నారు. దాచారం పునరావాస కాలనీకి తరలివచ్చిన గొమ్ముగూడెం నిర్వాసితులకు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు.

### పోలవరం ప్రాజెక్టు వద్ద వరద ఉధృతి

పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది.పట్టిసీమ శివక్షేత్రం ఫెర్రీ రేవు మెట్లు పూర్తిగా నీటమునిగాయి. కడెమ్మ స్లూయిజ్ గేట్లను వరద జలాలు ముంచెత్తాయి. ఏటిగట్టుకి కుడివైపున ఉన్నపంటపొలాల్లోకి వరద జలాలు ప్రవేశిస్తున్నాయి. పట్టిసీమ వద్ద సచివాలయ భవనం వద్ద వరద జలాల తాకిడికి ఫెర్రీ గట్టు కోతకు గురై భవనం ప్రమాదకర స్థితికి చేరుకుంది. పురుషోత్తపట్నం, రేవు లాంచీలు, మత్స్యకారుల పడవలను ఏపీ టూరిజం బోట్ పాయింట్ వద్ద సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పోలవరంప్రాజెక్టుకి రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డుమార్గంలో వంతెనను వరద జలాలు తాకుతూ ప్రవహిస్తున్నాయి. గోదావరి నీటిమట్టం మరింత పెరిగితే ప్రాజెక్టుకి రాకపోకలు బంద్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. పశ్చిమ గోదావరిజిల్లాలో గోదావరి వరద మరింత పెరిగింది. లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. యలమంచిలి మండలంలోని కనకాయలంక కాజ్‌వే వరద ముంపులోనే ఉంది.దీంతో లంక వాసులు పడవల్లో రాకపోకలు కొనసాగిస్తున్నారు. నరసాపురం వద్ద వశిష్ఠ గోదావరి ఉగ్రరూపం దాల్చింది.బాపు ఘాట్‌లోకి నీళ్లు చేరాయి. మూడో రోజు కూడా ఉభయగోదావరి జిల్లాల మధ్య పడవల రాకపోకలు నిలిపివేశారు.



# అసలైన నేరరత్నాలు.. వైసీపీ నేతలు

- **చేసేవి ఘోరమైన నేరాలు, అక్రమ కేసులంటూ గగ్గోలు**
- **నేరస్థులెవరైనా సరే చట్టం నుంచి తప్పించుకోలేరు**
- **కూటమి ప్రభుత్వంలో అందరికీ న్యాయం, అందరికీ సంక్షేమం**
- **గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరుగుతుందని, అందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ఇది అందరికీ సమ న్యాయం అందించే మంచి ప్రభుత్వమని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గత ప్రభుత్వంలో నవరత్నాల పేరుతో ఇష్టానుసారంగా ప్రగల్భాలు పలికారని, అసలైన రత్నాలు ఇప్పుడే వెలుగులోకి వస్తున్నాయని ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

గత ప్రభుత్వంలో అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం చాలా నీతులు చెప్పేవారని, అంత నీతులు చెప్పిన ఆయన బతికున్న మనిషిని చనిపోయినట్లుగా సృష్టించి, కొడుకు పేరు మీద భూమి రాయించుకోవడం లాంటి నీచమైన పనులకు పాల్పడిన విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు.

శ్రీకాకుళం జిల్లాలో మరో వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కొడుకు యాక్సిడెంట్ చేసి ఒక వ్యక్తిని చంపేస్తే, అతన్ని కాపాడుకోవడానికి అమాయకపు వ్యక్తిని జైలుకు పంపించారన్నారు. ఆ తరువాత గొడ్డలి పార్టీ అధినేత పరామర్శకు వస్తున్నాడంటే చనిపోయిన వారి ఇంటికి పరామర్శకు వస్తున్నాడని అనుకున్నారని, కానీ చంపిన వాడి ఇంటికి పరామర్శకు వెళ్లారు. ఇప్పటికే ప్రజలందరికీ అతని నేర చరిత్ర, మనస్థత్వం ఏంటో అర్థమై ఉంటుంది. ఎవరో దారిన పోయే వ్యక్తి, దాదాపుగా వయసైపోయిన వ్యక్తిని 18 ఏళ్ల చిన్న కుర్రాడు గుద్ది చంపేస్తే అది పెద్ద నేరమా అని జగన్మోహన్ రెడ్డి అంటున్నారని ఆమె గుర్తుచేశారు. 45 సంవత్సరాలు పైబడితే వయసైపోయినట్లా అని ప్రశ్నించారు. అలా అనుకుంటే రాష్ట్రంలోని 50 శాతం మంది వయసు పైబడి, ఆయుష్షు అయిపోయినట్లేననేది జగన్ ఉద్దేశమా అని మంత్రి సంధ్యారాణి ప్రశ్నించారు.

ప్రమాదం అంటేనే తెలియకుండా జరుగుతుందని, కాబట్టి దానిని తప్పుపట్టడం లేదన్నారు. కానీ, ఆ తర్వాత వైసీపీ పార్టీ నాయకులు, అధినేత చేస్తున్నది ఏంటని ప్రశ్నించారు. అప్పలరాజు కొడుకును నేరం నుంచి తప్పించి మరో అమాయకుడిని నిందితుడిగా చూపించేలా కేసును తారుమారు చేసేందుకు ప్రయత్నించటమే అసలైన నేరం అన్నారు. ఒక తల్లి కొడుకును కోల్పోయి ఏడుస్తుందని, భార్య భర్తను కోల్పోయిందని, ఇద్దరు పసి బిడ్డలు తండ్రిని కోల్పోయి ఏడుస్తుంటే నేరం చేసిన వాళ్లే జగన్‌కు ముఖ్యమయ్యారని అన్నారు. కనీసం బాధిత కుటుంబాలను పరామర్శించలేదని, వారి దగ్గరకు కూడా వెళ్లలేదని విమర్శించారు. రాష్ట్రం మొత్తం ఈ ఘటన చూసిన తర్వాత ఏమనుకోవాలని, మతిస్థిమితం సరిగానే ఉందని అనుకోవాలా అని ప్రశ్నించారు.

ఇక వైసీపీకి చెందిన మరో నేత చింతాడ రవి, ఆయన అనుచరులు... జగన్ పర్యటన సందర్భంగా ఒక మహిళా ఎస్సైతో అసభ్యకరంగా ప్రవర్తించారని, కనీసం ఇంగితం కూడా లేకుండా ప్రవర్తించారని అన్నారు.

శ్రీకాకుళంలో ఈ మూడు రత్నాలు కలిసి ఈ దారుణాలకు పాల్పడ్డారని గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మాజీమంత్రి అమర్‌నాథ్ అనకాపల్లిలో మహిళలను కించపరిచే విధంగా కామెంట్లు చేయడం, గుంటూరులో ముస్తఫా, తణుకులో కారుమూరి నాగేశ్వరరావు... వీళ్లందరూ జగన్ పెట్టుకున్న రత్నాలని వ్యాఖ్యానించారు. వీళ్లే కాకుండా ఇంకా చాలా మంది ఉన్నారన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించడం, రాజ్యాంగానికి విలువ ఇవ్వడం, దానికి లోబడి ఉండాలనే భావన వీరికి లేదని విమర్శించారు. గొడ్డలి పార్టీ అధినేత



పరామర్శకు వచ్చినప్పుడు మనుషుల తల మీద నుంచి కారు ఎక్కించడం ఎలా అలవాటో, వీళ్లకు కూడా ఇలాంటి అరాచకాలు చేయడం అలవాటుగా మారిందని అన్నారు. తప్పులు, నేరాలు, ఘోరాలు, కవ్వింపు చర్యలు చేస్తారని, ఇవన్నీ చేసినా పోలీసులు వారిపై చర్యలు తీసుకోకూడదనేది వీరి ఆలోచన. ఒకవేళ చర్యలు తీసుకుంటే కక్ష సాధింపు చర్యలు అంటూ గగ్గోలు పెడతారన్నారు. అసలు కక్ష సాధింపు చర్యలు అంటే అర్థం తెలిసి మాట్లాడతారో, లేక నటిస్తారో అర్థం కావడం లేదన్నారు. ఎన్ని ఘోరాలు చేసినా వారిని అరెస్టుచేయకూడదా అని ప్రశ్నించారు. మీరు సప్త సముద్రాలు దాటినా, ఎక్కడ నివాసం ఉన్నా చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. నేరాలు, ఘోరాలు చేసినవారిని చట్టం ఖచ్చితంగా శిక్షిస్తుందని అన్నారు. మేము అంబేద్కర్ రాజ్యాంగాన్ని గౌరవించుకుంటూ వెళ్తున్నామని, వైసీపీ వారిలాగా రాజారెడ్డి రాజ్యాంగాన్ని కాదని గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేశారు.

### రెండేళ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి

రాష్ట్రంలో గత రెండేళ్లుగా చీకటి ప్రభుత్వం నడుస్తుందని వైసీపీ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రెండేళ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు కళ్లారా చూస్తున్నారన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభానికి ప్రజలు ఉవ్వెత్తున తరలివచ్చారని, అలాంటి మీటింగ్‌ను వైసీపీ వాళ్లు జన్మలో చూసి ఉండరని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టులో మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, నాగరికతతో మేళవించి కనిపించాయని చెప్పారు. కానీ వైసీపీ వాళ్లు ఎర్రబస్సే రాని ఊరికి ఎయిర్‌పోర్టు కట్టిస్తారా అని గతంలో ఎగతాళి చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు భోగాపురంలో జరిగిన అభివృద్ధిని చూడాలన్నారు. ఇప్పుడు సిగ్గులేకుండా ఆ ఎయిర్‌పోర్టు కట్టించింది తానే అని జగన్ చెబుతున్నారని విమర్శించారు. ఆ ఎయిర్‌పోర్టుకు కొబ్బరికాయ కొట్టింది మేమేనని, ఇప్పుడు గుమ్మడికాయ కొట్టింది కూడా మేమేనని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి సంబంధించి తమ కలలకు రెక్కలు వచ్చాయన్నారు. ఎయిర్‌పోర్టు ఒక్కటే కాకుండా స్టీల్ ప్లాంటు, గూగుల్, టీసీఎస్, ప్రత్యేక రైల్వే జోన్ వల్ల తమ పిల్లలకు లక్షలాదిగా ఉద్యోగాలు వచ్చే పరిస్థితి ఉత్తరాంధ్రలో కనిపిస్తోందని తెలిపారు.

భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి వస్తే వైసీపీ నేతలకు ఎగతాళిగా ఉందా.. గిరిజనులకు ఆరాధ్య దైవం అల్లూరి సీతారామరాజు పేరు పెట్టినా హేళన చేస్తారా ఎగతాళిగా ఉందా.. బీసీలు, ఎస్టీలు అధికంగా ఉన్న ప్రాంతంలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కట్టడం కూడా వైసీపీ నేతలకు ఎగతాళిగా ఉందా అని ప్రశ్నించారు. అభివృద్ధి చేసినవారిని అభినందించకపోగా క్రెడిట్ చోరీ అంటూ మాయ మాటలు చెబుతున్నారని విమర్శించారు.

హత్యలు చేసిన వాళ్లకు పదవులు ఇవ్వడం, మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన వారిని వెనకేసుకురావడం.. ఇదే జగన్ దృష్టిలో అభివృద్ధి అంటే అని మంత్రి సంధ్యారాణి దుయ్యబట్టారు. ఇంట్లో ఉన్న తల్లిని, చెల్లినే గెంటేసిన వ్యక్తి, రాష్ట్రంలో మహిళలను, ప్రజలను ఎలా గౌరవిస్తాడని ప్రశ్నించారు. తప్పు చేసిన వారు ఎంతటివారైనా సరే తమ ప్రభుత్వం తప్పకుండా శిక్షిస్తుందని స్పష్టం చేశారు.

# జగన్ డైరెక్షన్‌లోనే వైసీపీ నేతల ఆటవిక చర్యలు

- **రాష్ట్రంలో అలజడులకు అరాచక మూకల కుట్ర**
- **మహిళలు, దళిత, బలహీనవర్గాలపై జగన్ పార్టీ నేతల దమనకాండ**
- **నేరాలపై కేసులు పెడితే కక్ష సాధింపు అంటూ బురదజల్లుడు**
- **మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజం**

అమరావతి (చైతన్యరథం): జగన్ డైరెక్షన్ లోనే వైసీపీ నేతలు ఆటవిక చర్యలతో రెచ్చిపోతున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేసారు. వైసీపీ పెంచి పోషిస్తున్న అరాచక శక్తులు రాష్ట్రంలో కలిగిస్తున్న అలజడులపై శాంతిభద్రతలను కాంక్షించే ప్రజలందరూ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఆ పార్టీని రాష్ట్రం నుండి తరిమికొట్టాలని నిశ్చయించుకున్నారని మంత్రి పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం యువత బంగారు భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తుంటే, ఐదేళ్ల పాలనలో చెప్పుకోవడానికి ఏమీ లేని వైసీపీ మాత్రం యువతను రౌడీయిజం, గంజాయి సంస్కృతి వైపు ప్రోత్సహిస్తూ రాజకీయ లబ్ధి కోసం అలజడులు సృష్టిస్తోందని దుయ్యబట్టారు.

ప్రజలకు సేవ చేయడం కాకుండా అరాచకాలు సృష్టించడం, కులాల మధ్య



విద్వేషాలు రెచ్చగొట్టడమే వైసీపీలో కొనసాగడానికి అర్హతగా మారిందని మంత్రి మండిపడ్డారు. తప్పు చేసి దొరికిపోయాక సోషల్ మీడియా ఎక్స్ వేదికగా 'రాజకీయ కక్ష సాధింపు' అని బురదజల్లుతూ బాధితులుగా నటించడం ఆ పార్టీ నైజమని విమర్శించారు. 45 ఏళ్లు దాటిన పేదవాడికి బతికే అర్హత లేదన్నట్లుగా శ్రీకాకుళంలో గొర్రెల కాపరి మరణంపై జగన్ చేసిన వ్యాఖ్యలు ఆయన విపరీత మనస్థత్వానికి, పేదల ప్రాణాలంటే ఉన్న చులకన భావానికి అద్దం పడుతున్నాయన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ఇటువంటి అరాచక శక్తులను కూకటివేళ్లతో పెకిలించి వేస్తామని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు.

కర్నూలు జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి, ఆయన రౌడీ మూకలు రౌడీజంతో ఒక దళిత, బలహీన వర్గానికి చెందిన కుటుంబంపై బరిసెలు లాంటి కర్రలు, మారణాయుధాలతో పడి దౌర్జన్యం చేయడాన్ని మంత్రి పార్థసారధి తీవ్రంగా ఖండించారు. దళిత సోదరి ఇంట్లోకి చొరబడి బట్టలు చింపి అవమానించడమే కాకుండా, బాధితులే బట్టలు చించుకున్నారని నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయానికి తార్కాణమన్నారు. శ్రీకాకుళంలో మహిళా సీఐ అవమానించిన సంఘటన నుండి నేటి వరకు వైసీపీ నేతలు మహిళలపై, దళితులపై దాడులను నిరంతరం కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు ఎంతటి ఘోరాలకు పాల్పడినా జగన్మోహన్ రెడ్డి కనీసం ఖండించకపోగా, వారిని వెనకేసుకొస్తూ ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఒకపక్క ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పు చేసిన సొంత పార్టీ నేతలైనా మందలించి సరైన మార్గంలో పెడుతుంటే, జగన్ మాత్రం తన పార్టీ నేతల అరాచకాలకు ఆసరాగా నిలుస్తున్నారన్నారు. నా ఎస్సీ, నా బీసీ అని నాటకాలు ఆడిన జగన్.. నేడు దళిత మహిళలపై, బలహీన వర్గాలపై దాడులు జరుగుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. రాజ్యాంగ వ్యతిరేక శక్తులు ఎంతటివారైనా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## 20 లక్షల మార్క్ దాటిన 'ఇంటింటికీ తెలుగు దేశం'

- **ఎనిమిదో రోజున 3 లక్షలకు పైగా ఇళ్లకు**
- **క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి నిదర్శనం**
- **నేతలు, శ్రేణులకు యువనేత లోకేష్ అభినందనలు**

అమరావతి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ రెండేళ్ల సుపరిపాలనపై ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం-2026, 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి-సంక్షేమం" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా దిగ్విజయంగా కొనసాగుతోంది. ఎనిమిది రోజుల కిందట మొదలైన ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ఇంటింటి వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరిస్తూ సరికొత్త మైలురాయిని అధిగమించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా, సోమవారం ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షలకు పైగా ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించాయి. దీంతో ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు మొత్తం 20.61 లక్షల ఇళ్ల మార్క్‌ను విజయవంతంగా దాటింది. రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అత్యంత ఉత్సాహంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ సంఖ్యలో ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించి, ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాయి. అన్ని జిల్లాల్లో ప్రజల నుంచి లభిస్తున్న అపూర్వ ఆదరణ ఈ కార్యక్రమంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని తెలుగుదేశంపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ అన్నారు. 20లక్షల మార్క్ దాటడంపై నాయకులు, శ్రేణులను ఆయన అభినందించారు.

చైతన్యరథం

# అర్హులందరికీ 'నేతన్న సేవలో'

- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత స్పష్టీకరణ
- ఏటా చేనేతలకు రూ.25 వేల ఆర్థిక సాయం
- ఈ నెల 7 నుంచి పథకం అమలు, 5 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులకు గడువు
- ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా 'నేతన్న సేవలో' అమలు చేస్తున్నాం
- చేనేతల గౌరవప్రదమైన జీవనమే సీఎం చంద్రబాబు లక్ష్యం
- 7న చీరాలలో జాతీయ చేనేత దినోత్సవం వేడుకలు, హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- చేనేత, జౌళి శాఖాధికారులతో మంత్రి సమీక్ష




అమరావతి (చైతన్యరథం): అర్హులైన చేనేతలందరికీ నేతన్న సేవలో పథకం వర్తింపజేస్తామని, చేనేతలకు ఆర్థిక భరోసాతో కూడిన గౌరవప్రదమైన జీవనం అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్రచేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. నేతన్నలకు ఏటా రూ.25వేల ఆర్థికసాయం అందజేసేలా నేతన్న సేవలో పథకాన్ని రూపొందించారన్నారు. ఈ నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని శ్రీకారం చుడుతున్నామని, అయిదో తేదీలోగా అర్హులైన చేనేతలు దరఖాస్తులు చేసుకోవాలని మంత్రి సవిత కోరారు. రాష్ట్ర సచివాలయంలో అన్ని జిల్లాలకు చెందిన చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేనేతలకు గౌరవ ప్రదమైన జీవనం అందించడమే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అదే సమయంలో చేనేతలకు వ్యక్తిగతంగా ఆర్థిక లబ్ధి కలిగేలా పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టామన్నారు. 50ఏళ్లు నిండిన నేతలన్నకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. ప్రతి చేనేత కుటుంబానికి లబ్ధి కలిగేలా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మగ్గం మీద నేసే నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్ల వరకూ విద్యుత్ ను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఇవే కాకుండా త్రిఫ్ట్ ఫండ్ నిధులు, ముద్రా రుణాలను కూడా అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

## హామీ ఇవ్వకున్నా 'నేతన్న సేవలో...' అమలు

ఎన్నికల్లో హామీ ఇచ్చిన పథకాలతో పాటు హామీ ఇవ్వని పథకాలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. చేనేతలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం అందజేసేలా నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారు. ఈ నెల ఏడో తేదీన జాతీయ దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేతకూ ఏడాదికి రూ.25 వేలు అందించనున్నామన్నారు. చేనేత వృత్తిదారులకు ప్రభుత్వ పరంగా అండాలనే ఉద్దేశంతో నూతన పథకానికి శ్రీకారం చుడుతున్నారన్నారు. చేనేత కుటుంబాలు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

## 5 వరకూ దరఖాస్తులకు గడవు

రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతి నేతన్నకూ నేతన్న సేవలో పథకం ద్వారా ఆర్థిక సాయం అందించాలనేది సీఎం చంద్రబాబు ప్రధాన ఉద్దేశమని మంత్రి సవిత వెల్లడించారు. ఈ నెల అయిదో తేదీ సాయంత్ర అయిదు గంటల్లోగా అర్హులైన నేతన్నలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ నెల ఏడో తేదీ నుంచి ఆర్థిక సాయం పథకాన్ని అమలు చేయనున్నామన్నారు.

అన్ని జిల్లాలకు చెందిన చేనేత, జౌళి శాఖ ఏడీలు నేతన్న సేవలో పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. మీడియాలోనూ సమాచారమివ్వాలని, వీలైనంత ఎక్కువ మంది నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి నేతన్నకూ నేతన్న సేవలో పథకం లబ్ధి కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు లక్ష్య సాధనలో భాగంగా, విమర్శలకు, ఆరోపణలకు తావులేకుండా నేతన్న సేవలో సథకం అమలయ్యేలా అధికారులు పనిచేయాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సోసిడియా మాట్లాడుతూ, ఈ నెల ఆరో తేదీ ఉదయానికి అన్ని జిల్లాల నుంచి లబ్ధిదారుల వివరాలు అందజేయాలన్నారు.

## 7న చీరాలలో జాతీయ చేనేత దినోత్సవం

ఈ నెల ఏడో తేదీన చీరాలలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఆ వేడుకలకు సీఎం చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. అదే రోజు నేతన్న సేవలో పథకానికి ఆయన శ్రీకారం చుడతారన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ర్యాలీలు, చేనేత వస్త్రాల వినియోగంపై ప్ల కార్డులు కూడా ప్రదర్శించాలని మంత్రి సవిత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, అన్ని జిల్లాల ఏడీలు, ఆప్కో అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో ఆక్సిజన్ వినియోగం లెక్కలు తేల్చాలి

- కోవిడ్-19 తర్వాత భారీగా పెరిగిన కొనుగోలు
- ఆసుపత్రుల్లో అక్సిజన్ సరఫరా, వినియోగంపై అధ్యయనం, సిఫారసులకు కమిటీ
- పలుకారణాలతో రూ.105కోట్లతో నిర్మితమై, నిరుపయోగంగా 161 పీఎస్ఏ ప్లాంట్లు
- మరమ్మతులు, నిర్వహణకు భారీ వ్యయం
- పీఎస్ఏ ప్లాంట్ల కొనసాగింపుపైనా నివేదిక ఇవ్వాలి
- సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం



అమరావతి(చైతన్యరథం): కోవిడ్-19 నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఆక్సిజన్ సరఫరా కోసం దాదాపు రూ.105కోట్లతో నిర్మితమై నిరుపయోగంగా మారిన పీఎస్ఏ (ప్రెషర్ స్వింగ్ అడ్సార్పషన్) ప్లాంట్లు, అధిక మోతాదులో ఎల్ఎంఓ (లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్) కొనుగోళ్ల విషయాలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం మంగళగిరి ఏపీఐఐసీ టవర్స్‌లోని వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులతో రెండు గంటలపాటు లోతుగా సమీక్షించారు. ఎల్ఎంఓ కొనుగోళ్లకు సంబంధించి, వాస్తవ డిమాండ్, సరఫరా విషయాలపై రెండు వారాల్లో సమగ్రంగా ఆడిట్ నిర్వహించి, లోపాల గుర్తింపు, సవరణ చర్యలను చేపట్టి, ఆ మేరకు ఎనిమిది ప్రభుత్వాసుపత్రుల్లో రెండు నెలలపాటు అమలుపరిచి అక్టోబరు 15 లోగా సమగ్ర నివేదికను సమర్పించాలని మంత్రి ఆదేశించారు. తద్వారా ఎల్ఎంఓ డిమాండ్, సరఫరాలోని వ్యత్యాసాన్ని గుర్తించి ఆక్సిజన్ కొనుగోలు ఖర్చును వీలైనంత వరకు కొవిడ్-19 పూర్వ స్థితికి తీసుకు రావాలని మంత్రి స్పష్టంచేశారు.

## భారీగా పెరిగిన ఆక్సిజన్ కొనుగోలు వ్యయం

కోవిడ్-19 తీవ్రంగా ఉన్న 2020-21, 2021-22 సంవత్సరాల్లో రూ.95.43కోట్ల మేరకు బోధనా సుపత్రుల్లో ఎల్ఎంఓ కొనుగోలుచేశారు. కోవిడ్-19కు ముందు 2016-20మధ్య కాలంలో (నాలుగేళ్లు) రూ.60.51 కోట్ల మేరకు వ్యయం చేశారు. కోవిడ్ అనంతరం 2022-26 మధ్య నాలుగేళ్ల కాలంలో ఎల్ఎంఓ కొనుగోలు వ్యయం రూ.180.82 కోట్లకు చేరిందని సమీక్షా సమావేశంలో మంత్రి గుర్తించారు. గత నాలుగేళ్లలో కొత్త బోధనాసుపత్రులు, కొత్త ఆసుపత్రులు ఉనికిలోకి రావడం, పడకలు పెరగడం పెరుగుదలకు కొంతమేరకు కారణమైనప్పటికీ అధికారులు వివరించిన ఆక్సిజన్ డిమాండ్, వాస్తవ సరఫరాకు మధ్య భారీ అంతరం కనిపిస్తోందని, దీనిపై లోతుగా పరిశీలించి కొనుగోలు వ్యయాన్ని తగ్గించే దిశగా అవకాశాలను పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. ఈ పరిశీలనకు అనంతపురం బోధనాసుపత్రి (సూపర్ స్పెషాలిటీతో సహా), గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం బోధనాసుపత్రులతోపాటు రెండు జిల్లా, రెండు ఏరియా ఆసుపత్రులను ఎంపిక చేశారు. ఆరోగ్య పథకాల అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్న 'పాత్' సంస్థ ఈ అధ్యయనాన్ని చేపడుతుంది.

## పీఎస్ఏ ప్లాంట్లు ఉపయోగమా..నిర్ధకమా

కోవిడ్-19 నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సాయంతో డీఎంఈ పరిధిలో 62 ఆసుపత్రుల్లో, సెకండరీ హెల్త్ పరిధిలో 100(మొత్తం 162)పీఎస్ఏ ప్లాంట్లను ఏర్పాటుచేశారు. అయితే ఈప్లాంట్ల ద్వారా తయారయ్యే ఆక్సిజన్ ప్యూరిటీ(నాణ్యత), నిర్వహణా నియంత్రణకు సంబంధించి తగిన సాంకేతికసిబ్బందిని నియమించకపోవడం, ఐసీయూ, సాధారణ వార్డులకు ఆక్సిజన్ సరఫరాకు సంబంధించిన నాణ్యతతో నిమిత్తం లేకుండా ఒకే పైపులైన్ వ్యవస్థ ఉండడంవంటి వివిధ కారణాలవల్ల 162కు 161పీఎస్ఏ ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. ఈప్లాంట్ల మరమ్మతులకు డీఎంఈ పరిధిలో రూ.6.20 కోట్లు, నిర్వహణకు ఏటా రూ.2.60కోట్లు, డీఎస్‌హెచ్ పరిధిలో మరమ్మతులకు రూ.4.76కోట్లు, నిర్వహణకోసం ఏటా రూ 6.7కోట్లు అవసరమవుతుందని మంత్రికి అధికారులు వివరించారు. ఈ మేరకు నిధులు ఖర్చుచేసిన ఈ పీఎస్ఏ ప్లాంట్లను పూర్తిస్థాయిలో వినియోగించవచ్చా? ఆర్థికంగా ఈ ఖర్చు సమర్థనీయమా? కాకుంటే ఈ నిరర్థక ప్లాంట్లను ఏంచేయాలన్న విషయాలపై కూడా నివేదిక తెప్పించాలని మంత్రి ఆదేశించారు. రాజస్థాన్ రాష్ట్రంలో పీఎస్ఏ ప్లాంట్ల పనితీరును కూడా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు

## తక్షణ చర్యలకు మంత్రి ఆదేశం

కోవిడ్-19 నేపథ్యంలో భారీగా పెరిగిన ఎల్ఎంఓ కొనుగోలును వీలైనంతమేర తగ్గించేందుకు బోధనా సుపత్రుల్లో తక్షణచర్యలు చేపట్టేలా చూడాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు ఆసుపత్రుల్లో ఎల్ఎంఓ నిల్వ, సరఫరాల్లో ఆక్సిజన్ లీక్ అవుతున్నట్లు సమాచారం ఉన్నందున ఈ విధమైన వృథాను తగ్గించేందుకు వెంటనే పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటుచేయాలని, ఆ మేరకు ఆసుపత్రులకు వెంటనే ఆదేశాలివ్వాలని అధికారులకు సూచించారు. వార్డుల స్థాయిలో, ఐసీయూలో పడకల స్థాయిలో ఆక్సిజన్ సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని రికార్డు చేయాలని కూడా మంత్రి ఆదేశించారు. ఎల్ఎంఓ సరఫరా, వినియోగానికి సంబంధించి అధ్యయన కమిటీ నివేదిక అందిన వెంటనే మరో సమీక్ష నిర్వహించి అక్సిజన్‌కొనుగోలు వాస్తవడిమాండ్ మేరకే జరిగేలా స్పష్టమైన ఆదేశాలను మంత్రిత్వశాఖ జారీ చేస్తుందని మంత్రి సత్యకుమార్‌యాదవ్ వెల్లడించారు ఈ సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్,డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్, ఏడీఎంఈ డాక్టర్ రాధికారెడ్డి, డీఎంఈ జాయింట్ డైరెక్టర్ గణపతిరావు, డీఎస్‌ఎచ్ జాయింట్ కమిషనర్ డాక్టర్ సుజాత, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చైతన్యరథం

## విశాఖ రవాణా ఆధునికీకరణకు

# ఏపీ, మాస్కో ప్రభుత్వాల కీలక ఒప్పందం

*అంతర్జాతీయ రవాణా సదస్సులో ఎంవోయూ*

*ఫలితాలనిచ్చిన మంత్రి లోకేష్ రష్యా పర్యటన*

అమరావతి/మాస్కో(చైతన్యరథం): విశాఖపట్నంలో ఆధునిక,సమర్థవంతమైన,సాంకేతికత ఆధారిత పట్టణ రవాణావ్యవస్థను అభివృద్ధిచేసే దిశగా ఒకకీలక అడుగు వేస్తూ గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) రష్యన్ ఫెడరేషన్‌లోని మాస్కో ప్రభుత్వంతో ఒక అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకుంది. మాస్కోలో జరిగిన 5వ అంతర్జాతీయ రవాణా సదస్సు సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, మాస్కో డిప్యూటీ మేయర్, రవాణా/రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధి విభాగాధిపతి మాక్సిమ్ లిక్సుటోవ్ ఈ ఒప్పందంపై సంతకాలుచేశారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం పార్లమెంట్‌సభ్యుడు ఎం.శ్రీభరత్ హాజరయ్యారు. గత జూన్‌లో మంత్రి నారా లోకేష్ రష్యాపర్యటన ప్రత్యక్ష ఫలితమే ఈ ఒప్పందం కుదిరింది.ఆపర్యటన సందర్భంగా పట్టణ చలనశీలత, అనుసంధానం, రవాణా మౌలిక సదుపాయాలు, సాంకేతికతలో సహ కారాన్ని బలోపేతం చేయడంపై మంత్రి లోకేష్ మాస్కో రవాణా సంస్థ నాయకత్వంతో చర్చలు జరిపారు. విశాఖపట్నం వేగవంతమైన అభివృద్ధిని, ఒక ప్రధాన ఆర్థిక, పారిశ్రామిక, సాంకేతిక కేంద్రంగా గుర్తించి నగరంకోసం అధునాతన రవాణా పరిష్కారా లను అభివృద్ధి చేయడానికి ఇరుపక్షాలు సహకరించు కోవడానికి అంగీకరించాయి. అంతేకాకుండా నిరంతర సాంకేతిక భాగస్వామ్యం, జ్ఞాన మార్పిడి, ప్రాజెక్ట్-స్థాయి సహకారం కోసం ఒక సంస్థాగత చట్రాన్ని సృష్టిస్తుంది.



### మాస్కో అధునాతన రవాణా వ్యవస్థ పనితీరు

మాస్కో ప్రపంచంలోనే అత్యంత విస్తృతమైన, సాంకేతికంగా ఏకీకృతమైన పట్టణ రవాణా నెట్‌వర్క్‌లలో ఒక దానిని నిర్వహిస్తోంది. ఇందులో మెట్రో, బస్సులు,ట్రామ్‌లు,ఎలక్ట్రిక్ బస్సులు, మాస్కో సెంట్రల్ సర్కిల్, మాస్కో సెంట్రల్ డయామీటర్లు ఉన్నాయి. ఈ నగరం ట్రోయికా స్మార్ట్ కార్డ్ ద్వారా ఒక సమీకృత ఛార్జీల చెల్లింపు వ్యవస్థను అభివృద్ధి చేసింది. దీనిని పలు రకాల ప్రజా రవాణా మార్గాలలో ఉపయోగించవచ్చు.మాస్కోకూడా నిజ-సమయ ట్రాఫిక్ పర్యవేక్షణ, ట్రాఫిక్ ప్రవాహాల నియంత్రణ, ప్రజా రవాణా ఆప్టిమైజేషన్, ట్రాఫిక్ సమాచార వ్యాప్తి కోసం ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్‌ను ఉపయోగిస్తుంది. ప్రయాణీకుల సౌకర్యం, రహదారి భద్రత, కార్యాచరణ సామర్థ్యం, ప్రజా రవాణా సేవల విశ్వసనీయతను మెరుగుపరచడానికి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ విజన్, డేటా అనలిటిక్స్, కేంద్రీకృత ట్రాఫిక్-నిర్వహణ వ్యవస్థలను ఎక్కువగా వినియోగిస్తున్నారు.

### ఎంవోయూలో సహకారం అందిపుచ్చుకునే అంశాలు

- ఈ ఒప్పందం ప్రకారం ఆధునిక, సుస్థిర పట్టణ రవాణా వ్యవస్థల అభివృద్ధి, సమీకృత మొబిలిటీ భావనల తయారీ, ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ పరిష్కారాల అమలులో సహకారాన్ని అన్వేషించడానికి జీవీఎంసీ, మాస్కో ప్రభుత్వం కలిసి పనిచేస్తాయి.
- ఇంటెలిజెంట్ ట్రాఫిక్, ప్రజారవాణా నిర్వహణ వ్యవస్థలు
- సమీకృత,డిజిటల్ టికెటింగ్ మౌలికసదుపాయాలు
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా ఆధారిత రవాణా ప్రణాళిక
- స్వయం ప్రతిపత్తి గల రవాణా సాంకేతికతలు, సహాయక మౌలిక సదుపాయాలు
- పట్టణరవాణా డేటా కార్యక్రమాలలో భాగస్వామ్యం
- సుస్థిరమైన, తక్కువ ఉద్గారాలు వెలువరించే రవాణా పరిష్కారాలు
- వాహన, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం
- శక్తి నిల్వ వ్యవస్థలు
- సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, సాంకేతిక నైపుణ్యం యొక్క మార్పిడి, అధికారులు, వృత్తి నిపుణులు కోసం శిక్షణ కార్యక్రమాలు

### సీఎం మార్గదర్శకత్వంలో ఒప్పందం

విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఈ ఒప్పందం కుదిరిందని తెలిపారు. మాస్కో నుంచి విశాఖపట్నం వరకు అధునాతన సాంకేతికతలను, ప్రపంచ అత్యుత్తమ విధానాలను తీసుకురావడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జీవీఎంసీ సంయుక్తంగా మాస్కో ప్రభుత్వంతో కలిసి నిర్దిష్ట ప్రాజెక్టులను అభివృద్ధి చేయడానికి ప్రాధాన్యతాప్రాంతాలను గుర్తించడానికి పనిచేస్తాయని తెలిపారు. ఈ భాగస్వామ్యం విశాఖపట్నంను స్వచ్ఛమైన, అనుసంధానించబడిన, అందుబాటులో ఉండే సాంకేతికతతో కూడిన గ్లోబల్ సిటీగా మార్చాలనే రాష్ట్ర ప్రభుత్వ విస్తృత దృక్పథాన్ని నొక్కి చెబుతుంది.

### స్మార్ట్ మొబిలిటీకి ఆదర్శ నగరంగా విశాఖపట్నం

ఈ సహకారం ద్వారా విశాఖపట్నం బహుళ రవాణా వ్యవస్థల ఏకీకరణ, ప్రయాణీకుల సమాచార వ్యవస్థలు, ట్రాఫిక్ నిర్వహణ, డిజిటల్ చెల్లింపులు, రవాణా-డేటా వినియోగం, సుస్థిర పట్టణ రవాణా రంగాలలో ప్రపంచ ఉత్తమ పద్ధతులను ప్రవేశపెట్టగలదని భావిస్తున్నారు. అంతేకాకుండా ప్రపంచ పోటీతత్వం గల,భవిష్య నగరంగా విశాఖపట్నాన్ని అభివృద్ధి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ఈ ఒప్పందం ప్రతిబింబిస్తుందని మంత్రి నారాయణ పేర్కొన్నారు. మాస్కోతో సహకారం ద్వారా అంతర్జాతీయ పద్ధతులను అధ్యయనం చేసి విశాఖపట్నం కోసం తగిన పరిష్కారాలను స్వీకరించడానికి వీలవుతుందని తెలిపారు. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, ఐఏఎస్ అధికారి ఎస్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ పట్టణ రవాణా, డిజిటల్ పరివర్తన రంగాలలో అధునాతన నైపుణ్యాన్ని జీవీఎంసీకి అందుబాటులోకి తెస్తుందని తెలిపారు.




## దళిత మహిళపై రాక్షస దాడి చేసిన విరూపాక్షికి..

# జగన్ కొమ్ము కాయడం సిగ్గుచేటు

- **ఎమ్మెల్యే విరూపాక్షిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి, ఆ మహిళకు జగన్ క్షమాపణ చెప్పాలి**
- **నేరగాళ్లకు అండగా నిలబడటం ఆయన మానసిక స్థితికి నిదర్శనం**
- **టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపాటు**

అమరావతి (చైతన్యరథం): దళిత మహిళపై రాక్షసంగా దాడి చేసిన వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షికి ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి మద్దతుగా నిలవడం సిగ్గుచేటని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వర్ల రామయ్య మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి చెందిన సుచిత్రపై కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఆయన అనుచరులు వ్యవహరించిన తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన విరూపాక్షి.. దళిత మహిళ ఇంటిపై దాడి చేసి వీధి రౌడీలా వీరంగం సృష్టించడం హేయమైన చర్య అని మండిపడ్డారు. చట్టాలు చేయాల్సిన సభలో సభ్యుడిగా ఉన్న విరూపాక్షి, దళిత మహిళ దుస్తులు చించి ఆమెపై అసభ్యకరంగా ప్రవర్తించిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఇలాంటి నేరం చేసిన వాళ్లకు జగన్ కొమ్ము కాయడం.. అతని మానసిక స్థితిపై సందేహాలు రేకెత్తిస్తోందని విమర్శించారు. దళిత మహిళ గౌరవానికి తీవ్ర స్థాయిలో భంగం కలిగించిన విరూపాక్షిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి ఆమెకు జగన్మోహన్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### సిగ్గు లేకుండా పరామర్శలా?

ఆలూరు నియోజకవర్గం నేమకల్లు గ్రామానికి చెందిన దళిత మాదిగ కులానికి చెందిన సుచిత్ర, ఆమె భర్త నాగరాజు తెలుగుదేశం పార్టీ అభిమానులు. ఈ నెల 1వ తేదీన శేఖర్ యాదవ్, వైసీపీ అభిమాని గిరి మధ్య చిన్నపాటి ఘర్షణ మొదలైంది. దీంతో గిరి ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేయగా ఆయన 200మంది రౌడీలతో వచ్చి శేఖర్ యాదవ్‌ను చితకబాదారు. ఆ తర్వాత శేఖర్ యాదవ్ స్నేహితుడైన నాగరాజు ఇంటిపై దాడికి తెగబడ్డారు. ఇంటి దగ్గర ఉన్న ఆయన భార్య సుచిత్రపై శారీరకంగా దాడి చేశారు. ఒంటిపై ఉన్న బట్టలు చించేసి రాక్షస ఆనందం పొందారు. ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తి దళిత మాదిగ కులానికి చెందిన ఆ ఇంట్లో చొరబడి... ఈ రకంగా చేస్తారా జగన్ మోహన్ రెడ్డీ? ఒక దళిత మాదిగ మహిళపై హేయమైన రీతిలో దౌర్జన్యానికి పాల్పడ్డారు. దుస్తులు చించి మానవ మృగాళ్లలా ప్రవర్తించారు. చిరిగిన తన భార్య దుస్తులు పట్టుకొని చూపిస్తూ ఏంటీ ఈ అన్యాయం అని ఆ భర్త ప్రశ్నిస్తే ఆయనే చించేశాడని దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ జగన్మోహన్ రెడ్డికి, ఆయన పార్టీ ఎమ్మెల్యే విరూపాక్షికి సిగ్గుందా.. ఎమ్మెల్యేగా ఉండే అర్హత ఉందా అని వర్ల రామయ్య నిలదీశారు. మీ పార్టీ వాళ్లు ఏం చేస్తున్నారు.. ఎలా ప్రవర్తిస్తున్నారు.. ఎలా దాడులు చేస్తున్నారు.. ఏ వర్గం మీద ఇట్లా తెగబడుతున్నారు.. మీకు అర్థమవుతోందా జగన్ మోహన్ రెడ్డీ? ఆ మహిళను తాకరాని చోట్ల తాకి ఎమ్మెల్యే రాక్షస ఆనందాన్ని పొందాడు. ఇలాంటి వాళ్లు జగన్ రెడ్డిగా మంచిగా కనిపిస్తారా? ఎమ్మెల్యే విరూపాక్షిని పలకరించడానికి వెళ్తావా? ఇది సిగ్గుపడాల్సిన విషయం కాదా? ఇంతటి నీచానికి పాల్పడిన ఎమ్మెల్యేని అరెస్ట్ చేస్తే, వెళ్లి అతడిని పరామర్శించి ఏం చెబుతావు? మంచిపని చేశారంటూ అభినందిస్తారా అని జగన్‌పై వర్ల రామయ్య విరుచుకుపడ్డారు.



### జగన్ మానసిక స్థితిపై అనుమానాలు

జగన్ మానసిక పరిస్థితిపై అనేక సందేహాలు వస్తున్నాయి. అతను ప్రవర్తిస్తున్న తీరే అందుకు కారణం. జగన్ కేవలం నేరస్థులకే ఎందుకు కొమ్ము కాస్తున్నారు? బాధితులను వదిలిపెట్టి ముద్దాయిలను పలకరించడానికి జగన్ రెడ్డి వెళతారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే సజ్జల రామకృష్ణారెడ్డి అతడిని గుంటూరు మెడికల్ కాలేజీకి తీసుకెళ్లాలి. అక్కడ నిపుణులైన వైద్యులతో జగన్ రెడ్డి పరీక్షలు చేయించుకోవాలని వర్ల రామయ్య సూచించారు.

### నేరగాళ్లంటే అమితమైన ప్రేమ

రోడ్డు ప్రమాదం కేసులో తన కొడుకును తప్పించడానికి అమాయకుడైన మరో యువకుడిని నిందితుడిగా చూపించి కేసును తారుమారు చేసి అరెస్టయిన సీదిరి అప్పలరాజును పరామర్శించడానికి జగన్‌రెడ్డి తాడేపల్లి నుంచి శ్రీకాకుళం వెళ్లారు. తీరా వెళ్లి అక్కడ కలిశారా? కేవలం బల ప్రదర్శన చేయడానికే వెళ్లారు. స్వయంగా డాక్టరైన సీదిరి ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గొర్రెలు కాసుకునే దానయ్యకు వెంటనే వైద్యం అందించి బతికించే ప్రయత్నమే చేయలేదు. తన కొడుకును కేసు నుంచి ఎలా తప్పించాలనే చూసుకున్నాడు. అలాంటి నేరస్థులను పరామర్శించేందుకు వెళ్లి వారికి మద్దతుగా మాట్లాడటం జగన్ మానసిక స్థితిని తెలియజేస్తోంది. అలానే గతంలో తెనాలిలో గంజాయి తాగుతూ, మద్యం సేవిస్తూ దారిన వచ్చిపోయే మహిళలను ఇబ్బంది పెడుతున్న ముగ్గురు రౌడీ షీటర్లను అరెస్ట్ చేస్తే.. వారిని పలకరించడానికి వెళ్లి అక్కడ హంగామా చేయడం జగన్ ప్రస్తుత మానసిక స్థితి బాగాలేదనే విషయాన్ని స్పష్టంగా చెబుతోంది. సొంత భార్యలనే ఛీ కొట్టిన వాళ్లను జగన్ దగ్గరకు చేర్చుకుని వాళ్లకు భరోసా కల్పిస్తాడు. నేరగాళ్లపట్ల జగన్ రెడ్డికి ఎందుకు అంత ప్రేమ అనేది ఎవరికీ అర్థం కాదు. జగన్మోహన్ రెడ్డి ఇటీవల వ్యవహరిస్తున్న తీరును రాష్ట్ర ప్రజలందరూ సునిశితంగా గమనించాలని వర్ల రామయ్య కోరారు.

చైతన్యరథం

# ప్రజలకు సరసమైన ధరలకే నాణ్యమైన సరుకులు

- మార్కెట్ ధరలకంటే తక్కువకు బియ్యం అమ్మకాలు
- బీపీటీ సూపర్ ఫైన్ రూ.52, బీపీటీ రా రైస్‌ను రూ.50 చొప్పున విక్రయం
- రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రయత్నిస్తుంటే.. జగన్ కుట్రలు సిగ్గుచేటు
- నిత్యావసరాల ధరల్ని నియంత్రణలో ఉంచుతామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ




మచిలీపట్నం (చైతన్యరథం): ప్రజలకు నాణ్యమైన సరుకులను అత్యంత సరసమైన ధరలకు అందించడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం 45వ డివిజన్ పరిధిలోని రైతు బజార్ వద్ద సబ్సిడీ ధరకు బియ్యం అమ్మకాల కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్కెట్లో పెరిగిన బియ్యం ధరల నుండి పేదలకు ఉపసమనం కల్పించే లక్ష్యంతో 130 రైతు బజార్ల వద్ద, 500 రైస్ మిల్లుల వద్ద సబ్సిడీ ధరలకు బియ్యం అందిస్తున్నామన్నారు. బహిరంగ మార్కెట్లో బియ్యం సగటు ధరలు రూ.60-65 మధ్య ఉన్నాయి. ఆ భారాన్ని తగ్గించే లక్ష్యంతో బీపీటీ సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ. 52, బీపీటీ రా రైస్‌ను కిలో రూ. 50 చొప్పున విక్రయిస్తున్నారు. గుర్తింపు కార్డును చూపించి ప్రతి ఒక్కరూ గరిష్టంగా 10 కిలోల వరకు బియ్యం కొనుగోలు చేసే వెసులుబాటు కల్పించాం.

రైతులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నాం. మిర్చి, పొగాకు, మామిడి రైతులు సమస్య ఉందని చెప్పగానే అండగా నిలిచాం. ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పిన వెంటనే ఫీడ్ ధరలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాం. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంట్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాం. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తున్నాం. సామాన్యులకు బియ్యం ధరలు భారం కాకుండా చూసేలా సబ్సిడీకి అందించేలా ప్రత్యేక కార్యక్రమం చేపట్టాం. ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో నిత్యం కృషి చేస్తున్నామని మంత్రి రవీంద్ర చెప్పారు.

జగన్ రెడ్డి ఐదేళ్లు అధికారంలో ఉండి రైతుల గురించి, సామాన్యుల గురించి కనీసం పట్టించుకోలేదు. ధరల స్థిరీకరణకు రూ.3000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి దగా చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల్ని అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించుకుంటే.. అక్కడా రకరకాలైన విమర్శలు చేశారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కొబ్బరికాయ కొట్టి శంకు స్థాపన చేశాం. నేడు మళ్లీ మేమే పూర్తిచేశాం. ఉత్త రాంధ్ర ప్రాంతాన్ని వలసలు నివారించి.. ఆ ప్రాంతానికి ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చేలా మార్చాం. కానీ మధ్యలో ఐదేళ్లు అధికారంలో ఉన్న జగన్ రెడ్డి విమానాశ్రయాన్ని పూర్తిచేయకుండా కుట్రలు చేశాడు. ఎర్రబస్సు రాని చోటకు ఎయిర్ బస్సు అవసరమా అని అవహేళన చేశాడు. అడ్డుకుంటామని, భూములు ఇవ్వొద్దని రైతుల్ని రెచ్చగొట్టాడు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పూర్తి చేయగానే క్రెడిట్ చోరీకి తాపత్రయ పడుతున్నాడు. రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం శ్రమిస్తుంటే.. జగన్‌రెడ్డి రోజుకో కుట్ర, పూటకో కుతంత్రంతో రాజకీయం చేయాలనుకుంటున్నాడని మంత్రి రవీంద్ర ధ్వజమెత్తారు.

నిత్యావసరాల ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి పని చేస్తోంది. అవసరమైతే రైతు బజార్లలో అన్ని రకాల సరుకులు కూడా అందుబాటులో ఉంచుతాం. వీలైనంత వరకు ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో ఉంచే లక్ష్యంతో పని చేస్తున్నాం. ప్రజల కోసం పని చేస్తున్నది ఎవరో.. ప్రజలతో రాజకీయం చేసి జేబులు నింపుకుంటున్నది ఎవరో ప్రజలు గుర్తించాలని మంత్రి కొల్లు రవీంద్ర విన్నవించారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యవసాయ భూమి కబ్జాకు యత్నం





- ఒంటరి మహిళను బెదిరించి ఇల్లు గుంజుకోవాలని చూస్తున్నారు
- ఇళ్ల పట్టాల పేరుతో వైసీపీ ప్రభుత్వం దగా.. 75 కుటుంబాలను ఆదుకోవాలి
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో అర్జీల వెల్లువ
- వినతులు స్వీకరించిన మంత్రి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు

అమరావతి (చైతన్యరథం): వివిధ సమస్యలతో బాధ పడుతున్న ప్రజలు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చి సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో అర్జీలు సమర్పించారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

తనకు వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమిని తన బంధువొకరు ఆన్‌లైన్‌లో అతడి పేరుమీద మార్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన కడియం దేవదాసు విన్నవించుకున్నారు. పెదపరిమి గ్రామంలో సర్వే నెం. 570/923లో 47 సెంట్లు వ్యవసాయ భూమి తమ తాత ద్వారా వారసత్వంగా వచ్చిందన్నారు. గత 50 సంవత్సరాలుగా ఆ భూమి పాసు పుస్తకాలు, అండగల్, వన్ బీ నా పేరు మీదునే ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా తన బంధువు ఒకరు ఆయన పేరు మీదుగా మార్చుకోవాలని చూస్తున్నారు. దీనిపై హైకోర్టులో దావా వేయగా కేసు నడుస్తోంది. ఈ సమయంలో కోర్టు నిబంధనలకు విరుద్ధంగా భూమి లాక్కోవాలని చూస్తున్నారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపి తమ భూమికి రక్షణగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం బ్రహ్మంపల్లి గ్రామానికి చెందిన బత్తుల అరసమ్మ అర్జీ ఇచ్చి.. తమ సొంత ఇంటిని గ్రామంలోని ఒక వ్యక్తి బలవంతంగా ఆక్రమించుకోవాలని చూస్తున్నారని తెలిపారు. ఒంటరి మహిళగా ఉన్న నన్ను బెదిరించి ఇల్లు తీసుకోవాలని చూస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా అంతగా పట్టించుకోవడం లేదు. తనకు ఇద్దరు పిల్లలని, భర్త 2022లో చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

గుంటూరు జిల్లా తెనాలి మండలం కటెవరం గ్రామానికి చెందిన శీలం ఏసమ్మ అర్జీ ఇచ్చి.. గ్రామంలో వార్పు కాలవకట్ట మీద సుమారు 120 కుటుంబాలు గత 15 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో 75 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించ లేదన్నారు. తాము నిరుపేదలమని ప్రభుత్వమే తమకు స్థలాలు చూపించి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

ప్రకాశం జిల్లా వలేటివారిపాలెం మండంలం, పోలినేనిపాలెం గ్రామానికి చెందిన పోకూరి మాల్యాద్రి అర్జీ ఇచ్చి.. గ్రామంలోని సర్వే నెం. 116/1లో 84 సెంట్లు భూమి ప్రస్తుతం తన స్వాధీనంలో ఉందన్నారు. దీనిలో నేను సాగు చేసుకుంటున్నాను. ఈ భూమిని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించారు. అంతే కాకుండా అడ్డు తిరిగిన మాపై దౌర్జన్యం చేస్తున్నారు. దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అర్బన్ రాజరాజేశ్వరి పేటకు చెందిన రఘువంశి ఝాన్సీరాణి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి.. తాము గత కొన్నేళ్లుగా రాజరాజేశ్వరి పేటలో ఉంటూ,బట్టల వ్యాపారం చేస్తున్నామన్నారు. గత ఏడాది వరదలు కారణంగా సమస్తం కోల్పోయి రోడ్డున పడ్డాం. అంతేకాకుండా 2025 ఫిబ్రవరిలో తన భర్తకు రక్తపింజరి పాము కరవడంతో ఆసుపత్రి పాలయ్యారు.దీంతో కుటుంబ ఆర్థికపరిస్థితి మరింత దారుణంగా మారింది.పిల్లల ఫీజులు, డ్వాక్రా రుణాలు ఉండటంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

వీటితో పాటు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై పలువురు అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.




### వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టుపై

## ఏపీ అసెంబ్లీ బులెటిన్ విడుదల

కర్నూలు(చైతన్యరథం):ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అరెస్టు వ్యవహారంపై ఏపీ శాసనసభ కార్యదర్శి జనరల్ కార్యాలయం బులెటిన్ విడుదల చేసింది. శాసనసభ సభ్యులందరికీ సమాచారం అందిస్తూ జారీ చేసిన ఈ బులెటిన్‌లో ఎమ్మెల్యే అరెస్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బులెటిన్ ప్రకారం.. ఆగస్టు 2వ తేదీ తెల్లవారు జామున 3 గంటలకు కర్నూలు జిల్లా చిప్పగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో విరూపాక్షిని పోలీసులు అరెస్టు చేశారు. ఎమ్మెల్యేను ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరెస్టు చేసినట్లు బులెటిన్‌లో వెల్లడించారు. చిప్పగిరి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 37/2026 కేసులో అరెస్టు అయినట్లు పేర్కొన్నారు. ఈకేసులో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) లోని పలు సెక్షన్ల కింద కేసునమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లోనే నమోదైన మరోక్రైమ్ నంబర్ 38/2026కేసులోనూ ఎమ్మెల్యే ఏ-1గా ఉన్నట్లు అసెంబ్లీ బులెటిన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో బీఎన్ఎస్ సెక్షన్లతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కూడా కేసులు నమోదు చేసినట్లు ఎమ్మెల్యేలకు సమాచారం ఇచ్చారు. శాసనసభ్యుడి అరెస్టు జరిగిన నేపథ్యంలో సభా నిబంధనలప్రకారం సభ్యులందరికీ వివరాలు తెలియజేస్తూ అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ఈ బులెటిన్ జారీచేశారు. కాగా శనివారం చిప్పగిరి మండలం నేమకల్లు, సంగాల గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలపై వందలాది మంది అనుచరులతో ఎమ్మెల్యే విరూపాక్షి దాడి చేశారు. పలువురు టీడీపీ కార్యకర్తల ఇళ్లపైకి వెళ్లి ఆడ,మగ అనేతేడా లేకుండా తీవ్రంగా గాయపరిచారు. దీంతో బాధితుల ఫిర్యాదుమేరకు ఎమ్మెల్యే విరూపాక్షి సహా 34మంది పై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో 16 మందిని అరెస్టు చేయగా ఆలూరు కోర్టు రిమాండ్ విధించింది.

# మినీ మార్టుల ద్వారా ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం

- పారదర్శకంగా డీఎస్సీ నియామకాలు
- డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు కోడిగుడ్డుపై ఈకలు పీకడమే
- పొగాకు రైతులకు అండగా కూటమి ప్రభుత్వం
- అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



ప్రకాశం / కొండపి: ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరలకు అందుబాటులో ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చెప్పారు. బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో మార్కెట్ ఇంటర్వెన్షన్ కార్యక్రమం ద్వారా తక్కువ ధరకు వీటిని అందించేలా రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లు, గుర్తించిన రైస్ మిల్లుల ద్వారా ప్రత్యేకంగా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కొండపిలోని సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మినీ మార్టును జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారితో కలిసి సోమవారం మంత్రి ప్రారంభించారు. అర్హులకు బియ్యం బస్తాలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డా.స్వామి మాట్లాడుతూ.. బహిరంగ మార్కెట్లో బీపీటీ స్టీమ్ బియ్యం కిలో రూ.62లకు పైగా ధర ఉందని, ప్రత్యేకంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ విక్రయ కేంద్రాలలో కిలో రూ.52కే అందిస్తున్నామన్నారు. అదేవిధంగా బీపీటీ రా రైస్ కిలో రూ.58 వరకు ధర ఉందని, వీటిని ప్రత్యేక కేంద్రాలలో రూ.50కే అందిస్తున్నామని చెప్పారు. రేషన్ కార్డుదారులకు ప్రతి మనిషికి నెలకు 10 కిలోల చొప్పున వీటిని పంపిణీ చేస్తామని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో 4 రైతు బజార్లు, మరో 20 రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వీటిని అందిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలుదారులు తమ ఆధార్ కార్డును తీసుకు వెళ్లాల్సి ఉంటుందని మంత్రి చెప్పారు. నెల్లూరు మొలకల బియ్యం కూడా అందించాలని ప్రజలు కోరుతున్నారని, డిమాండ్‌ను బట్టి వీటిని కూడా అందించేలా పరిశీలించాలని అధికారులకు ఆయన సూచించారు. ధరల భారం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఈ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీని ద్వారా ఒక్కో కిలోకు రూ.10 నుంచి రూ.12 వరకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి చెప్పారు. పెన్షన్లు, దీపం, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనమే దీనికి నిదర్శనం అన్నారు. అర్హులందరికీ ప్రయోజనం కల్పిస్తామన్నారు. నూతన గృహాలను కూడా ఈ నెలలోనే ఇస్తామన్నారు. డీఎస్సీ నియామకాలను అత్యంత పారదర్శకంగా చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్పోర్ట్ కోసం 2014-19 కాలంలో భూములను తమ ప్రభుత్వం సేకరించిందని, గత ప్రభుత్వంలో కేవలం 27% మాత్రమే పనులు జరిగాయని, తమ ప్రభుత్వం వచ్చాక వాటిని వేగవంతం చేసి, పూర్తి చేసి, ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తెచ్చామని ఆయన వివరించారు. వెలిగొండ ప్రాజెక్టు నుంచి పాలేరుకు నీరు వస్తుందని, మూసీ నదిపై ఆధారపడే వారికి కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని మంత్రి చెప్పారు. సంగమేశ్వరం ప్రాజెక్టుకు వచ్చే నెలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వస్తారని ఈ సందర్భంగా స్వామి ప్రకటించారు. పొగాకు రైతుల సంక్షేమంపైనా దృష్టి సారించామన్నారు. ఒక్కో బ్యారన్‌కు వడ్డీ లేకుండా రూ.50వేల రుణం ఇప్పిస్తామని, రెండేళ్లలో తిరిగి చెల్లించే వెసులుబాటు కల్పిస్తామని మంత్రి తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి పునరుద్ఘాటించారు.

## ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు ఆకాంక్ష

- పేదల విద్య, వైద్యం ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట
- సీఎం చంద్రబాబు పేదలకు మేలు చేస్తుంటే.. వైసీపీ ఓర్వలేకపోతోంది
- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి
- ప్రకాశం జిల్లా తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి డాక్టర్ స్వామి

ప్రకాశం/తూర్పు నాయుడుపాలెం: ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెండేళ్ల కూటమి పాలనలో కొండపి నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.15 కోట్లకు పైగా విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల్ని పంపిణీ చేశాం. ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష. పేదల విద్య, వైద్యం ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పి4తో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. సీఎం చంద్రబాబు పేదలకు మేలు చేస్తుంటే.. వైసీపీ ఓర్వలేక రాష్ట్రంలో శవ, కుల రాజకీయాలు చేస్తోంది. వైసీపీ ఓ విషవృక్షం, ప్రజలు దాన్ని కూకటి వేళ్లతో పెకిలించాలి, లేకుంటే రాష్ట్రానికి ప్రమాదకరమని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.



## ఏపీటీడీసీలో సమగ్ర సంస్కరణలకు శ్రీకారం

**- అధికారులతో సమీక్షలో చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ**

విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో పరిపాలనా సంస్కరణలు, పారదర్శకత, ఆదాయ వృద్ధి లక్ష్యంగా సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ తెలిపారు. సోమవారం విజయవాడలోని ఏపీటీడీసీ కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్లతో నిర్వహించిన సమగ్ర సమీక్ష సమావేశంలో ఆయన కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

సంస్థ పనితీరు, ఆదాయ వృద్ధి, పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా సంస్కరణలపై విస్తృతంగా చర్చించిన అనంతరం అధికారులు తక్షణం అమలు చేయాల్సిన పలు ఆదేశాలను చైర్మన్ జారీ చేశారు.



### ప్రధాన నిర్ణయాలు

వినియోగానికి పనికిరాని స్క్రాప్, పాత బస్సులు, కంటైనర్లు, తదితర ఆస్తులను గుర్తించి, నిబంధనల ప్రకారం వీలైనంత త్వరగా బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని ఆదేశించారు. 2019 నుంచి 2024 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా ఏపీటీడీసీకి కేటాయించిన ఎస్ఈడీ టికెట్ల వ్యవహారంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో సమగ్ర విచారణ నిర్వహించాలన్నారు. అన్ని డివిజనల్ మేనేజర్లు తమ పరిధిలోని ఏపీటీడీసీ హోటళ్లతో పాటు నిర్వహణ కింద ఉన్న హోటళ్ల ప్రచారాన్ని ముమ్మరం చేసి ఆక్యుపెన్సీ, ఆదాయాన్ని పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అందరు డివిజనల్ మేనేజర్లు తమ అధికారిక పర్యటనల వివరాలను జీపీఎస్ లొకేషన్‌తో కూడిన టూర్ డైరీ రూపంలో సమర్పించాలని, తద్వారా పరిపాలనలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందన్నారు.

### ప్రత్యేక ఉప సంఘం ఏర్పాటు

ఏపీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి నాలుగు అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని చైర్మన్ ఆదేశించారు. ఏపీటీడీసీ డివిజన్ల పునర్వ్యవస్థీకరణ. లక్ష్యాలను సాధించిన యూనిట్ మేనేజర్లకు ప్రోత్సాహకాలు (ఇన్సెంటివ్స్) అందించే విధానంపై ప్రతిపాదనలు. ప్రతి డివిజన్‌కు జీఎం కేడర్ స్థాయి ప్రత్యేక అధికారుల నియామకంపై అధ్యయనం. ఏపీటీడీసీ హోటళ్లను ఆదాయ సామర్థ్యం ఆధారంగా ఏ,బీ,సీ,డీ కేటగిరీలుగా వర్గీకరించే విధానంపై నివేదికలు ఇవ్వాలన్నారు.

### రానున్న సమావేశాలు

రాష్ట్రంలో జల ఆధారిత పర్యాటకాన్ని విస్తరించేందుకు ఈ నెల 10న ఏపీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు భారత అంతర్గత జలమార్గాల సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సమక్షంలో సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ సమావేశంలో హౌస్‌బోట్లు, వాటర్ స్పోర్ట్స్, జల సాహస క్రీడలు, తదితర నీటి ఆధారిత పర్యాటక అవకాశాలపై చర్చించనున్నారు. అలాగే 12న అన్ని డివిజనల్ మేనేజర్లు, యూనిట్ మేనేజర్లతో రెండో సమీక్ష సమావేశం నిర్వహించి, నిర్దేశించిన ఆదేశాల అమలు పురోగతిని సమీక్షించనున్నట్లు వెల్లడించారు.

ఈ సమీక్ష సమావేశంలో జనరల్ మేనేజర్లు విజయ రాజ్యలక్ష్మి, హేమమాలిని, వేణుగోపాల్, శివారెడ్డి, పుష్ప రాజేష్, వీరనారాయణ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్ జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలిపే దిశగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పనిచేయాలని చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పిలుపునిచ్చారు.

# దళితుల ఆశాజ్యోతి చంద్రబాబు

- 59 ఉప కులాలకు సమదృష్టితో న్యాయం
- వర్గీకరణ నుంచి సంక్షేమ పథకాల అమలు వరకు కూటమి మార్కు పాలన
- జగన్ హయాంలో హత్యాకాండలు, అణచివేత



కరెంట్ అనాలిసిస్

తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం

**కొడాలి సిరి,** అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

దళితులను చిన్నచూపు చూస్తున్న నేటి సమాజంలో మనుషులంతా ఒక్కటే... పేదవారు అంటూ ఎవరూ ఉండకూడదు... లోకం దృష్టిలో అందరూ సమానులే అనే నినాదంతో కూటమి ప్రభుత్వం దళితుల్లోని 59 కులాలను సమదృష్టితో చూస్తూ అంతర్గత సామాజిక న్యాయం చేయాలనే సత్సంకల్పంతో దళిత సామాజిక "వర్గీకరణ" చేసింది. అదే స్ఫూర్తితో దళిత వర్గంలోని అన్ని కులాలను ఒకే రీతిలో అభివృద్ధి పథంలో నడపాలనేది కూడా సీఎం చంద్రబాబునాయుడు ఆశయం.

చంద్రబాబు దూరదృష్టితో ఆనాడు లోక్‌సభ స్పీకర్‌గా దళిత వర్గానికి చెందిన జీఎంసీ బాలయోగి, శాసనసభ స్పీకర్‌గా ప్రతిభా భారతి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కాకి మాధవరావు పదవులు పొందారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాతే దళిత వర్గాలకు చెందిన నాయకులను హోం, రెవెన్యూ, ఆర్థిక, నీటి పారుదల... వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన శాఖలకు మంత్రులుగా నియమించారు. చంద్రబాబు మొట్టమొదటిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన వెంటనే రాష్ట్రంలో ఉన్న సామాజిక రుగ్మతలను సమూలంగా నిర్మూలించడం కోసం, జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పాటు, వారు సూచించిన 42 సిఫార్సులకు ఏకగ్రీవ ఆమోదం తెలపడం, గతంలో ఏనాడూ లేని రీతిలో మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో 'ఎస్సీ కమిషన్' ఏర్పాటు చేసి దళిత హక్కులను కాపాడిన అపర అంబేడ్కర్ మన అధినేత చంద్రబాబు.

## కూటమి ప్రభుత్వంలో ఎస్సీల అభివృద్ధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఎస్సీలకు రూ.59,422 కోట్లు కేటాయించారు. వైసీపీ హయాంలో ఐదేళ్లకు కలిపి ఎస్సీలకు రూ.64,261 కేటాయించి దాంట్లో రూ.28వేల కోట్లను దారిమళ్లించారు. ఎస్సీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్, ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీలపై దమనకాండ జరిగింది. వారిని ప్రోత్సాహించే విధానాలను రద్దుచేసి అణచివేసే విధానాలకు శ్రీకారం చుట్టారు. దళిత యువకులు విదేశాల్లో విద్య అభ్యసించేలా రాయితీ ఇచ్చే పథకాన్ని చంద్రబాబు తీసుకొచ్చారు. చంద్రబాబు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇన్నోవా కార్లు ఇచ్చి డ్రైవర్లను ఓనర్లు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీలకు గృహ నిర్మాణానికి అదనంగా రూ.50వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఎస్సీ కాలనీల్లో రోడ్లు, ఇతర సదుపాయాలకు రూ.238.38 కోట్లు ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బడ్జెట్‌లో రూ.341 కోట్లు కేటాయించారు. 29 ఎస్సీ హాస్టళ్ల నిర్మాణానికి రూ.100 కోట్లు ఖర్చు చేశారు. రూ.143 కోట్లతో సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులు పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌లో నీట్ కోచింగ్ కేంద్రాలను 3 నుంచి 10కి పెంచారు. బాబూజగ్జీవన్‌రామ్ పథకం కింద ఎస్సీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. ఎస్సీ ఉప వర్గీకరణ కింద గ్రూప్-1లో 12 ఉప కులాలకు 1శాతం, గ్రూప్-2లో 18 ఉప కులాలకు 6.5 శాతం, గ్రూప్-3లో 29 ఉప కులాలకు 7.5 శాతం రిజర్వేషన్ల అమలుకు కృషి చేశారు. ఉన్నతి పథకం కింద ఎస్సీ మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నారు. డాక్టర్ సుధాకర్ కుమారుడికి డిప్యూటీ తహసీల్దారుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఆ కుటుంబానికి రూ. కోటి ఆర్థిక సాయం అందించారు.

## దళిత ద్రోహి జగన్

నా ఎస్సీలంటూ దీర్ఘాలు తీసిన జగన్ రెడ్డి గత ఐదేళ్లలో నోరెత్తిన దళితులపై రాజకీయ అస్త్రం ప్రయోగించి వాళ్ల నెత్తురు కళ్లజూశాడు. రాష్ట్రంలో ఉన్న దళితుల రక్తం పీల్చుకుతాగాడు. దళితులేగా... వాళ్లను ఏం చేసినా ఎవడేం చేస్తాడులే అని విర్రవీగిపోయారు వైసీపీ నాయకులు. దళితుల భూముల్ని అందినకాడికి దోచుకున్నారు. ప్రశ్నిస్తే దాడులు, ఎదురుతిరిగితే ఏకంగా పాడె ఎక్కడమే అన్నట్టు నడిచింది వైసీపీ హయాంలో. జగన్ పరిపాలనలో దళితులపై నేరాలు నిత్యకృత్యమయ్యాయి. దళిత మహిళలన్నా కనికరం లేదు. రోగుల ప్రాణాలు కాపాడే డాక్టరన్నా గౌరవం లేదు. చివరికి కళ్లు లేని మహిళలపట్లా కరుణ లేదు. దళితులంటే జగన్‌రెడ్డికి ప్రేమే లేదు. ఎన్నికల సమయంలో మాత్రమే ఆయనకు దళితుల యోగక్షేమాలు గుర్తుకొస్తాయి. ఓట్లు కోసం దళితులు కావాలి, పక్కన కూర్చోడానికి మాత్రం దళితులు వద్దు. దళితుల ఓట్లతో రాజకీయ పీఠమెక్కాలి. వాళ్ల ధన, మాన, ప్రాణాలకు మాత్రం రక్షణ కరువు. గత ఐదు సంవత్సరాల్లో జగన్ రెడ్డి దళితులపై చూపించిన కపట ప్రేమ ఇదే. ఇలాంటి దళిత ద్రోహి హయాంలో జరిగిన కొన్ని సంఘటనలు...

## డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య

నేతి బీరకాయలో నెయ్యి ఉండదు.. జగన్ రెడ్డి మాటలో నిజం ఉండదు... 'దళితులపై దాడులను ఉపేక్షించేది లేదు.. బాధ్యులు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవు" అని నీతులు బోధిస్తారు జగన్‌రెడ్డి. అయితే వైసీపీ హయాంలో దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంపై హత్య జరిగితే దానికి బాధ్యుడైన అనంతబాబుపై జగన్ ఎందుకు కఠిన చర్యలు తీసుకోలేదు. నేర అభియోగాలున్న వ్యక్తిని వెంటేసుకుని తిరుగుతావు. మొన్న జనవరిలో జరిగిన ఒక సభలో అనంతబాబును ముందు వరుసలో కూర్చోబెట్టి ఎంతో ప్రాధాన్యతనిచ్చావు. దళితులను చంపుకు తినే తోడేళ్లను సాకడ మంటే జగన్‌కు మహా ఇష్టమని నిరూపించుకున్నాడు. అనంతబాబును జగన్ రెడ్డే ముద్దు చేస్తుండడంతో పోలీసులు కూడా అతనికి సాగిలపడుతున్నారు.

***(నా ఎస్సీలు అని ఊదరగొట్టే జగన్‌రెడ్డి దళితుల రక్తంతో చేతులు కడుక్కోవడమంటే మహా ఇష్టం)***

## తాడిప్రతిలో దళిత సీఐ ఆత్మహత్య

గత ఐదు సంవత్సరాల్లో పోలీసులను పాలేరుల్లాగా వాడుకున్నారు. జగన్ రెడ్డికి వత్తాసు పలికే పోలీసులు అయితేనే పదవిలో కొనసాగాలి లేదంటే పాడె ఎక్కాలి అని జగన్ తన రాజ్యాంగంలో రాసుకున్నాడు కాబట్టే అనంతపురంజిల్లా తాడిపత్రిలో విధులు నిర్వహిస్తున్న దళిత సిఐ ఆనందరావు తను అద్దెకు ఉంటున్న ఇంట్లోనే బలవన్మరణానికి పాల్పడ్డారు. అతని ఆత్మహత్య వెనుక రాజకీయ ఒత్తిళ్లే కారణం. కులాన్ని కించపరిచేలా పలుమార్లు వైసీపీకి చెందిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, డీఎస్పీ గంగయ్య పదేపదే మాట్లాడి ఆనందరావును వేధించారు. దళితులకు కూడా ఒక మనసు ఉంటుందని వాళ్ల కులాన్ని తక్కువ చేసి మాట్లాడితే వాళ్ల ఆత్మవిశ్వాసం కుంగిపోతుందనన్న విషయం జగన్‌రెడ్డికి తెలిసి కూడా తెలియనట్టు నటిస్తున్నాడేమో. పెద్దారెడ్డి చెప్పిన పనులు చేయలేక, టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టలేక ఆయన తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి జగన్ రెడ్డే కారణం. అంతా ఆయన కనుసన్నల్లోనే జరిగింది.

***(నా ఎస్సీలు అని ప్రగల్భాలు పలికే జగన్‌రెడ్డి దళితుల ఆత్మవిశ్వాసాన్ని చంపేశాడు)***

## అధికార దాహంతో కోడికత్తి డ్రామా

2018 అక్టోబరు 25న జనుపల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తి జగన్‌రెడ్డిపై దాడి చేసిన సంగతి తెలిసిందే. జగన్ ఆ సమయంలో ఇది చిన్నగాయమేనంటూ ప్రాథమిక చికిత్స కోసం హైదరాబాదు వెళ్లి అక్కడ ఆస్పత్రిలో చేరారు. ఈ కేసును వైసీపీ రాజకీయంగా ఉపయోగించుకుంది. టీడీపీ నాయకులే జగన్‌ను హత్య చేయడానికి శ్రీనివాసరావును పావుగా వాడుకున్నారని ప్రచారం చేశారు. కోడికత్తితో జగన్‌కు గాయమైతే కనీసం చొక్కా కూడా చిరగలేదు. ఈ ఘటన దర్యాప్తులో ఎవరూ దాడిని ప్రత్యక్షంగా చూడలేదని ఎన్ఐఏ కోర్టు సేకరించిన సాక్ష్యాల్లో బయటపడింది. అసలు ఈ దాడిలో రక్తంతో కూడిన తెల్ల చొక్కా తప్పా ఆధారాలు ఏమీ లేవు. సీసీ కెమెరాలు లేనిచోట ఇలాంటి ఘటన జరగడం కుట్రపూరితం కాదా? అమాయకుడైన శ్రీనుని ఐదేళ్లు జైల్లో మగ్గబెట్టి అతడి తల్లిదండ్రులను కష్టాలపాల్జేశారు. నిజంగా కోడికత్తితో దాడి జరిగి ఉంటే జగన్ అధికారంలోకి వచ్చాక పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి ఉండాల్సింది. ఈ దాడిలో వాడిన కోడికత్తికి కర్త, కర్మ, క్రియ అన్నీ మంత్రి బొత్స మేనల్లుడే. కోడికత్తి కేసులో విచారణకు హాజరైతే వాస్తవాలు వెల్లడవుతాయనే సీఎం జగన్ ఎన్ఐఏ కోర్టుకు కూడా హాజరుకాలేదు.



***(నా ఎస్సీలంటూ నీతులు బోధించే జగన్‌రెడ్డి పూట గడవడం కోసం ప్రాకులాడే దళిత యువకుడిని ఐదేళ్లు జైల్లో మగ్గబెట్టాడు)***

## కోనసీమ అల్లర్లు

ప్రశాంతంగా ఉండే కోనసీమ జిల్లాలో కులచిచ్చు పెట్టేందుకు జగన్మోహన్ రెడ్డి భారీ కుట్రకు పాల్పడ్డాడు. కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టి దాన్ని వివాదంగా మలచి కులాల మధ్య కుంపటి రాజేసేందుకు విఫలయత్నం చేశాడు. కోనసీమ జిల్లా పేరును డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా పేరు మారుస్తూ ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్‌పై మొదలైన  ఆందోళన తీవ్రరూపం దాల్చింది. పోలీసు ఆంక్షలను ఉల్లంఘించి వందల మంది రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. కోనసీమ జిల్లాకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును పెట్టడం ఇష్టం లేక, కుల చిచ్చును రేపేందుకు వైసీపీ మంత్రి పినిపే విశ్వరూప్ ఇంటిని వైసీపీ కార్యకర్తలే తగులబెట్టి వాటిని టీడీపీకి అంటగట్టాలని కుట్ర పన్నారు. తన ఇంటిని తగులబెట్టిన వైసీపీ కార్యకర్తతో విశ్వరూప్ కుమారుడు మాట్లాడిన ఫోన్ కాల్ సంభాషణ బయటకు రావడంతో వైసీపీ నేతలు నోరుమూసుకున్నారు.

***(కులాలు, మతాలు భేదం లేదు అని చెప్పే జగన్ రెడ్డి దళితుల మనోభావాల్ని మంటల్లో కాల్చేశారు)***

కరోనా సమయంలో మాస్కులు అడిగినందుకు గౌరవ ప్రదమైన వృత్తిలో ఉన్న దళిత డాక్టర్ సుధాకర్‌ను నడిరోడ్డుపై బట్టలు లేకుండా నిల్చోబెట్టి పోలీసులతో లాఠీలతో కొట్టించి సైకో ముద్ర వేసి మానసిక వైద్యశాలలో వేశారు. కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించిన తర్వాత ఆయనకు ఊరట లభించింది. ఆయన్ను తిరిగి విధుల్లోకి తీసుకోకపోవడంతో మానసిక వేదనకు గురైన డాక్టర్ సుధాకర్ ఏడాది తిరక్కుండానే గుండెపోటుతో మరణించారు.

చిత్తూరు జిల్లా సోమల మండలం కందుకూరులో వైసీపీ కార్యకర్త ఓంప్రతాప్ మదనపల్లెలో ఓ మద్యం దుకాణం వద్ద  నాణ్యత లేని మద్యాన్ని అధిక ధరలతో విక్రయిస్తున్నారు అని జగన్ ను దూషించిన వీడియో వైరల్ అయిన మరుసటిరోజే అనుమానాస్పద రీతిలో మరణించాడు.

***(నా ఎస్సీలంటూ సుద్దులు చెప్పే జగన్‌రెడ్డి దళితుల నెత్తురు చూడకుండా ఒక్కరోజు కూడా ఉండలేదు)***

తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్రంలో మహిళకు ఏం న్యాయం చేస్తారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ప్రజలు పడని పాట్లు లేవు. మరోసారి జగన్ రెడ్డికి రాష్ట్రాన్ని అప్పగిస్తే ఏం చేస్తాడో అర్థమైంది. అందుకే ప్రజలు జగన్‌కి తగిన బుద్ధి చెప్పారు. ఒక్క ఛాన్స్ అంటూ దళితుల్ని ఆకట్టుకుని రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాడు. దళితులకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిన నీచుడు జగన్ రెడ్డి. పదవి కోసం ఎన్ని ప్రాణాలైనా బలిగొనడానికి వెనకాడని వ్యక్తి జగన్.




రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన శాఖల్లో ఎక్సైజ్ ఒకటి. ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చే ఈ రంగం సమర్థంగా పనిచేస్తే సంక్షేమ కార్యక్రమాలకు, అభివృద్ధి ప్రాజెక్టులకు మరింత బలం చేకూరుతుంది. కానీ గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ వ్యవస్థ పారదర్శకత కోల్పోయింది. వినియోగదారుల అభిరుచులను పక్కనపెట్టి, మార్కెట్ సహజ స్వరూపాన్ని దెబ్బతీసే విధానాలు అమలయ్యాయని విస్తృత విమర్శలొచ్చాయి. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎక్సైజ్ రంగాన్ని పూర్తిగా పునరుద్ధరించాలని సంకల్పించింది. గత రెండేళ్లలో అమలు చేసిన సంస్కరణలు, సాంకేతిక మార్పులు, పారదర్శక విధానాలు రాష్ట్ర ఎక్సైజ్ వ్యవస్థకు కొత్త రూపాన్ని తీసుకొచ్చాయి.

# ఎక్సైజ్ రంగం సంస్కరణల యుగం

## పారదర్శకత, నాణ్యత, వినియోగదారుల స్వేచ్ఛ, డిజిటల్ పాలనతో కొత్త దిశగా ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ వ్యవస్థ

### విధ్వంసకర విధానాల నుంచి పునర్నిర్మాణం వరకు

ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎక్సైజ్ రంగాన్ని సమగ్రంగా సమీక్షించింది. గతంలో మద్యం విక్రయ వ్యవస్థను పూర్తిగా కేంద్రీకరించడం, కొద్ది బ్రాండ్లకే ప్రాధాన్యం ఇవ్వడం, మార్కెట్ అవసరాలను పట్టించుకోకపోవడం, డిజిటల్ వ్యవస్థలను నిర్వీర్యం చేయడం వంటి కారణాల వల్ల ప్రజలు, వ్యాపారులు, ప్రభుత్వం ముగ్గురూ నష్టపోయారని ప్రభుత్వం గుర్తించింది. అందుకే కొత్త ప్రభుత్వం మొదటి నుంచే 'పారదర్శకత–నాణ్యత–వినియోగదారుల స్వేచ్ఛ–డిజిటల్ పాలన–ప్రభుత్వ ఆదాయ వృద్ధి" అనే ఐదు సూత్రాల ఆధారంగా కొత్త ఎక్సైజ్ విధానాన్ని రూపొందించింది. ఈ మార్పు కేవలం విధాన పరిమితిలోనే కాకుండా మొత్తం వ్యవస్థ పనితీరును మార్చే సంస్కరణగా మారింది.

### వినియోగదారుడే కేంద్ర బిందువుగా కొత్త ఎక్సైజ్ విధానం

కొత్త ఎక్సైజ్ విధానంలో అత్యంత ముఖ్యమైన మార్పు వినియోగదారుడి ఎంపికకు ప్రాధాన్యం కల్పించడం. గతంలో రాష్ట్రంలో అందుబాటులో లేకుండా పోయిన అనేక జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు మళ్లీ మార్కెట్‌లోకి వచ్చాయి. బీర్ విభాగంలోనే 46కు పైగా బ్రాండ్లు అందుబాటులోకి రావడం, పలు ప్రీమియం, సూపర్ ప్రీమియం ఉత్పత్తులు తిరిగి రాష్ట్ర మార్కెట్‌లో ప్రవేశించడం వినియోగదారులకు విస్తృత ఎంపిక అవకాశాలను కల్పించింది. ప్రజలకు కావలసిన ఉత్పత్తులు అందుబాటులో ఉండడం వల్ల అక్రమ సరఫరా వ్యవస్థలకు గట్టి దెబ్బ తగిలింది. మార్కెట్ సహజ పోటీ పునరుద్ధరణ కావడంతో నాణ్యమైన ఉత్పత్తులు వినియోగదారులకు చేరే పరిస్థితి ఏర్పడింది.

### ప్రైవేట్ రిటైల్ వ్యవస్థ పునరుద్ధరణ

గతంలో వివాదాస్పదంగా మారిన మద్యం దుకాణాల నిర్వహణ విధానానికి ముగింపు పలుకుతూ ప్రభుత్వం ప్రైవేట్ రిటైల్ వ్యవస్థను తిరిగి అమల్లోకి తీసుకొచ్చింది. దుకాణాల కేటాయింపులో పూర్తిగా పారదర్శకమైన దరఖాస్తు, లాటరీ విధానాన్ని అమలు చేసింది. ఈ ప్రక్రియకు రాష్ట్రవ్యాప్తంగా అపూర్వ స్పందన లభించింది. వేల సంఖ్యలో దరఖాస్తులు రావడం, ఒక్కో దుకాణానికి అనేక రెట్లు పోటీ నెలకొనడం ప్రభుత్వ విధానంపై ప్రజలు, వ్యాపార వర్గాలు ఉంచిన విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. మధ్యవర్తిత్వం, అనధికార చెల్లింపులకు పూర్తిగా ముగింపు పలుకుతూ పారదర్శక కేటాయింపులు చేపట్టడం ఎక్సైజ్ రంగంలో విశ్వసనీయతను పెంచింది.

### నాణ్యత విషయంలో రాజీలేని విధానం

ప్రజల ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా భావించిన ప్రభుత్వం మద్యం నాణ్యత నియంత్రణలో కఠిన ప్రమాణాలను అమలు చేసింది. రాష్ట్రంలో విక్రయించే ప్రతి బ్రాండ్‌ను మార్కెట్‌లోకి అనుమతించే ముందు శాస్త్రీయ ప్రమాణాల ప్రకారం పరీక్షించే వ్యవస్థను బలోపేతం చేసింది. ఎక్స్ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ENA) దశ నుంచి తుది ఉత్పత్తి వరకు ప్రతి దశలో నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించే విధానాన్ని అమలు చేసింది. ప్రతి బ్రాండ్‌పై 13కు పైగా నాణ్యతా ప్రమాణాల ఆధారంగా పరీక్షలు నిర్వహించడం, అవసరమైతే జాతీయ స్థాయి ప్రయోగశాలల సహకారం తీసుకోవడం ద్వారా ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది.

### కల్తీ మద్యం నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

కల్తీ మద్యం, నకిలీ బ్రాండ్లు, అక్రమ రవాణా, పన్ను ఎగవేత వంటి కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్ర సరిహద్దులు, గిడ్డంగులు, రిటైల్ కేంద్రాల్లో నిరంతర తనిఖీలు కొనసాగుతున్నాయి. కల్తీ మద్యం తయారీ, విక్రయాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటూ ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించే కార్యకలాపాలను అరికట్టే దిశగా ప్రభుత్వం రాజీలేని వైఖరి అవలంబించింది.







### డిజిటల్ పాలనతో పారదర్శకత

గతంలో దాదాపు రూ.99వేల కోట్లకు పైగా మద్యం విక్రయాలు జరిగినప్పటికీ డిజిటల్ లావాదేవీలు అత్యల్ప స్థాయిలో ఉండేవి. నగదు లావాదేవీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఆదాయ లీకేజీలు, అక్రమ ఆర్థిక ప్రవాహాలు, లెక్కల్లో అస్పష్టత వంటి సమస్యలు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితిని పూర్తిగా మార్చేందుకు ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ ట్రాకింగ్, రియల్‌టైమ్ మానిటరింగ్, సరఫరా గొలుసు పర్యవేక్షణ వంటి సాంకేతిక వ్యవస్థలను అమలు చేసింది. డిజిటల్ పాలన వల్ల ప్రతి దశలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రభుత్వ ఆదాయం కూడా గణనీయంగా మెరుగుపడింది.



### ఆన్‌లైన్ సరఫరా వ్యవస్థ పునరుద్ధరణ

మద్యం సరఫరాలో పారదర్శకతకు కీలకమైన ఆన్‌లైన్ OFS (Online Order for Supply) వ్యవస్థను ప్రభుత్వం మళ్లీ సమర్థవంతంగా అమలు చేసింది. గతంలో షాపులు కోరిన బ్రాండ్లకు బదులుగా ఇతర ఉత్పత్తులు బలవంతంగా సరఫరా చేసే పరిస్థితికి ముగింపు పలికింది. ప్రస్తుతం మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా జరిగే విధానం అమల్లో ఉండటంతో వ్యాపారులు, వినియోగదారులు... ఇద్దరికీ ప్రయోజనం చేకూరింది. సరఫరా గొలుసులో పారదర్శకత పెరగడంతో మార్కెట్ సహజ సమతుల్యత పునరుద్ధరించబడింది.

### ప్రభుత్వ ఆదాయానికి కొత్త బలం

ఎక్సైజ్ రంగంలో అమలు చేసిన సంస్కరణలు ప్రభుత్వ ఆదాయ వృద్ధికి కూడా కీలకంగా దోహదపడ్డాయి. డిజిటల్ వ్యవస్థలు, పారదర్శక లైసెన్సింగ్, సరఫరా నియంత్రణ, నాణ్యత పర్యవేక్షణ, అక్రమాల నియంత్రణ వంటి చర్యలతో ఆదాయ లీకేజీలు తగ్గాయి. రాష్ట్రానికి రావాల్సిన ప్రతి రూపాయి ప్రభుత్వ ఖజానాకు చేరే విధంగా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ఎక్సైజ్ శాఖ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషిస్తోంది.

### పర్యాటక రంగానికి తోడ్పాటు

కొత్త ఎక్సైజ్ విధానం పర్యాటకరంగ అభివృద్ధికీ అనుకూల వాతావరణాన్ని కల్పించింది. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు అవసరమైన నాణ్యమైన ఉత్పత్తులు, మెరుగైన సేవలు అందుబాటులోకి రావడంతో ఆతిథ్య రంగానికి కూడా ఊతం లభించింది. హోటళ్లు, రిసార్టులు, పర్యాటక కేంద్రాల్లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు రాష్ట్ర పర్యాటక రంగ పోటీతత్వాన్ని పెంచుతున్నాయి.

### సాంకేతికతతో సమర్థవంతమైన పర్యవేక్షణ

ఎక్సైజ్ శాఖలో సాంకేతిక వినియోగాన్ని ప్రభుత్వం విస్తృతంగా పెంచింది. రియల్ టైమ్ మానిటరింగ్, డిజిటల్ డేటా విశ్లేషణ, సరఫరా గొలుసు ట్రాకింగ్ వంటి వ్యవస్థల ద్వారా అక్రమాలను వేగంగా గుర్తించే సామర్థ్యం పెరిగింది. దీంతో శాఖ పనితీరు మరింత సమర్థవంతంగా మారడమే కాకుండా అధికారుల జవాబుదారీతనం కూడా పెరిగింది. సాంకేతికత ఆధారిత పరిపాలన ఎక్సైజ్ రంగంలో స్థిరమైన సంస్కరణలకు పునాది వేసింది.

### ప్రజల ఆరోగ్యం-ప్రభుత్వ తొలి బాధ్యత

ఎక్సైజ్ రంగం అంటే కేవలం ఆదాయం మాత్రమే కాదు, ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న అంశమని ప్రభుత్వం స్పష్టం చేసింది. అందుకే నాణ్యత నియంత్రణ, కల్తీ నిర్మూలన, ప్రమాణాలకు అనుగుణమైన ఉత్పత్తుల విక్రయం, కఠిన తనిఖీలు వంటి అంశాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ చట్టబద్ధమైన మార్కెట్‌ను బలోపేతం చేస్తూ అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం ద్వారా సమతుల్యమైన ఎక్సైజ్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది.

### సుస్థిర ఎక్సైజ్ వ్యవస్థ వైపు...

గత రెండేళ్లలో ఎక్సైజ్ రంగంలో జరిగిన మార్పులు కేవలం పరిపాలనా సంస్కరణలుగానే కాకుండా, ప్రభుత్వ పాలనా తీరులో వచ్చిన మార్పుకు కూడా ప్రతిబింబంగా నిలిచాయి. పారదర్శకత, డిజిటల్ పాలన, వినియోగదారుల స్వేచ్ఛ, నాణ్యత నియంత్రణ, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణ అనే అంశాలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు రాష్ట్ర ఎక్సైజ్ వ్యవస్థను కొత్త దిశగా నడిపిస్తున్నాయి.

భవిష్యత్తులో సాంకేతికతను మరింత విస్తృతంగా వినియోగిస్తూ డిజిటల్ పర్యవేక్షణను బలోపేతం చేస్తూ, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడుతూ, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే దిశగా ఎక్సైజ్ శాఖ అడుగులు వేస్తోంది. ప్రజల ఆరోగ్య భద్రతను, మార్కెట్ పారదర్శకతను, ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనాలను సమన్వయం చేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శవంతమైన ఎక్సైజ్ పరిపాలన కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

శశికుమార్
తెలుగుదేశం సైనికుడు



## శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న ఎంపీ కలిశెట్టి



విజయనగరం రూరల్: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల చిరకాల కలగా ఎదురుచూసిన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా విజయవంతంగా ప్రారంభమైన సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విమానాశ్రయం ప్రారంభం ఉత్తరాంధ్ర చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందన్నారు. ఉపాధి, పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు వేగంగా అభివృద్ధి చెందడంతో పాటు యువతకు కొత్త అవకాశాలు లభిస్తాయని వివరించారు. వలసలు తగ్గి, ప్రపంచ దృష్టి ఉపాధి కోసం ఉత్తరాంధ్ర వైపు ఎదురు చూస్తారని చెప్పారు. చంద్రబాబు నాయుడు దూరదృష్టి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చొరవతో ఉత్తరాంధ్రలో వరుస అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం కావడం ఉత్తరాంధ్ర ప్రజలందరికీ గర్వకారణం అని పేర్కొన్నారు.

## ఎయిర్‌పోర్ట్ ప్రారంభలో కలెక్టర్ రామ్ సుందర్‌రెడ్డిది కీలక పాత్ర



విజయనగరం (చైతన్యరథం): శ్రీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభ ప్రస్థానంలో కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి కీలకపాత్ర పోషించారని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం నందు కలెక్టర్ ఎస్ రామ సుందర్ రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ విమానాశ్రయ ప్రారంభం షెడ్యూల్ విడుదలైన నాటి నుండి పగట్పుండీగా ఏర్పాట్లు చేయడం, కృత నిశ్చయంతో విధులు నిర్వహించారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు, యువ నాయకులు నారా లోకేష్ సారథ్యంలో, ప్రత్యేక పరిశీలకులు, మంత్రుల సూచనలు పాటించి అన్ని శాఖల అధికారులను సమన్వయం చేయటంతోనే ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా ప్రారంభ కార్యక్రమాన్ని పూర్తి చేయగలిగామని ప్రశంసించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులకు, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

## జగన్ క్రెడిట్ అంటే నాలుగు కత్తులు... నాలుగు గొడ్డళ్లు : మంత్రి గుమ్మిడి



అమరావతి (చైతన్యరథం): వైసీపీలోని కొందరు నేతలు ప్రజలకు నీతులు చెబుతున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఎద్దేవా చేశారు. నేరాలు చేసిన నేతలు ఎక్కడున్నా తీసుకొచ్చి శిక్షిస్తామన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయంపై వైసీపీ నేతల వ్యాఖ్యలు సరికాదన్నారు. "మేం చేసిన పనులను జగన్ క్రెడిట్ చోరీ చేస్తున్నారు. ఆయనకు క్రెడిట్ లేదు.. చోరీ ఎక్కడిది. క్రెడిట్ అనే పదం జగన్‌కు వర్తించదు. ఆయన క్రెడిట్ అంటే.. నాలుగు కత్తులు, నాలుగు గొడ్డళ్లు. హత్యలు చేసినవాళ్లని వెనకేసుకుని రావడం, బూతులు మాట్లాడిన వాళ్లకు మంత్రి పదవులు ఇవ్వడమే ఆయనకు తెలుసు. శస్త్రచికిత్స చేయించుకున్న సొంత చెల్లినే పరామర్శించలేదు. నేరాలు చేసి జైల్లో ఉన్నవారిని మాత్రం జగన్ పరామర్శిస్తున్నారు" అని సంధ్యారాణి విమర్శించారు.

## అక్కులపేటలో 'మీ భూమి - మీ హక్కు కార్యక్రమం... పాల్గొన్న ఎమ్మెల్యే కూన



ఆముదాలవలస (చైతన్యరథం): నియోజకవర్గంలోని ఆముదాలవలస మండలం అక్కులపేట గ్రామంలో నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో ఆముదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ పాల్గొని ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ... భూమిపై రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. భూ యజమానుల హక్కులను మరింత బలోపేతం చేసేలా ప్రభుత్వం పారదర్శక విధానాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ రాజముద్రతో అందజేస్తున్న పట్టాదారు పాస్ పుస్తకాలు రైతుల ఆస్తి హక్కులకు శాశ్వత ధ్రువీకరణగా నిలుస్తాయని చెప్పారు. రైతులు తమ భూములకు సంబంధించిన అన్ని వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ప్రభుత్వ సేవలను సులభంగా పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. పాస్ పుస్తకాలు అందుకున్న రైతులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే గణబాబు విస్తృత పర్యటన



విశాఖపట్నం (చైతన్యరథం): రెండేళ్ల నమ్మకం... అభివృద్ధి, సంక్షేమం ప్రచారం కార్యక్రమంలో భాగంగా సోమవారం 61వ వార్డులో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన ప్రగతి, సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన "2 ఏళ్ల నమ్మకం... అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమం విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా ఈరోజు 61వ వార్డు మల్కాపురం ప్రాంతంలో స్థానిక ఎమ్మెల్యే గణబాబు పార్టీ శ్రేణులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. మల్కాపురంలోని ప్రతి వీధిలోనూ పర్యటించిన ఎమ్మెల్యే... ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ నేరుగా వారితో మమేకమయ్యారు. ప్రభుత్వం రూపొందించిన ప్రగతి నివేదికను ప్రతి ఒక్కరికీ అందజేస్తూ, స్థానిక సమస్యలను, ప్రజల సూచనలను స్వయంగా అడిగి తెలుసుకుంటూ అక్కడికక్కడే నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు జరిగే ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి బూత్ పరిధిలోని ప్రతి ఇంటినీ క్రమబద్ధంగా సందర్శిస్తున్నామని తెలిపారు.

## సమర్థవంతమైన పాలన ప్రజలకు అందిస్తున్నాం

●గాజువాక 76వ వార్డులో ఘనంగా ఇంటింటికి తెలుగుదేశం

●టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు హారతులు ఇచ్చి స్వాగతం పలికిన మహిళలు



గాజువాక (చైతన్యరథం): ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం గాజువాక నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతుంది. జీవీఎంసీ 76 స్వతంత్రనగర్‌లో వార్డ్ మాజీ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ పదవీకాలంలో చేపట్టిన అభివృద్ధి, కూటమి అధికారంలోకి వచ్చాక వార్డులో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను గంధం శ్రీనివాస్ వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో ఎక్కడా దళారీ వ్యవస్థ అన్నది లేకుండా చేశామని, సమర్థవంతమైన పాలనను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు.కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో అన్ని వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్, బలగ బాలు నాయుడు, అప్పలరాజు, పంచదార్ల ఉగ్రం, బాశెట్టి అప్పారావు, పీత వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్.కోటలో పిఎసిఎస్ సిబ్బందికి జీతాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



ఎల్.కోట (చైతన్యరథం): క్యాంప్ కార్యాలయంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి పాల్గొని సిబ్బందికి వేతనాలు పంపిణీ చేశారు. 2025-26 ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం సేకరణ (ప్యాడీ ప్రొక్యూర్ మెంట్) ప్రక్రియలో భాగంగా రైతు సేవా కేంద్రాల్లో పిఎసిఎస్ సిబ్బందిగా విధులు నిర్వహించిన టెక్నికల్ అసిస్టెంట్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు మరియు హెల్పర్లకు ఈ వేతన బకాయిలను అందజేశారు. ధాన్యం సేకరణను వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయడంలో సిబ్బంది అందించిన సేవలను ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందించారు. ఎల్.కోట పీఏసీఎస్ చైర్మన్ మరోతు రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం రూ.1,01,000 (లక్ష ఒక వెయ్యి రూపాయలు) విలువైన జీతాల మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, ధాన్యం సేకరణ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అంకితభావంతో పనిచేసిన ఆర్ఎస్కే సిబ్బందికి చైర్మన్ మరోతు రామారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు మరియు సహకార సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబ సభ్యురాలిని పరామర్శించిన జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



అల్లూరి సీతారామరాజు (చైతన్యరథం): అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త కుటుంబ సభ్యురాలిని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పరామర్శించారు. డుంబ్రిగూడ మండలం కొర్ర పంచాయతీకి చెందిన తెలుగుదేశంపార్టీ కార్యకర్త గుజ్జెలి బొంజుబాబు సతీమణి రుక్మిణి ఇటీవల గాల్ బ్లాడర్ శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహణ కార్యదర్శి కిడారి శ్రావణ్ కుమార్ ఆమెను కొర్ర గ్రామంలోని స్వగృహంలో మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యుల సూచనలు పాటిస్తూ పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ కార్యకర్తల సంక్షేమం పట్ల తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కిడారి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు.

## ఏపీలో భూగర్భ జలాల సంరక్షణకు కేంద్రం ప్రత్యేక చర్యలు

**●రాష్ట్రవ్యాప్తంగా అక్విఫర్ మ్యాపింగ్ పూర్తి**

**●వర్షపు నీటి సంరక్షణకు భారీ కార్యక్రమాలు**

**●ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నకు కేంద్రం వివరణ**



కాకినాడ / న్యూఢిల్లీ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో భూగర్భ జలాల సంరక్షణ, అక్విఫర్ మ్యాపింగ్, వర్షపు నీటి సంరక్షణ చర్యలు, దీర్ఘకాలిక జల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు సోమవారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కీలక వివరాలను వెల్లడించింది. కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి భూషణ్ చౌదరి రాజ్యసభలో వెల్లడించిన వివరాలు వెల్లడిస్తూ... జాతీయ అక్విఫర్ మ్యాపింగ్ మరియు మేనేజ్‌మెంట్ కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 1.42 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అక్విఫర్ మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. భూగర్భ జలాలపై శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా జల వనరుల నిర్వహణకు అవసరమైన అక్విఫర్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలు రాష్ట్ర ప్రభుత్వానికి అందించామని కేంద్రం వెల్లడించింది. విశాఖపట్నం, విజయవాడ-అమరావతి, తిరుపతి వంటి పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక అధ్యయనాలు నిర్వహించి స్థానిక అవసరాలకు అనుగుణంగా భూగర్భ జలాల నిర్వహణకు సూచనలు చేసినట్లు పేర్కొంది. జల్ శక్తి అభియాన్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 9 లక్షల వర్షపు నీటి సంరక్షణ, కృత్రిమ భూగర్భ జలాల రీఛార్జ్ పనులు చేపట్టినట్లు తెలిపింది. అలాగే జల్ సంచయ్ జన భాగీదారి కార్యక్రమం కింద 3.84 లక్షల కృత్రిమ భూగర్భ జలాల రీఛార్జ్, నీటి నిల్వ పనులు పూర్తయ్యాయని వెల్లడించింది. భూగర్భ జలాల వినియోగం, రీఛార్జ్, వర్షపు నీటి సంరక్షణ చర్యలకు అవసరమైన సాంకేతిక సమాచారం రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తున్నామని, ఈ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం స్థానిక అవసరాలకు అనుగుణంగా జల వనరుల ప్రణాళికలు రూపొందిస్తోందని కేంద్రం స్పష్టం చేసింది.

## టీడీపీ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన బొడ్డు వెంకటరమణ చౌదరి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నిర్మాణంలో ఉన్న తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణ పనులను రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, నాణ్యతా ప్రమాణాలకు ఎలాంటి రాజీ లేకుండా నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, బాధ్యులకు సూచించారు. జిల్లా పార్టీ కార్యాలయం పార్టీ కార్యకలాపాలకు కేంద్రబిందువుగా నిలవడంతో పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్ని విధాలా ఉపయోగపడేలా ఆధునిక వసతులతో నిర్మించబడాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కార్యాలయాన్ని సకల సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు మరింత చేరువయ్యే కార్యక్రమాల నిర్వహణకు ఈ జిల్లా కార్యాలయం కీలక వేదికగా నిలుస్తుందని బొడ్డు వెంకటరమణ చౌదరి పేర్కొన్నారు.

## విజయవాడ పశ్చిమలో ఇంటింటికి తెలుగుదేశం పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న



విజయవాడ (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ బుద్దా వెంకన్న సూచనల మేరకు 38వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సురభి బాలు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక 38వ డివిజన్ పరిధిలోని మల్లికార్జునపేటలోని 168వ బూత్‌నందు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ పరిశీలకులు వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్‌రావు పాల్గొని కూటమి ప్రభుత్వం 2 సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించి వారి వద్ద నుంచి సలహాలు సూచనలు స్వీకరించటం జరిగింది. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ నందం భవానీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి ఈశ్వర్ రావు, యూనిట్ ఇన్‌ఛార్జ్ మారోజు మోహన్, సుధాకరు ప్రియా మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూనే ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నాం

**●రాష్ట్రవ్యాప్తంగా త్వరలో రెండు లక్షల మందికి నూతన పింఛన్లు మంజూరు చేయనున్న కూటమి ప్రభుత్వం**

**●రాజవోలు గ్రామంలో "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి-సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల**




రాజమహేంద్రవరం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా త్వరలో రెండు లక్షల మందికి నూతన పింఛన్లు మంజూరు చేయనుందని, అర్హులందరికీ పింఛన్లు అందిస్తామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. సోమవారం రూరల్ మండలం రాజవోలు గ్రామంలో "రెండేళ్ళ నమ్మకం అభివృద్ధి-సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ... ఇది మంచి ప్రభుత్వమని, ప్రజలకు మంచి చేస్తుందని రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కూడా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూనే, ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వ విజయాలను ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేస్తున్నామని, కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజల్లో ఎక్కువ శాతం మంది హౌసింగ్ సమస్య చెబుతున్నారని, గతంలో కట్టిన కొన్ని ఇళ్లకు డబ్బులు చెల్లించాల్సి ఉందని, త్వరలోనే హౌసింగ్ కు సంబంధించిన సమస్యలు అన్ని పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే రాజవోలు గ్రామంలో గ్రామ పార్టీ నాయకుల ఏర్పాటుచేసిన నూతన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. సంక్షేమ పథకాలకి ఆద్యుడు, తెలుగువారి ఆరాధ్య దైవం అన్న నందమూరి తారక రామారావు వారి విగ్రహాన్ని ప్రతి గ్రామంలోనూ మంచి కూడలిలో ఏర్పాటు చేయుటకు, ఒక్కొక్క గ్రామానికి 50వేల రూపాయలు తన సొంత నిధులు కేటాయిస్తానని తెలిపారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ విజయాలు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్స్యేటి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు నిమ్మలపూడి రామకృష్ణ, వల్లూరి చెంచురాజు, మద్దా మణి, పిల్ల తనుజ, చేపల వెంకట్రావు, గాలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## క్రెడిట్ చోరీ అనే వింత జబ్బుతో జగన్ బాధపడుతున్నాడు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**●చిలకలూరిపేట రైతు బజార్లో ప్రభుత్వ సబ్సిడీ బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం**



చిలకలూరిపేట (చైతన్యరథం): ఎల్ నినో ప్రభావంతో బియ్యం ధరలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని, బియ్యం సహా, ఇతర నిత్యావసరాల పెరుగుదల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. సోమవారం ఆయన చిలకలూరిపేట రైతు బజార్ లో ప్రభుత్వం-రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సబ్సిడీ బియ్యం విక్రయకేంద్రాన్ని ప్రారంభించారు. తెల్లరేషన్ కార్డుదారులకు స్వయంగా బియ్యం పంపిణీ చేసిన అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.

**అవినీతి సంపాదన.. అసత్యాల మీడియాను అడ్డుపెట్టుకొని జగనే ప్రభుత్వ విజయాల్ని క్రెడిట్ చోరీ చేస్తున్నాడు**

మాజీ ముఖ్యమంత్రి జగన్.. ఈ మధ్య క్రెడిట్ చోరీ అనే వింతజబ్బుతో బాధపడుతున్నారని, ఇతరుల మంచి, గొప్పతనాన్ని తనవిగా చెప్పుకోవడం ఆ జబ్బు ప్రధాన లక్షణమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా ప్రధాని చేతుల మీదుగా ప్రారంభమైన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఖ్యాతి మొత్తం తనదేనని జగన్ నిస్సిగ్గుగా చెప్పుకుంటూ, అసలై న క్రెడిట్ చోరీ జగనే చేస్తున్నాడన్నారు. చేతిలోని అవినీతి సంపాదనతో అనుకూల మీడియా, అసత్యాల సోషల్ మీడియాలో ప్రభుత్వ విజయాలను తనవిగా దుష్ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాడని ప్రత్తిపాటి మండిపడ్డారు. భోగాపురం విమానాశ్రయం విషయంలో తానున్నప్పుడే అన్నీ చేశానని, కోర్టుకేసుల్ని తొలగించానని జగన్ చెప్పడం.. పచ్చి అబద్ధమన్నారు. రెండేళ్లుగా చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ లు రాష్ట్రం కోసం పడుతున్న కష్టాన్ని, మోదీ అందిస్తున్న సహకారాన్ని ప్రజలు గమనిస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. జగన్ వైఫల్యాల్ని బీజేపీ ఎత్తిచూపుతున్నా..... వైసీపీ నేతలు సిగ్గులేకుండా విమర్శలు చేస్తున్నారన్నారు. జగన్.. వైసీపీనేతలు ఇప్పటికైనా పరుల కష్టాన్ని తమదిగా చెప్పుకోవడం మానుకోవాలని ప్రత్తిపాటి హితవుపలికారు.

**బియ్యం ధరలపై ఆందోళన చెందాల్సిన పనిలేదు..**

ఎల్ నినో దృష్ట్యా వరిసాగు మందగించిన నేపథ్యంలో బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరుగుతాయన్న ఆందోళన అవసరం లేదని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని ప్రత్తిపాటి చెప్పారు. మార్కెట్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, బియ్యంతో పాటు, ఇతర నిత్యావసరాల ధరలు పెంపుదలపై ప్రత్యేక నిఘా పెట్టిందని ప్రత్తిపాటి తెలిపారు.

## ఏపీలో పీఎం పోషణకు ఐదేళ్లలో రూ.1,465.40 కోట్ల కేంద్ర నిధులు

**●విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నకు లోక్‌సభలో కేంద్రం సమగ్ర సమాధానం**




న్యూ ఢిల్లీ/ విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలో అమలవుతున్న ప్రధానమంత్రి పోషణ పథకంపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర సమాధానం ఇచ్చింది. పథకం కింద ఉన్న పాఠశాలల సంఖ్య, జిల్లా స్థాయి స్టీరింగ్ అండ్ మానిటరింగ్ కమిటీల ఏర్పాటు, సమావేశాల నిర్వహణతో పాటు గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేసిన నిధుల వివరాలను కేంద్ర విద్యాశాఖ సభలో వెల్లడించింది. రాష్ట్రంలో పీఎం పోషణ పథకం కింద ఎన్ని పాఠశాలలు ఉన్నాయి? జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలు పనిచేస్తున్నాయా? ఏడాదిలో ఎన్ని సమావేశాలు నిర్వహిస్తున్నాయి? గత ఐదేళ్లలో కేంద్రం ఎంత నిధులు విడుదల చేసింది? అనే అంశాలపై ఎంపీ కేశినేని శివనాథ్ లోక్‌సభలో ప్రశ్నించారు. దీనికి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్‌చౌదరి సమాధానమిస్తూ, బాలవాటిక నుంచి 8వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పీఎం పోషణ పథకం అమలవుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సమాచారం మేరకు జిల్లాల వారీగా పాఠశాలల సంఖ్య, స్టీరింగ్ అండ్ మానిటరింగ్ కమిటీల సమావేశాల వివరాలను లోక్‌సభకు సమర్పించినట్లు పేర్కొన్నారు.

**రూ.1,465.40 కోట్ల కేంద్ర సహాయం**

కేంద్ర మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, 2021-22 నుంచి 2025-26 వరకు ఆంధ్రప్రదేశ్‌లో్రావీ పోషణ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.1,465.40 కోట్లు విడుదల చేసింది. ఇందులో 2021-22లో రూ.357.31 కోట్లు, 2022-23లో రూ.365.32 కోట్లు, 2023-24లో రూ.253.43 కోట్లు, 2024-25లో రూ.239.07 కోట్లు, 2025-26లో రూ.250.27 కోట్లు విడుదల చేసినట్లు లోక్‌సభలో వెల్లడించారు.

**జిల్లాల వారీగా పూర్తి సమాచారం సభ ముందుకు**

రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో్రావీ పోషణ పథకం అమలవుతున్న పాఠశాలల సంఖ్యతో పాటు జిల్లా స్టీరింగ్ అండ్ మానిటరింగ్ కమిటీల సమావేశాల వివరాలను కూడా కేంద్ర ప్రభుత్వం అధికారికంగా లోక్‌సభకు సమర్పించింది.

## కూటమి ప్రభుత్వ హామీల్లో 90 శాతం పైగా అమలు: ఎమ్మెల్యే రాము



గుడివాడ (చైతన్యరథం): ప్రతి ఇంటికి సంక్షేమం, ప్రతి వీధికి అభివృద్ధి కూటమి ప్రభుత్వ నినాదమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. అందరం కలిసి గుడివాడను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుకుందామని ప్రజానీకానికి ఆయన పిలుపునిచ్చారు. గుడివాడ 30వ వార్డు ధనియాలపేటలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విస్తృతంగా పర్యటించారు. ముందుగా ధనియాలపేటలో 3 కోట్ల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 90 శాతానికి పైగా పూర్తయి తుది దశకు చేరుకున్న ధనియాలపేట మెయిన్ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని మున్సిపల్ డీఈ సతీష్ చంద్ర ఎమ్మెల్యే రాముకు వివరించారు. అనంతరం కూటమి శ్రేణులతో కలిసి వార్డులో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాము చేపట్టారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసిన సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలపై ప్రచార కరపత్రాలను కూడా ఆయన ఇంటింటికి పంపిణీ చేశారు. ధనియాలపేటలో చిరకాలంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీలు, త్రాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాముకు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ప్రధాన సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపిన ప్రజలు, అంతర్గత రహదారుల సమస్యలను కూడా వెసులుబాటును బట్టి పరిష్కరించాలని ఎమ్మెల్యే రాముకు విజ్ఞప్తి చేశారు. పర్యటనలో భాగంగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏపీ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజును ఎమ్మెల్యే రాము పరామర్శించి ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు.

## సంక్షేమం, అభివృద్ధి సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నాం : ఎమ్మెల్యే కాగిత



పెడన (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ చేపట్టిన డోర్ టు డోర్ కార్యక్రమాన్ని కృత్తివెన్ను మండలం చిన్న పాండ్రక గ్రామంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే... ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీసిన పరిస్థితుల్లోనూ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, పేద సంక్షేమానికి ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారాలు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. సూపర్ సిక్స్, అన్న క్యాంటీన్లు, పెన్షన్ల పెంపు, అన్నదాత సుఖీభవ వంటి కీలక సంక్షేమ పథకాలతో పాటు గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం : ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల (చైతన్యరథం): కర్లపాలెం మండలం యేట్రవారిపాలెం గ్రామంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో 2 ఏళ్ల నమ్మకం – సంక్షేమం, అభివృద్ధి ఇంటింటికీ తెలుగుదేశం ప్రచార కార్యక్రమాన్ని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వర్మ రాజు గ్రామంలోని ప్రతి ఇంటికీ నేరుగా వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించే కరపత్రాలను ప్రజలకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోంది. ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలను



అందిస్తూ ప్రజల్లో నమ్మకాన్ని పెంచాం. బాపట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు శ్రమిస్తున్నామని తెలిపారు.

## రైతు బజార్‌లో ప్రత్యేక రైస్ కౌంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే బొండా ఉమా

- ప్రజలకు నాణ్యమైన బీపీటీ స్టీమ్ రైస్ కేవలం 52కే అందిస్తాం



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 62వ డివిజన్ పాయకాపురం రైతు బజార్ నందు గాంధీనగర్ రైతు మార్కెట్ నందు ఏర్పాటు చేసిన బీపీటీ స్టీమ్ రైస్ విక్రయ కేంద్రాన్ని ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా యుద్ధ వాతావరణం, అంతర్జాతీయ పరిస్థితులు, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల ప్రభావంతో బహిరంగ మార్కెట్‌లో బీపీటీ స్టీమ్ రైస్ ధర కిలోకు రూ.64-65 వరకు చేరిన నేపథ్యంలో, ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 150 రైతు బజార్లు, 500 రైస్‌మిల్ అవుట్‌లెట్లలో నేటి నుంచే బీపీటీ స్టీమ్ రైస్ విక్రయాలను ప్రారంభించినట్లు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో రూ.64-65 ఉన్న నాణ్యమైన బీపీటీ స్టీమ్ రైస్‌ను ప్రభుత్వం కిలోకు కేవలం రూ.52కే ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఒక్కో కుటుంబానికి 10 కిలోల వరకు ఈ ధరకు బియ్యం కొనుగోలు చేసే అవకాశం కల్పించామని వివరించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని రైతు బజార్లలో కూడా ప్రత్యేక రైస్ కౌంటర్లను ఏర్పాటు చేయడం ద్వారా సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన గత 24 నెలలుగా రైతు బజార్ల నిర్వహణను మరింత బలోపేతం చేస్తూ, నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందన్నారు. రైతు బజార్లను ప్రజలకు మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దుతూ, నాణ్యమైన ఆహార ధాన్యాలను తక్కువ ధరలకు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు.

**పేదలకు పట్టెడన్నం పెట్టగలిగిన నాడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం - ఎన్టీఆర్**

## ప్రజా సమస్యల పరిష్కారంలో వినుకొండను రాష్ట్రంలో మొదటి ఐదు స్థానాల్లో నిలపాలి

- అధికారులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సూచన



వినుకొండ (చైతన్యరథం): ప్రజా సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరిస్తూ పాలనను నేరుగా ప్రజల చెంతకే తీసుకువస్తున్నామని పల్నాడు కలెక్టర్ కృతికా శుక్లా స్పష్టం చేశారు. వినుకొండ నియోజకవర్గ కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (ప్రజా దర్బార్) కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు శాసనసభ చీఫ్ విప్, స్థానిక శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు, జాయింట్ కలెక్టర్, సంజన సింహ్, రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీవో), వివిధ జిల్లా మరియు మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా, సానుకూల దృక్పథంతో వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో వినుకొండ నియోజకవర్గం రాష్ట్రంలో 34వ స్థానంలో ఉందని, అధికారులు మరింత అంకితభావంతో పనిచేసి వినుకొండను రాష్ట్రంలోనే మొదటి ఐదు స్థానాల్లో నిలిపేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు వేగంగా, పారదర్శకంగా సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రజా దర్బార్‌లో ప్రస్తావనకు వచ్చిన అగ్రహారం భూముల సమస్యను జిల్లా పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపిన జీవీ ఆంజనేయులు, ఈ సమస్యను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరించి అర్హులైన బాధితులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా నమోదవుతున్న ఫిర్యాదుల నివేదికలు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్తున్నాయని తెలిపారు. సమస్యలు పరిష్కారమైన తర్వాత ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే ప్రజలకు నేరుగా ఫోన్ ద్వారా సమాచారం అందించి అభిప్రాయం తెలుసుకుంటున్నారని, ప్రస్తుతం సుమారు 80 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో వినుకొండ ఆదర్శ నియోజకవర్గంగా నిలవాలని ఆకాంక్షించారు.

**మళ్లీ మళ్లీ ఫిర్యాదులు వచ్చే పరిస్థితి ఉండకూడదు**

అధికారుల ప్రవర్తనపై అసంతృప్తి వ్యక్తం చేసిన జీవీ ఆంజనేయులు, ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అధికారులు ప్రజల సేవకులనే విషయాన్ని గుర్తుంచుకుని, తమ వద్దకు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవంతో ఆదరించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. ఒకే సమస్యపై మళ్లీ మళ్లీ ఫిర్యాదులు వచ్చే పరిస్థితి ఉండకూడదని, ప్రజల పట్ల సానుకూలంగా స్పందించినప్పుడే ఫిర్యాదుల సంఖ్య తగ్గుతుందని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, కూటమి పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అవయవదానం అంటే మరో జీవితానికి పునర్జన్మ ఇవ్వడమే

- అవయవదానంపై యువతలో అవగాహన పెరగాలి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): అవయవదానం అంటే మరో జీవితానికి పునర్జన్మ ఇవ్వడమేనని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవారం గుంటూరులో జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, బ్రహ్మకుమారీస్ సభ్యులు, అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... అవయవదానం కోసం ముందుకు వచ్చే ప్రతి వ్యక్తి నిజమైన ముఖ్య అతిథిగా అని, వేదికపై కూర్చున్నవారు కాదు సమాజానికి జీవదానం చేసే వారే ప్రత్యేక అతిథులని గళ్ళా మాధవి పేర్కొన్నారు. మనిషి చిరకాలం సమాజంలో నిలిచిపోవాలంటే రెండు మార్గాలే ఉన్నాయని, ఒకటి సమాజానికి అందించే సేవ, రెండోది అవయవదానం అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ఈ రెండు రూపాల్లో మనిషి ఎప్పటికీ ప్రజల మదిలో జీవిస్తాడని పేర్కొన్నారు. అవయవదానం కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన విషయం కాదని, అది ఒక కుటుంబాన్ని, ఒక సమాజాన్ని ప్రభావితం చేసే మహోన్నతమైన మానవతా కార్యక్రమమని వివరించారు. ఒక సైనికుడు అనేక మంది ప్రాణాలను కాపాడినట్లే, ఒక అవయవదాత మరణానంతరం ఎనిమిది మందికి వరకు కొత్త జీవితం అందించగలడని ఎమ్మెల్యే తెలిపారు. అందుకే అవయవదానం చేసిన వ్యక్తులకు ప్రభుత్వం గౌరవప్రదమైన లాంఛనాలతో వీడ్కోలు పలికే విధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. అవయవదానం ద్వారా ఒక వ్యక్తి జీవితాంతం మరొకరిలో జీవిస్తూనే ఉంటాడని అన్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# శ్రీవారి సన్నిధిలో సేవ.. పూర్వజన్మ సుకృతమే!

## టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, 160 మంది పదవీ విరమణ ఉద్యోగులకు ఘన సన్మానం




తిరుమల (చైతన్యరథం): శ్రీవారి సన్నిధిలో భక్తులకు సేవ చేసే అదృష్టం లభించడం పూర్వజన్మ సుకృతమని టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర పేర్కొన్నారు. టీటీడీలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన 28 మంది, అలాగే ఈ ఏడాది జనవరి 1 నుంచి మే 31 వరకు పదవీ విరమణ పొందిన 132 మంది ఉద్యోగులు కలిపి మొత్తం 160 మందికి తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో శుక్రవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, భక్తుల సేవలో ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ అంకితభావంతో పనిచేసిన ఉద్యోగుల సేవలు టీటీడీ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని కొనియాడారు. ఉద్యోగ జీవితంలో సంపాదించిన అనుభవాన్ని, విలువైన జ్ఞానాన్ని భావితర ఉద్యోగులతో పంచుకుని వారికి మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు. ఉద్యోగ విరమణ అనంతరం అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా, కుటుంబ సభ్యులతో సుఖశాంతులతో జీవించాలని, శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహం ఎల్లప్పుడూ వారిపై ఉండాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులను గౌరవించే ఈ సన్మాన కార్యక్రమాన్ని ప్రతి ఏడాది కొనసాగిస్తామని తెలిపారు. అంతకుముందు టీటీడీ జేఈవో డాక్టర్ ఎ. శరత్ మాట్లాడుతూ, శ్రీవారి సేవ చేసే అవకాశం దక్కడం మహాభాగ్యమని, పదవీ విరమణ ఉద్యోగులను ఘనంగా సత్కరించడం భావితర ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం ఈవో ముద్దాడ రవిచంద్ర, జేఈవోలు కలిసి పదవీ విరమణ పొందిన టీటీడీ శ్రీ సత్యనారాయణ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో పార్వతి సహా వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందించారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులకు శ్రీవారి లడ్డూ ప్రసాదం, వడ, జాకెట్ పీస్, తీర్థం, మహా ప్రసాదం అందించి, శ్రీవారి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో (హెచ్ఆర్) శ్రీ గోవిందరాజన్, సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో శ్రీ ఆనందరాజు, ఇతర అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజల్లోకి.. సాధించిన సంక్షేమాభివృద్ధి

## నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

నెల్లూరు (చైతన్యరథం): రూరల్ నియోజకవర్గ పరిధిలోని 17వ డివిజన్ వడ్డిపాలెంలో 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దాదాపుగా అమలు చేసి, అభివృద్ధి, సంక్షేమ ఫలితాలతోనే ప్రజల ముందుకు వస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పాలన సాగుతోందన్నారు. పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ సాబీర్ ఖాన్, డివిజన్ అధ్యక్షులు ఊటుకూరు దత్తాత్రేయ, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి అండగా టీడీపీలోకి దండిగా..

## వచ్చిన వైసీపీ కుటుంబాలను పార్టీలోకి చేర్చుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



సర్వేపల్లి (చైతన్యరథం): మనుబోలు మండలం కొమ్మలపూడిలో వైసీపీని వీడన 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. నెల్లూరులోని వేదాయపాళెం టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మన్నెమాల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో చేరిన వారికి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలుగుదేశం పార్టీలోకి ఆత్మీయ ఆహ్వానం పలికారు. కూటమి ప్రభుత్వంలో రికార్డు స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తోందన్నాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి పేర్కొన్నారు. ఏ ఊరిలో చూసినా సంక్షేమ పథకాల లబ్ధి రెట్టింపు కాగా, అభివృద్ధి కార్యక్రమాలు కూడా ఊపందుకున్నాయన్నారు. తెలుగుదేశం పార్టీ చేపట్టిన రెండేళ్ల నమ్మకం.... అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమానికి కూడా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు 100 శాతం విజయం నమోదు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీలో చేరుతున్న వారందరినీ గౌరవంగా చూసుకుంటామని సోమిరెడ్డి హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమంలో వారిని కూడా భాగస్వాముల్ని చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీలో చేరిన వారిలో గుండాల రాజారత్నం, రవి, దానం, ఇంగిలేల రాజయ్య, దార్ల వెంకటేశ్వర్లు, పైనం శ్రీను, కట్టేటి జనార్దన్, గుండాల బెంజిమెన్, పుష్పమ్మ, దార్ల చెన్నయ్య, గుండాల కిష్టమ్మ దార్ల పద్మమ్మ, పెనుబాక వెంకటయ్య, కుప్పంపాటి జనార్దన్, దార్ల పోలయ్య, గుమ్మా రామయ్య తదితరులు ఉన్నారు.

# సంక్షేమాభివృద్ధి ఫలితాలతోనే ప్రజల్లోకి ....

## తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దాదాపుగా అమలు చేసి, అభివృద్ధి, సంక్షేమ ఫలితాలతోనే ప్రజల ముందుకు వస్తున్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ జరుగుతోందన్నారు. పై కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, కో క్లస్టర్ ఇంచార్జ్ కుంచనపల్లి శివకుమార్, టీడీపీ నాయకులు కోసూరు కేశవులు, ఉప్పల ఈశ్వరయ్య, రాజగోపాల్ రెడ్డి, కన్వేల రమణయ్య, సాల్మన్, చిరమణ సూర్యం, శ్రీహరి, అనిల్, మాలతి, బుజ్జమ్మ పాల్గొన్నారు.





# ప్రజల మద్దతే మా బలం : నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (చైతన్యరథం): నగరంలోని 48వ డివిజన్, 107వ బూత్ పరిధిలో నిర్వహించిన "ఇంటింటకీ టీడీపీ" కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటిని సందర్శిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడం జరిగింది.ప్రజల విశ్వాసంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేయడమే కాకుండా, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోంది. అమలులో ఉన్న పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి సమర్థవంతంగా అందుతున్నాయా లేదా అనే అంశాన్ని ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పనకు సమాన ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రాన్ని పురోగతి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. మంత్రి నారాయణ ఆధ్వర్యంలో నెల్లూరు నగరం మౌలిక సదుపాయాలు, విద్యా రంగం సహా అన్ని విభాగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మంత్రి నారాయణ ఆదేశాలు, సూచనల మేరకు నెల్లూరు నగరంలోని ప్రతి వార్డు, ప్రతి బూత్‌ను సందర్శిస్తూ "ఇంటింటికి టీడీపీ" కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తూ, ప్రభుత్వ సంక్షేమం అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికి చేరవేసేందుకు కృషి చేస్తున్నాము. కార్యక్రమంలో జాఫర్, కీర్తి, పెంచల బాబు, నవీన్, జ్ఞానేంద్ర, ఇలియాస్, నాగేంద్ర, రాజేష్, బూత్ కన్వీనర్లు పాండు, శ్యామ్, కయ్యాల గోపి, సీనయ్య, వీరశేఖర్, కర్ణ, రాజశేఖర్, పద్మనాభం, ఐశ్వర్య, సునీత, రేష్మ స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇంటింటికీ సీఎం చంద్రన్న సంక్షేమం

## ప్రజల ముంగిటకు కూటమి ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి ఫలాలు మంత్రి ఎన్ఎండీ ఫరూక్



నంద్యాల (చైతన్యరథం): నంద్యాల మండలం కానాల గ్రామంలో గ్రామ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో రూపొందించిన కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ, వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై, చంద్రన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి ఎలా చేరుతున్నాయో తెలుసుకోవడంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. యువత భవిష్యత్తు, పేదల సంక్షేమం, మహిళల సాధికారత, విద్య, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చంద్రన్న సంక్షేమ పాలనపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కి నంద్యాల ప్రజలు తమ పూర్తి మద్దతు తెలియజేస్తున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పిట్టల మదర్సా , సొసైటీ డైరెక్టర్ బాలమదిలేటి, మాజీ సర్పంచ్ పిడి ఉసేని, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాబు, మండల జనరల్ సెక్రెటరీ పిట్టల అనీఫ్, బుగ్గ రామేశ్వరం టెంపుల్ చైర్మన్ కిరణ్ కుమార్ రెడ్డి, విజయ శేఖర్ రెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సాయిబాబా, ఉప్పు వెంకటేశ్వర్లు, మెహతాబ్, శ్రీనివాసులు, ప్రేమ్ నాథ్ రెడ్డి, నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, జిల్లా పార్టీ సెక్రటరీ రాజేష్ (బుజ్జి), పోలూరు సొసైటీ చైర్మన్ చంద్రమౌళి రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ కమిటీ హాల్‌లో నిర్వహించిన సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సమావేశంలో కమిటీ సభ్యుని హోదాలో పాల్గొన్న కనిగిరి శాసనసభ్యుడు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి. ఈ సమావేశంలో సహచర కమిటీ సభ్యులతో కలిసి పలు ప్రజాప్రయోజన అంశాలపై చర్చించి, శాసనాలు నిబంధనల సమర్థ అమలుకు అవసరమైన సూచనలు చేశారు.

# పొట్టిపాడులో ఇంటింటికీ టీడీపీ

## పాల్గొన్న మంత్రి బీసీ జనార్ధన్

బనగానపల్లె (చైతన్యరథం): కోవెలకుంట్ల మండలం పొట్టిపాడు గ్రామంలో "ఇంటింటికి తెలుగుదేశం పార్టీ" కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన విజయాలను ఇంటింటకీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ అభివృద్ధి ఫలాలను ప్రజలకు స్వయంగా వివరించారు. స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారికి అందుతున్న సంక్షేమ అభివృద్ధి ఫలాలపై లబ్ధిదారులను ఆరా తీసిన మంత్రి స్థానికంగా క్షేత్రస్థాయి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



# టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పునఃప్రారంభం

## ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు భూమిపూజ



రాయదుర్గం (చైతన్యరథం): పట్టణ శివారులో గత ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు భూమిపూజ నిర్వహించి అధికారికంగా పునఃప్రారంభించారు గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో వందలాది మంది పేదల సొంతింటి కల నెరవేరకుండా టిడ్కో ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, నిలిచిపోయిన అభివృద్ధి పనులకు మళ్లీ జీవం పోస్తోందని పేర్కొన్నారు. రాయదుర్గంలోని టిడ్కో ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు త్వరలోనే అందజేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పేద కుటుంబాలకు సొంతింటిని అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# కదిరిలో సందడి సందడిగా ఇంటింటికీ టీడీపీ



కదిరి (చైతన్యరథం): కదిరి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా తలుపుల మండలం ఉడుములకుర్తి పంచాయతీ పరిధిలోని సోమాలవాండ్లపల్లి గ్రామంలో నిర్వహించిన ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా కలిసి, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి, సమర్థ నాయకత్వంతో రాష్ట్రంలో అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాలు సమన్వయంతో అమలవుతున్నాయని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు. నంబులపూలకుంట మండలం, గౌకనపల్లి గ్రామానికి చెందిన రైతు వేంకటేష్ అప్పుల భారం, వరుస పంట నష్టాలతో మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసి కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విచారం వ్యక్తం చేశారు.

# ఇంటింటికీ అభివృద్ధి సందేశం

## పాల్గొన్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

నందికొట్కూరు (చైతన్యరథం): ఎమ్మెల్యే గిత్త జయసూర్య నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండలంకృష్ణరావుపేట గ్రామంలో నిర్వహించిన "రెండేళ్ల సంక్షేమ అభివృద్ధి" ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ప్రజల ఆశీర్వాదం, విశ్వాసంతో కృష్ణరావుపేట గ్రామం మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో: పాములపాడు మండల కూటమి నాయకులు గ్రామ నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు





# కువైట్‌లో 'ఇంటింటికీ టీడీపీ'

## ప్రచారాన్ని ప్రారంభించిన గల్ఫ్ రీజనల్ కో-ఆర్డినేటర్ సురేష్‌బాబు

**కువైట్:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను ఎన్ఆర్ఐలకు చేరవేసే లక్ష్యంతో కువైట్‌లో 'ఇంటింటికీ తెలుగుదేశం' ప్రచారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. టీడీపీ గల్ఫ్ రీజనల్ కో-ఆర్డినేటర్ మాలేపాటి సురేష్‌బాబునాయుడు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు, సీనియర్ నాయకులు కువైట్‌లో ఇంటింటికీ తిరిగి తెలుగు కుటుంబాలను కలిశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు అందిన సేవలు, భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. ఎన్ఆర్ఐల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సైతం వివరించగా స్థానిక తెలుగు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రీజనల్ కో-ఆర్డినేటర్ సురేష్‌బాబునాయుడు మాట్లాడుతూ "తెలుగుదేశం పార్టీ ఆశయాలు, ప్రభుత్వం అందిస్తున్న పాలనా ఫలాలు గల్ఫ్‌లోని తెలుగువారికి చేరాలనేదే మా ముఖ్య ఉద్దేశం. ప్రజల నుంచి వస్తున్న అపూర్వ ఆదరణతో రాబోయే 45 రోజుల పాటు కువైట్‌వ్యాప్తంగా ఇంటింటికీ టీడీపీ ప్రచారాన్ని కొనసాగిస్తాం' అని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పద్మరాజు వేణుగోపాల్ రాజు, షేక్ జిలానీ బాషా, మహబూబ్ బాషా, మునీర్ బాషా, పచ్చిపాల ద్వారకనాథ, ప్రవీణ్‌కుమార్, శంకర్‌నాయుడు, పగడాల సుగుణమ్మ, సుజన్‌కుమార్, ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.





# ౨౦౨౯లో టీడీపీ విజయమే లక్ష్యం

## జర్మనీలో ఎన్ఆర్ఐ శ్రేణుల సంకల్పం... పార్టీ విధానాలు, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం

**డ్యూసెల్డార్ఫ్:** జర్మనీలోని నార్త్ రైన్-వెస్ట్‌ఫేలియా (NRW) రాష్ట్ర ఎన్ఆర్ఐ టీడీపీ సమావేశం డ్యూసెల్డార్ఫ్‌లో ఉత్సాహభరితంగా జరిగింది. అభిమానులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ పట్ల తమ నిబద్ధత చాటారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్లుగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పురోగతి, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధిని ప్రశంసించారు. 2029 సాధారణ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని కార్యకర్తలు సంకల్పించారు. జర్మనీలోని తెలుగు ప్రజల్లోకి టీడీపీ విధానాలు, ప్రభుత్వ విజయాలను మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. పార్టీ శ్రేణుల మధ్య ఐక్యత, సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడానికి NRW రాష్ట్ర టీడీపీ సమావేశాలను తరచూ నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో కిషోర్ నల్లపాటి, డాక్టర్ దీప కందుల, లక్ష్మీపతి మద్దిపట్ల, శ్రీకృష్ణుడు నాగండ్ల, రామకృష్ణ కొమదూరి, అశోక్‌బాబు దాసరి, శ్రీకాంత్ ఎర్రగుంట, సురేష్ గుడివాడ, స్వప్న, రఘుకుమారి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి సుమంత్ కొర్రపాటి, ఫర్హత్ మిర్జా, దినేష్ కోవి, లోకేష్, వంశీ హాజరు కాగా మ్యూనిక్ నుంచి నరేష్ కోనేరు వచ్చారు. APNRTS అందించే సేవలను రీజినల్ కో-ఆర్డినేటర్ నరేశ్ కోనేరు వివరించారు. పురుషులు, మహిళలు, చిన్నారులు పాల్గొనడంతో సమావేశం ఆత్మీయ, కుటుంబ వాతావరణంలో సాగింది. అనంతరం అందరూ కలిసి రుచికరమైన భోజనం తిని స్నేహపూర్వకంగా ముచ్చటించుకున్నారు. జర్మనీలో ఎన్ఆర్ఐ టీడీపీ శ్రేణుల ఐక్యత, టీడీపీ పట్ల ఉన్న నిబద్ధతకు ఈ సమావేశం ప్రతీకగా నిలిచింది.



## అంతర్జాతీయ వైద్య వేదికపై

# తెలుగు వైద్యుడికి అరుదైన గౌరవం

### డాక్టర్ నరేష్‌బాబుకు 'ఉత్తమ పరిశోధన పత్రం' పురస్కారం

### సింగపూర్‌లో జరిగిన వార్షిక సదస్సులో ప్రదానం

**గుంటూరు (చైతన్యరథం):** తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వెన్నుముక శస్త్ర చికిత్స నిపుణుడు, గుంటూరులోని 'మల్లిక స్పైన్ సెంటర్' అధినేత డాక్టర్ జె.నరేష్‌బాబు అంతర్జాతీయ స్థాయిలో మరోసారి ఘనత సాధించి తెలుగువారికి గర్వకారణంగా నిలిచారు. సింగపూర్‌లో జూలై 16 నుంచి 19 వరకు నిర్వహించిన అంతర్జాతీయ వెన్నుముక నిపుణుల ఉమ్మడి వార్షిక సదస్సులో ఆయనకు ప్రతిష్టాత్మక ఉత్తమ పరిశోధన పత్రం' (Best Paper Award) పురస్కారం లభించింది. మెడ, వెన్నుముక సమస్యల నిర్ధారణలో నూతన దృక్పథాన్ని ఆవిష్కరిస్తూ ఆయన చేసిన పరిశోధనకు ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన నిపుణుల సమక్షంలో ఈ గుర్తింపు దక్కింది.

**'సిట్టింగ్ ఎమ్ఆర్ఐ'తో కొత్త అధ్యాయం**

సాధారణంగా మెడ నొప్పితో బాధపడే రోగులను పడుకోబెట్టి ఎమ్ఆర్ఐ (MRI) స్కాన్ తీస్తారు. అయితే ఆ సమయంలో మెడపై పడే ఒత్తిడి రోజువారీ సహజ పరిస్థితుల్లో ఉన్నట్లుగా ఉండకపోవడం వల్ల కొన్ని తీవ్రమైన సమస్యలను ముందస్తుగా గుర్తించడంలో పరిమితులు ఏర్పడుతున్నాయని డాక్టర్ నరేష్ బాబు గమనించారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రపంచంలోనే తొలిసారిగా 'సిట్టింగ్ ఎమ్ఆర్ఐ' (Sitting MRI) సాంకేతికతను ఉపయోగించి పరిశోధన చేపట్టారు. రోగి కూర్చున్నప్పుడు, నిల్చున్నప్పుడు, అలాగే మెడను ముందుకు, వెనక్కి వంచినప్పుడు వెన్నుముకలో జరిగే మార్పులను ఈ స్కాన్ ద్వారా నిశితంగా పరిశీలించారు.



**పరిశోధనలోని ముఖ్యాంశాలు:**

**కండరాల బలహీనత గుర్తించడం:** మెడ సమస్యలతో బాధపడుతున్న వారిలో లోపలి కండరాలు బలహీనపడటం వల్ల, ప్రతిసారి మెడ కదిలించినప్పుడు వెన్నుపాము నరంపై తీవ్ర ఒత్తిడి పడుతుందని ఈ పరిశోధన ద్వారా నిర్ధారించారు.

**లక్షణాల తీవ్రతకు కారణం:** ఫలితంగా మెడ నొప్పి తీవ్రమవ్వడం, చేతులు లాగడం, తిమ్మిర్లు రావడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని వెల్లడించారు.

**ముందస్తు చికిత్స:** ఈ నూతన విధానం వల్ల సమస్యలను ప్రారంభ దశలోనే కచ్చితంగా గుర్తించి సరైన వైద్యాన్ని అందించే అవకాశాలు మెరుగవుతాయి.

**19 ఏళ్ల తర్వాత సింగపూర్‌లో మరో పురస్కారం**

ఈ సందర్భంగా డాక్టర్ నరేష్‌బాబు మాట్లాడుతూ.. 'గతంలో 2007లో కూడా సింగపూర్ నుంచే నా పరిశోధనకు పురస్కారం లభించింది. దాదాపు 19 సంవత్సరాల తర్వాత మళ్లీ అదే దేశంలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ విజయం నా ఒక్కడిదే కాదు, పరిశోధనా బృందం కష్టానికి లభించిన ఫలితం. గుంటూరులోని మల్లిక స్పైన్ సెంటర్ ప్రస్తుతం అంతర్జాతీయ పరిశోధనా కేంద్రంగా గుర్తింపు పొందడం గర్వకారణం. భవిష్యత్తులో మరిన్ని ఆధునిక పరిశోధనలతో వెన్నుముక వైద్యంలో కొత్త ప్రమాణాలు నెలకొల్పేందుకు కృషి చేస్తాం" అని తెలిపారు.

## సెయింట్ లూయిస్‌లో

# 'నాట్స్' ఉచిత వైద్య శిబిరం

**సెయింట్ లూయిస్:** భాషే రమ్యం.. సేవే గమ్యం అనే నినాదానికి తగ్గట్టుగా ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) మిస్సోరీ చాప్టర్ సెయింట్ లూయిస్‌లోని మహాత్మా గాంధీ సెంటర్ వేదికగా ప్రవాస తెలుగు ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. ప్రతి మాసం ఇలా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం నాట్స్ మిస్సోరీ విభాగం ఒక బాధ్యతగా భావిస్తోంది. వృత్తిపరమైన బిజీలో ఉన్నప్పటికీ తోటి వారికి సాయపడాలనే విశాల దృక్పథంతో ప్రముఖ వైద్యులైన 'నాట్స్' అడ్వైజరీ బోర్డు సభ్యుడు డాక్టర్ సుధీర్ అట్లూరి, ఇంటర్నల్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ బాపూజీ దార్శి స్వయంగా సేవలందించారు. రోగులను ఎంతో ఓపికతో పరీక్షించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి కేవలం చికిత్స మాత్రమే కాకుండా ధైర్యాన్నిస్తూ తగు సలహాలు, సూచనలు అందించారు. సేవ అనేది ఒకరిద్దరితో అయ్యేది కాదు, అందరి సమష్టి కృషితో సాధ్యమవుతుందని ఈ కార్యక్రమం మరోసారి నిరూపించింది.

ఈ బృహత్కార్యం విజయవంతం వెనుక నాట్స్ ఎన్‌సీ జోనల్ వైస్ ప్రెసిడెంట్ సందీప్ కొల్లిపరతో పాటు నాయకుడు నాగ శ్రీనివాస్ శిష్ట, మిస్సోరీ చాప్టర్ నాయకులు, వలంటీర్లు తమ విలువైన సేవలు అందించారు. శిబిరం నిర్వహించిన నాట్స్ మిస్సోరీ విభాగాన్ని నాట్స్ చైర్మన్ కిషోర్ కంచర్ల, నాట్స్ అధ్యక్షుడు రాజ్ అల్లాడ ప్రత్యేకంగా అభినందించారు. ఇందులో సేవలు అందించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



# అంచెలంచెలుగా అందరికీ అవకాశాలు

### అసంతృప్త నేతలకు సీఎం డీకే శివకుమార్ కీలక సందేశం




కర్ణాటక కేబినెట్ విస్తరణ పూర్తయిన నేపథ్యంలో ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అసంతృప్త నేతలకు కీలక సందేశం ఇచ్చారు. శాసనసభ్యులందరినీ ఒకేసారి మంత్రివర్గంలోకి తీసుకోవడం సాధ్యం కాదని, ఇప్పుడు అవకాశం రాని నాయకులకు భవిష్యత్తులో తప్పకుండా ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. బెంగళూరులోని లోక్‌భవన్‌లో కొత్త మంత్రుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి వెళ్లే ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మన వద్ద చాలామంది సమర్థులైన ఎమ్మెల్యేలు ఉన్నారు. అయితే అందరినీ ఒకేసారి కేబినెట్‌లోకి తీసుకోవడం సాధ్యపడదు. గతంలో సిద్దరామయ్య మంత్రివర్గంలో నాకు కూడా అవకాశం దక్కలేదు. కానీ ఆ తర్వాత నేను మంత్రిని అయ్యాను కదా? అదే రీతిలో ఇప్పుడు పదవులు రాని వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు కల్పిస్తాం. అందరూ ఓపికగా ఉండాలని కోరుతున్నాను' అని శివకుమార్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదంతో ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ తన కేబినెట్‌లోకి 20 మంది నేతలను చేర్చుకున్నారు. ఇందులో 12 మంది కొత్త ముఖాలకు అవకాశం దక్కగా, 8 మంది మునుపటి మంత్రులను తిరిగి కొనసాగించారు. ఈ జాబితాలో గాయత్రి శాంతెగౌడ ఏకైక మహిళా మంత్రిగా చోటు దక్కించుకున్నారు.

# ఉదయనిధి సభలో నటి త్రిష న్నామస్మరణ





కావేరి జలాల సమస్యపై డీఎంకే ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఈ ధర్నాలో డీఎంకే నేత, ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయనిధి స్టాలిన్ ప్రసంగిస్తూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు ఉన్న ఏకైక టెన్షన్ అంటూ ఉదయనిధి వ్యాఖ్యలు చేస్తుండగా, సభలో కొంతమంది డీఎంకే కార్యకర్తలు ఒక్కసారిగా 'త్రిష.. త్రిష..' అంటూ నినాదాలు చేయడం ప్రారంభించారు. దీంతో సమావేశ ప్రాంగణంలో కొద్దిసేపు సందడి నెలకొంది. ఉదయనిధి ప్రసంగం కొనసాగుతుండగానే కార్యకర్తల నినాదాలు వినిపించడంతో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే.. మదురైలో ప్రముఖ నటి త్రిష రాజకీయ ప్రవేశాన్ని కోరుతూ పోస్టర్లు వెలవడం వైరల్‌గా మారింది. మదురై ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ పోస్టర్లలో త్రిష రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షిస్తూ సందేశాలు కనిపించాయి. దీంతో ఆమె పొలిటికల్ ఎంట్రీపై సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో మరోసారి చర్చ మొదలైంది. అయితే త్రిష ఇప్పటివరకు తన రాజకీయ ప్రవేశంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు ఆమోదం



సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండటంతో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు ఆమోదం పొందింది. ఆర్డినెన్స్ జారీని వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో సభ తిరస్కరించింది. సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు-2026ను సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దాని గురించి వివరించారు. అనంతరం బిల్లుపై సభ్యులు మాట్లాడాలని సభాపతి ఓం బిర్లా కోరినప్పటికీ, విపక్షాల నినాదాలు కొనసాగడంతో బిల్లును ఓటింగ్‌కు పెట్టారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026కు సభ ఆమోదం తెలిపింది. ఇటీవల జనన, మరణాల నమోదు చట్ట సవరణ బిల్లు కూడా లోక్‌సభలో చర్చ లేకుండానే ఆమోదం పొందింది. తాజా బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభను స్పీకర్ వాయిదా వేశారు.



### ఇక జంతర్ మంతర్ వద్ద

# నిరసనలకు జానా నహీ!

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనల నిర్వహణపై సోమవారం సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. నిరసనల నిర్వహణకు జంతర్ మంతర్ సరైన ప్రదేశం కాదంటూ సతీష్ చంద్ కౌశిక్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనల కారణంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. నిత్యావసర వస్తువుల సరఫరాకు, వైద్య సేవలకు ఆటంకం కలుగుతోందని సతీష్ చంద్ కౌశిక్ కోర్టుకు వివరించారు. ధర్నాలు, ఆందోళనలు నిర్వహించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. పిటిషనర్ వాదనలు విన్న కోర్టు నిరసనలకు ప్రత్యామ్నాయ వేదిక కేటాయింపుపై కేంద్రాన్ని సంప్రదించాలని సొలిసిటర్ జనరల్‌కు సూచించింది.



# సొమ్ము ప్రజలది.. సోకు అధికారులదీనా!

### బొమ్మ కార్లు పంపి వ్యంగ్యాస్త్రాలు సంధించిన మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన

బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల వాహనాల మార్పు వివాదం కొత్త మలుపు తిరిగింది. ఖరీదైన ఇన్నోవా క్రిస్టా కార్లను కొనుగోలు చేయాలని బీఎంసీ అధికారులు చేసిన ప్రతిపాదనపై రాజ్ ఠాక్రే నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన వ్యంగ్యంగా స్పందించింది. బీఎంసీ కార్యాలయానికి బొమ్మ ఇన్నోవా కార్లను పంపించింది. అయితే భద్రతా సిబ్బంది ఆ బొమ్మ కార్లను కార్యాలయ ప్రాంగణంలోకి అనుమతించకుండా తిరిగి పంపించారు. కొద్ది నెలల క్రితమే బీఎంసీ అధికారులు స్కార్పియో కార్లను వినియోగంలోకి తీసుకొచ్చారు. అయితే వాటిలో ప్రయాణం వల్ల వెన్నునొప్పి వస్తోందని, సౌకర్యవంతంగా లేవని కొందరు ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఇన్నోవా క్రిస్టా కార్లను కొనుగోలు చేయాలని ప్రతిపాదించారు. ఒక్కో ఇన్నోవా క్రిస్టా కారు ధర సుమారు రూ. 25 లక్షల వరకు ఉంటుంది. ఈ నిర్ణయం రాజకీయంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ నిర్ణయాన్ని ఎద్దేవా చేస్తూ ఎంఎన్ఎస్ నేత సందీప్ దేశ్‌పాండే బీఎంసీకి బొమ్మ ఇన్నోవా కార్లను పంపించారు. ప్రజల డబ్బుతో విలాసవంతమైన వాహనాలు కొనుగోలు చేయడం సరైన పద్ధతి కాదని ఆయన విమర్శించారు. మరోవైపు, బీఎంసీ మేయర్ రీతూ తావ్డే మాత్రం ఈ ప్రతిపాదనను సమర్థించారు. ప్రస్తుత ఒప్పందం ప్రకారం, అవసరమైతే వాహనాలను మార్చుకునే అవకాశం ఉందని, వెన్నునొప్పి సమస్య కారణంగానే ఈ మార్పు ప్రతిపాదన వచ్చిందని ఆమె తెలిపారు.



# ప్రశాంత్ కిషోర్ సంచలన విజయం

### 30 ఏళ్ల బీజేపీ కంచుకోటకు బీటలు

బీహార్‌లోని బంకీపూర్ శాసనసభ ఉపఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ సంచలన విజయం సాధించారు. గత 30 ఏళ్లుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో పీకే గెలుపు జెండా ఎగరేశారు. ప్రశాంత్ కిశోర్ తన సమీప బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాపై 18,953 ఓట్ల భారీ తేడాతో ఘన విజయం సాధించారు. కౌంటింగ్ మొదలైనప్పటి నుంచి బీజేపీ నేత నీరజ్ కుమార్ కంటే ముందంజలో ఉన్న ప్రశాంత్ కిశోర్ ఒక్కో రౌండ్ ముగిసేసరికి తన ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకున్నారు. పీకేకు 63,203 పోలయ్యాయి. అలానే రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ కు 44,250, మూడో స్థానంలో నిలిచిన ఆర్జేడీ అభ్యర్థి రేఖ కుమారి 14,085 ఓట్లు సాధించారు. ఈ చరిత్రాత్మక విజయం అనంతరం ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ.. తన గెలుపు బీజేపీ హైకమాండ్‌కు ఒక బలమైన సందేశమని వ్యాఖ్యానించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తి బీహార్ ముఖ్యమంత్రిగా చేశారని తీవ్రస్థాయిలో మండిపడిన ఆయన, సామ్రాట్ చౌదరిని వెంటనే సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఉపఎన్నిక ఫలితం బీహార్ రాజకీయాల్లో సరికొత్త మార్పునకు సంకేతమని ఆయన పేర్కొన్నారు.



# అమెరికా-ఇరాన్ మధ్య నేటినుంచి చర్చలు

అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తతల వేళ డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం మధ్యాహ్నం నుంచి ఇరు దేశాల మధ్య చర్చలు ప్రారంభమవుతాయని ప్రకటించారు. తాము ఇరాన్‌పై భీకర దాడులు చేపట్టాలని భావించామని, అవే జరిగి ఉంటే రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అది పెద్ద దాడిగా ఇది మిగిలిపోయేదన్నారు. అయితే ఘర్షణల ఆలోచన పక్కనపెట్టి, దౌత్యంవైపే మొగ్గుచూపామని పేర్కొన్నారు. మిలిటరీ ఆపరేషన్‌ను నిలిపివేయాలని పశ్చిమాసియాలోని మిత్రదేశాలు కోరాయని ఎయిర్‌ఫోర్స్ వన్లో మీడియాతో అన్నారు. "మేం వారితో సంప్రదింపులు జరుపుతున్నాం. చర్చలు సోమవారం మధ్యాహ్నం ప్రారంభమవుతాయి. చూద్దాం ఏం జరుగుతుందో. ఘర్షణల కంటే సంప్రదింపుల ద్వారా పరిష్కారానికే నేను ప్రాధాన్యం ఇస్తాను. వాటివల్ల ఎన్నో ప్రాణాలు నిలుస్తాయి. చర్చలతో విధ్వంసాన్ని అడ్డుకోవచ్చు. వాస్తవానికి ధ్వంసమైన వాటిని నిర్మించేందుకు ఎన్నో ఏళ్లు పడుతుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. ఒప్పందం ఎప్పటిలోగా కుదరొచ్చంటూ ఎదురైన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. "నేనైతే ఒప్పందం కుదుర్చుకోవడానికే ఇష్టపడతాను. ఎందుకంటే ప్రజలను చంపాలని మేం అనుకోవడం లేదు. అది మాకు ఇష్టం లేదు" అని వ్యాఖ్యానించారు. హర్మూజ్ ఈ చర్చల్లో కీలక అంశంగా ఉంటుందనేది తెలిసిందే. అలాగే, ఇరాన్ అణు ప్రయత్నాల అడ్డుకట్ట వేయడమనేది మరో ముఖ్యాంశం. ఇదిలాఉంటే.. ఈ దౌత్య ప్రయత్నాల గురించి ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ.. సౌదీ అరేబియా విదేశాంగమంత్రి, పాకిస్థాన్ ఆర్మీచీఫ్ మునీర్‌తో ఫోన్లో మాట్లాడారు. చర్చల ప్రకటన రాగానే ముడి చమురు ధరలు దిగొచ్చాయి

# ప్రపంచంపై డ్రాగన్ నిఘా

## విదేశీయులపైనా చైనా నిఘా జాలం.. వెలుగులోకి వచ్చిన రహస్య డేటాబేస్

చైనా తన సొంత పౌరులతోపాటు విదేశాల నుంచి వచ్చే సందర్శకులపైనా భారీస్థాయిలో నిఘా పెడుతున్నట్టు తాజాగా వెలుగులోకి వచ్చిన ఒక కథనం సంచలనం రేపుతోంది. ఆమ్‌స్టర్‌డామ్‌కు చెందిన సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు, జర్నలిస్టు అయిన మార్క్ హోఫర్ (46) చైనా తన పౌరులను ఎలా గమనిస్తుందో అధ్యయనం చేయడం ఆయనకు దీర్ఘకాలంగా ఆసక్తికరమైన అంశం. అంతకుముందు చైనాలో విదేశీ ప్రతినిధిగా పనిచేసిన అనుభవం ఉన్న హోఫర్, ఈ ఏడాది జనవరిలో ఇంటర్నెట్‌లో మామూలుగా వెతుకుతుండగా 'డైనమిక్ కంట్రోల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఓవర్సీస్ పర్సనల్' అనే ఒక వెబ్‌సైట్‌ను గుర్తించారు. చైనాలోని ఉత్తర ప్రాంతంలో, 2022 వింటర్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చిన ప్రముఖ స్కీయింగ్ నగరమైన ఝాంగ్జియాకోలో నివసించే విదేశీయులను ట్రాక్ చేసేలా ఈ డ్యాష్‌బోర్డు రూపొందించినట్టు తేలింది. తనకు సంబంధించిన పేరు, ఫొటో, పాస్‌పోర్టు నంబరు, గతంలో చైనా పర్యటన సందర్భంగా వాడిన మొబైల్ నంబరు సహా అన్ని వ్యక్తిగత వివరాలు ఆ వెబ్‌సైట్‌లో నమోదై ఉండటం చూసి హోఫర్ దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఈ డ్యాష్‌బోర్డు 700 మందికి పైగా ఝాంగ్జియాకోలో నివసించే విదేశీయులను ట్రాక్ చేస్తున్నట్టు స్వయంగా పేర్కొంది. అయితే మొత్తంగా చూస్తే, పరారీలో ఉన్న నేరస్థులు, హాంకాంగ్, తైవాన్‌కు చెందిన వ్యక్తులు, 300 మందికి పైగా విదేశీ జర్నలిస్టులతో సహా దాదాపు 12 వేల మంది వివరాలు ఈ వ్యవస్థలో నమోదై ఉన్నాయి. వీరిలో కొందరు ఝాంగ్జియాకోకు అసలు వెళ్లనివారు కూడా ఉండటం గమనార్హం. భారత్, తైవాన్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, బ్రిటన్, అమెరికా, ఈజిప్ట్, ఇరాన్, ఇజ్రాయెల్,



మొరాకో, పాకిస్థాన్, సూడాన్ దేశాలకు చెందిన పౌరులు ఈ జాబితాలో ఉన్నారు. ఝాంగ్జియాకోలోని హెబె నార్త్ యూనివర్సిటీలో చదివే విదేశీ విద్యార్థుల సమాచారం కూడా ఇందులో నిక్షిప్తమై ఉంది. వీరిలో భారత్, పాకిస్థాన్ విద్యార్థుల సంఖ్యే ఎక్కువగా ఉండటం విశేషం. ఈ డేటాబేస్‌లో కేవలం వ్యక్తిగత వివరాలే కాకుండా, వారు నిత్యం సందర్శించే ప్రాంతాలు, ఆసుపత్రి సందర్శనలు, గ్యాస్ బిల్లుల చెల్లింపులు, వారు ప్రయాణించిన విమానాలు-రైళ్ల వివరాలు, సీటు నంబర్ల వరకు నమోదు చేసినట్టు తేలింది. మంగోలియాకు చెందిన ఒక మహిళ నివాస సముదాయం నుంచి షాపింగ్ మాల్స్, రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్లకు వెళ్లిన కదలికలను సైతం ఈ వ్యవస్థ నమోదు చేసినట్టు వెల్లడైంది. కెమెరాలు, ఫోన్ సిగ్నళ్ల ద్వారా వీరిని చైనా అధికారులు నిరంతరం గమనిస్తుండగా, స్వదేశాలకు తిరిగి వెళ్లిన తర్వాత కూడా ఈ నిఘా కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఈ డ్యాష్‌బోర్డు ఝాంగ్జియాకో పబ్లిక్ సెక్యూరిటీ బ్యూరో కోసమే ప్రత్యేకంగా రూపొందించినట్టు భావిస్తున్నారు. ఎనిమిది పోలీస్ స్టేషన్లు, ఇతర నగరాలకు చెందిన మరో మూడు స్టేషన్ల యూజర్ లాగ్ కూడా ఇందులో కనిపించడం, ఇది కేవలం ఒక ప్రయోగం కాదని, పోలీసు వ్యవస్థలో భాగంగానే పనిచేస్తోందని సూచిస్తోంది. పోలీసులకు రోబోటిక్స్, నిఘా పరికరాలను ప్రభుత్వ టెండర్ల ద్వారా సరఫరా చేసే బీజింగ్ సంస్థ 'ఆరిజిన్ డైనమిక్'కు ఈ వ్యవస్థతో సంబంధాలున్నట్టు కథనాలు పేర్కొంటున్నాయి. ఇది కేవలం ఒకే నగరానికి పరిమితమైన అంశం కాదని, నిఘా కెమెరాలు, వైద్య రికార్డులు, బిల్లులు, ఫేషియల్ రికగ్నిషన్ టూల్స్ వంటి బహుళ వనరుల నుంచి డేటాను సమీకరించి విశ్లేషించే సామర్థ్యం చైనా వద్ద ఇప్పటికే సిద్ధంగా ఉందనేదే అసలు ఆందోళనకర అంశం. 2019లో హాంకాంగ్‌లో చెలరేగిన భారీ ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల అనంతరం చైనా తన నిఘా వ్యవస్థను మరింత విస్తరించింది. అయితే, ఈ వెబ్‌సైట్‌లోని సమాచారమంతా మే నెలలో ఆకస్మికంగా అదృశ్యమైంది. అప్పటికే హోఫర్ ఆ డేటాను డౌన్‌లోడ్ చేసుకోవడం వల్లే ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. అయితే, ఈ విషయంపై ఇప్పటివరకూ చైనా నుంచి ఎలాంటి అధికారిక స్పందనా రాలేదు. ఒకే పరిశోధకుడు, ఒకే వార్తా సంస్థ ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ కథనానికి స్వతంత్ర ధృవీకరణ పరిమితంగానే ఉండటంతో, ఈ వ్యవస్థ ఎంతవరకు క్రియాశీలంగా ఉందో, మరిన్ని నగరాల్లో ఇలాంటి వ్యవస్థలు ఉన్నాయో లేదో స్పష్టత రావాల్సి ఉంది.



బొయిసే: అమెరికాలోని దక్షిణ ఇడాహోలో ఉన్న ఇన్-అండ్-అవుట్ బర్గర్ రెస్టారెంట్లో శనివారం జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు పౌరులు మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని ట్విన్ ఫాల్స్ నగర అధికార ప్రతినిధి వెల్లడించారు. కాల్పులకు తెగబడిన అనుమానిత వ్యక్తి మృతదేహాన్ని రెస్టారెంట్ సమీపంలో గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కాల్పులకు దారితీసిన కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు వారు వెల్లడించారు.

# సౌదీ గుండెల్లో రైళ్లు!

అమెరికా-ఇరాన్ మధ్య ఐదు నెలలుగా కొనసాగుతున్న యుద్ధం మరో కీలక మలుపు తిరిగింది. ఇరాన్‌లోని ఇంధన కేంద్రాలు, మౌలిక సదుపాయాలపై 'రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతిపెద్ద దాడి' చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పథకం సిద్ధం చేసుకున్నారు. అయితే, చివరి నిమిషంలో సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ శనివారం ట్రంప్‌కు ఫోన్ చేసి, దాడులొద్దని, చర్చలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరడంతో పరిస్థితి మారిపోయింది. దాడులు తీవ్రతరమైతే ఇరాన్ ప్రతీకారంగా అమెరికా మిత్రదేశాలైన గల్ఫ్ దేశాలనే లక్ష్యంగా చేసుకుంటుందని, అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనే తీవ్ర ప్రభావం చూపుతుందని యువరాజు హెచ్చరించారు. సౌదీతోపాటు ఖతార్, యూఏఈ దేశాధినేతల విజ్ఞప్తి మేరకే దాడులను తాత్కాలికంగా నిలిపివేసినట్టు ట్రంప్ ప్రకటించారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంతోపాటు ఇరాన్ అణు కార్యక్రమానికి తెరదించే ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. అయితే, తాము ఎలాంటి విరామాన్ని కోరలేదని, ఇది అమెరికా అబద్ధమని ఇరాన్ సైనిక అధికారులు ఖండించారు.

ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న సౌదీ అరేబియా, చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి బయటపడి పెట్టుబడులు, పర్యాటకం, ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా మారాలన్న లక్ష్యంతో 'విజన్ 2030' ప్రణాళికను అమలు చేస్తోంది. గత కొద్ది వారాలుగా సౌదీ చమురు కేంద్రాలపైనే కాకుండా, రియాద్‌నే లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులు జరగడం సౌదీని కలవరపెడుతోంది. ఇరాన్‌కు మద్దతిచ్చే యెమెన్ హూతీ తిరుగుబాటుదారులు సైతం సౌదీ చమురు మౌలిక సదుపాయాలపై దాడులు చేయడంతోపాటు, ఎర్ర సముద్రంలో నౌకా దిగ్బంధనం విధిస్తామని బెదిరిస్తున్నారు. యుద్ధం మరింత ముదిరితే తమ ఆర్థిక లక్ష్యాలకే గండి పడుతుందన్న భయం సౌదీని దౌత్యపరమైన జోక్యానికి పురిగొల్పుతోంది.

యుద్ధం ఐదు నెలలు దాటినా ఇరాన్ వైఖరిలో మార్పు లేదు. తమ ఇంధన కేంద్రాలపై దాడులు జరిగితే ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాల మౌలిక సదుపాయాలను నేలమట్టం చేస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ హెచ్చరిస్తున్నారు. అమెరికా దాడులకు ఏ గల్ఫ్ దేశమైనా సహకరించినా తీవ్ర ప్రతిఘటన తప్పదని పాకిస్థాన్, తుర్కియే, సౌదీ ఉన్నతాధికారులతో సమావేశమైన సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకా రవాణా పునరుద్ధరణకు ఇరాన్-ఒమన్ మధ్య చర్చలు జరుగుతున్నా, జలసంధిని పూర్తిగా తెరవడం ఇదేమీ కాదని ఇరాన్ విదేశాంగశాఖ స్పష్టం చేసింది. ఖతార్ మధ్యవర్తిత్వంతో అమెరికా, ఇరాన్ మధ్య రాజీ ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగుతుండటంతో ఇరాన్ లోపల్లోపలే ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశంలో నిరుద్యోగం పెరుగుతుండగా, కరెన్సీ విలువ కొత్త కనిష్ఠ స్థాయికి పడిపోయింది. యెమెన్‌లో బలంగా ఉన్న హూతీ తిరుగుబాటుదారులకు ఇరాన్ నుంచి పూర్తి మద్దతు లభిస్తోంది. గతంలో అమెరికా, సౌదీ కలిసి మిలిటరీ ఆపరేషన్లు చేపట్టినా హూతీలను పూర్తిగా అణచి వేయలేకపోయాయి. గల్ఫ్‌లో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగితే హూతీలు కూడా వెంటనే రంగంలోకి దిగే అవకాశం ఉండటం సౌదీకి పెద్ద తలనొప్పిగా మారింది. బలప్రయోగం కంటే దౌత్యం, ఆంక్షల సడలింపే మేలైన మార్గమని కొందరు నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతానికి దాడులు ఆగినా, చర్చలు సోమవారం తిరిగి మొదలవుతాయని ట్రంప్ ప్రకటించారు. ఒప్పందం కుదిరే వరకూ శాంతి సుస్థిరంగా ఉంటుందా, లేక మరోసారి ఉద్రిక్తతలు పెల్లుబుకుతాయా అనేది వేచి చూడాల్సిందే.




# నిర్దోషిగా బ్రిజ్ భూషణ్

**లైంగిక వేధింపుల కేసులో ఢిల్లీ కోర్టు క్లీన్‌చిట్**

**హైకోర్టుకు వెళ్తామన్న రెజ్లర్లు**

భారత రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తమను లైంగికంగా వేధించాడని భారత మహిళా రెజ్లర్లు అతడిపై కేసు వేశారు. ఢిల్లీ కోర్టు సోమవారం అతడిని నిర్దోషిగా ప్రకటించింది. భారత రెజ్లింగ్ ఫెడరేషన్‌కు చీఫ్‌గా బ్రిజ్ భూషణ్ పనిచేశారు. 2023 ఏప్రిల్‌లో ఆరుగురు మహిళా రెజ్లర్లు బ్రిజ్ భూషణ్ తమను లైంగికంగా వేధించాడని కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతేకాదు జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టారు. ఏప్రిల్ 28న అతడిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో అతడిపై రెండు కేసులు నమోదయ్యాయి. ఒకటి లైంగిక వేధింపులు, పరువుకు భంగం కలిగించడం, వెంటపడటంపై ఫిర్యాదు కాగా. రెండోది మైనర్ రెజ్లర్ ఫిర్యాదు ద్వారా పోక్సో కేసు నమోదయ్యాయి. దీంతో అతడితోపాటు డబ్ల్యూఎఫ్‌ఐ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌లపై కేసు నమోదు చేశారు. ఈ కేసు అప్పట్లో సంచలనాన్ని సృష్టించింది.

32 మంది సాక్షుల వివరణ, నిందితుల వాంగ్మూలాలపై విచారణ చేపట్టింది కోర్టు. ఈ కేసులో బ్రిజ్ భూషణ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు అడిషనల్ చీఫ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ అశ్విని పన్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2025లో మైనర్ ఫిర్యాదుదారకు సంబంధించిన పోక్సో కేసులో ఢిల్లీ పోలీసులు సమర్పించిన 'క్లోజర్ రిపోర్ట్ (కేసును మూసివేసే నివేదిక)ను' కూడా కోర్టు ఆమోదించింది. భారత క్రీడారంగంలో అత్యంత ప్రముఖమైన కేసుల్లో ఒకటి అయిన ఈ కేసుకు ముగింపు పలికారు.

**వ్యవస్థ మొత్తం బ్రిజ్ భూషణ్‌నే కాపాడుతుంది: వినేశ్ ఫోగట్**




ఢిల్లీ కోర్టు బ్రిజ్ భూషణ్‌కు క్లీన్ చిట్ ఇవ్వడంపై వినేశ్ ఫోగట్ స్పందిస్తూ.. బ్రిజ్ భూష్‌ణ్‌ను రక్షించడానికి వ్యవస్థ మొత్తం పనిచేసిందని ఆరోపించారు. దీనిపై న్యాయపోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. మహిళా రెజ్లర్లు తమ పోరాటాన్ని విడిచిపెట్టరని, ఢిల్లీ కోర్టు తీర్పుపై అప్పీల్‌కు వెళతామని పేర్కొన్నారు. ఈ విషయంలో ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేయాలని తమ లీగల్ టీమ్‌కు సూచించామని వెల్లడించారు. అధికార పార్టీకి చెందిన ప్రముఖ నాయకుడిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయించడానికి ధైర్యాన్ని కూడగట్టుకుని వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టాం. కేసు వాపసు తీసుకోమని అతడు తన పలుకుబడితో, కండబలంతో ఫిర్యాదుదారులను బెదిరించాడని ఆమె గుర్తు చేశారు. అయినా భయపడకుండా తమ న్యాయపోరాటాన్ని కొనసాగించామని తెలిపారు. కానీ ఢిల్లీ కోర్టు అతడిని నిర్దోషిగా తేల్చడం మాకు తీవ్ర నిరాశను కలిగించిందని వాపోయారు. అయినా దీనిపై వెనుకడుగు వేయమని, న్యాయం జరిగే వరకు పోరాడతామని పేర్కొన్నారు.

# చెత్త భాషను మానండి

**యువతకు షూటర్ మనూబాకర్ హితవు**

ఒలింపిక్ షూటర్ మనూ భాకర్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో ఓ మెసేజ్ పోస్టు చేశారు. చెడుగా మాట్లాడడం మానుకోవాలని యువతను కోరారు. తిట్టుకోవడం, దుర్భాషలాడడం .. మంచి పద్ధతి కాదని అన్నారు. మీరు మాట్లాడే మాటలే మీ వ్యక్తిత్వాన్ని సూచిస్తాయన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన షూటర్ మనూభాకర్.. తన ఎక్స్ అకౌంట్‌లో సుదీర్ఘ సందేశాన్ని పోస్టు చేశారు. మీ భాషే మీ వ్యక్తిత్వాన్ని సూచిస్తుందని, మీరెలాంటి వాళ్లో చెబుతోందని, మీ పదాలను తెలివిగా ఎంచుకోవాలని, ఎందుంటే మీరు అనుకున్నట్లే మీరు తయారు అవుతారన్నారు. చెడు భాషను వాడడం మంచి పద్ధతి కాదని, దుర్భాషలాడడం మానుకోవాలన్నారు. అలా చేస్తే నిర్మలంగా ఉండలేరన్నారు. కూల్‌గా ఉండడం అంటే హార్డ్ వర్క్ చేయడమేనని, దయతో ఉండాలని, ఇతరుల పట్ల గౌరవాన్ని చూపాలన్నారు.



మంచితనంతో విజయం సాధించాలన్నారు. మీ పేరెంట్స్, దేశాన్ని గర్వంగా నిలపాలన్నారు. ఈ విషయాన్ని మీకెందుకు చెబుతున్నానంటే, గత కొన్నేళ్ల నుంచి .. చెడు భాషను వాడుతున్న తీరు మారిందన్నారు. చాలామంది చాలా సాదాసీదాగా చెడు మాటలు మాట్లాడుతున్నారని, దాన్నే కూల్‌గా భావిస్తున్నారని, రోజువారీ మాటల్లో అమర్యాదకర భాషను వాడుతున్నట్లు షూటర్ మనూ భాకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

# సైనింగ్ ఆఫ్, కేప్ 278

**అంతర్జాతీయ క్రికెట్‌కు రహానే గుడ్‌బై.. సీనియర్లలో రిటైర్మెంట్ల ఊహాగానాలు**

టీమిండియా మాజీ వైస్ కెప్టెన్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు అధికారికంగా వీడ్కోలు పలికాడు. 38 ఏళ్ల ఈ సీనియర్ బ్యాటర్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక భావోద్వేగపూరిత వీడియో సందేశం పంచుకుంటూ, అన్ని ఫార్మాట్ల నుంచి తక్షణమే తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. "కేప్ నంబర్ 278, సైనింగ్ ఆఫ్" అంటూ తన సందేశాన్ని ముగించిన రహానే, తన కెరీర్‌లో గెలుపోటములు రెండూ చూశానని, కానీ అభిమానుల హృదయాల్లో మాత్రం ఎప్పుడూ ఓటమి ఎరుగనని పేర్కొన్నాడు. 2013లో అరంగేట్రం చేసిన రహానే, భారత్ తరపున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20లు ఆడాడు. టెస్టుల్లో 12 సెంచరీలు, 26 అర్ధసెంచరీలతో 5,077 పరుగులు సాధించగా, వన్డేల్లో మూడు సెంచరీలతో 2,962 పరుగులు చేశాడు. 2023లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టు సిరీస్‌దే అతని చివరి అంతర్జాతీయ మ్యాచ్. కెరీర్‌లో అత్యంత మరపురాని ఘట్టం మాత్రం 2020–21లో ఆస్ట్రేలియా పర్యటన. అడిలైడ్‌లో టీమిండియా 36 పరుగులకే ఆలౌటై, కెప్టెన్ విరాట్ కోహ్లి స్వదేశానికి తిరిగి రావాల్సి వచ్చిన సమయంలో, గాయాలతో కుదేలైన జట్టుకు సారథ్యం వహించిన రహానే, సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకున్న చారిత్రక విజయానికి నాయకత్వం వహించాడు. మెల్‌బోర్న్‌లో నమోదు చేసిన సెంచరీ అతని కెరీర్‌లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్‌గా నిలిచిపోయింది.




అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైనప్పటికీ, రహానే దేశవాళీ క్రికెట్‌లో మాత్రం చురుగ్గా కొనసాగుతూ 2024–25 సీజన్ వరకు ముంబైకి సారథ్యం వహించాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు నాయకత్వం వహించిన అతను, గత రెండు సీజన్లలో జట్టును సరైన ఫలితాలు అందించలేకపోయాడు. దీంతో అతని రిటైర్మెంట్ నిర్ణయం, కేకేఆర్ తమ తదుపరి కెప్టెన్ కోసం అన్వేషణ మొదలుపెట్టేలా చేసింది. రహానే వీడ్కోలుతో భారత క్రికెట్‌లో ఒక ముఖ్యమైన అధ్యాయం ముగిసిందని అభిమానులు, మాజీ ఆటగాళ్లు అభినందనలు తెలుపుతున్నారు. మరోవైపు, భువనేశ్వర్ కుమార్, ఇషాంత్ శర్మ, కరుణ్ నాయర్, శార్దుల్ ఠాకూర్, మహమ్మద్ షమీ వంటి సీనియర్లు కూడా జాతీయ జట్టుకు దూరంగా ఉండటంతో, వీరు కూడా త్వరలో రిటైర్మెంట్ ప్రకటించే అవకాశాలపై ఊహాగానాలు జోరందుకున్నాయి.

# ఫిజియోపై వేటు తప్పదా?

**బుమ్రా వైదొలగడంతో టీమిండియా వైద్య బృందంపై బీసీసీఐ కన్నెర్ర**

**శ్రీలంక సిరీస్ తర్వాత భారీ మార్పులు?**

యూకే పర్యటనలో వరుస ఓటముల అనంతరం భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ బృందంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఇప్పటికే అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే కేకేఆర్‌లో చేరేందుకు జట్టును వీడగా, టి.దిలీప్ ఒప్పందం ముగియడంతో ఆయనా బయటకు వెళ్లారు. ఫీల్డింగ్ దారుణంగా ఉండటంతో బీసీసీఐ కొత్త ఫీల్డింగ్ కోచ్‌ను నియమించింది. ఇప్పుడు చీఫ్ ఫిజియో కమలేశ్ జైన్, టీమ్ డాక్టర్ రిజ్వాన్ ఖాన్‌లపైనా బోర్డు దృష్టి సారించినట్టు వార్తలొస్తున్నాయి. శ్రీలంకతో ఆగస్టు 15న గాలేలో మొదలయ్యే టెస్టు సిరీస్ అనంతరం వీరిద్దరిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**ఇదేనా కారణం..?**

నితిన్ పటేల్ స్థానంలో 2022లో కమలేశ్ చీఫ్ ఫిజియోగా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇటీవలి నెలల్లో ఆటగాళ్ల గాయాల సమస్య తీవ్రరూపం దాల్చింది. హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ గాయాలతో జట్టుకు దూరమయ్యారు. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో కార్డిఫ్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డ స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆ తర్వాత నుంచి బౌలింగే చేయలేదు. మోకాలి గాయం పూర్తిగా నయం కావాల్సి ఉందని బీసీసీఐ వైద్య బృందం సూచించడంతో శ్రీలంక సిరీస్ నుంచి తప్పుకున్నారు. అతని స్థానంలో తొలిసారి జాతీయ జట్టుకు ఎంపికైన జమ్మూ కశ్మీర్ పేసర్ ఔకిబ్ నబీకి టెస్టు క్యాప్ దక్కనుంది. అంతకుముందు ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌లో కెప్టెన్ గిల్, గుర్నూర్ బ్రార్ కండరాలు పట్టేయడంతో ఇబ్బంది పడ్డారు. ఫిట్‌నెస్ సమస్యలతో అత్యుత్తమ జట్టును బరిలోకి దింపలేకపోతున్నామన్న అసంతృప్తి కెప్టెన్ గిల్, కోచ్ గంభీర్‌లో వ్యక్తమవుతోంది. కండిషనింగ్ కోచ్‌గా సోహం దేశాయ్ నుంచి అడ్రియన్ లె రూక్స్‌కు మారిన బాధ్యతల బదిలీ కూడా అనుకున్నంత సాఫీగా సాగలేదన్న అభిప్రాయాలు జట్టు లోపల వ్యక్తమవుతున్నాయి.

**సీవోఈపైనా ప్రశ్నలు**

చీఫ్ ఫిజియో కమలేశ్ జైన్‌తోపాటు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పనితీరుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుమ్రా ఫిట్‌నెస్ టెస్టులో పాసై కనీసం ఒక టెస్టుకైనా అందుబాటులో ఉంటాడని సెలెక్టర్లకు తొలుత భరోసా ఇచ్చిన సీవోఈ, ఆ తర్వాత అతని గాయం అంచనా వేసినదానికంటే తీవ్రమైనదని వెల్లడించడం మేనేజ్‌మెంట్ లోపాలను బయటపెట్టింది. సాయి సుదర్శన్ విషయంలోనూ ఇదే గందరగోళం నెలకొంది – నెట్స్‌లో 75 నిమిషాలు బ్యాటింగ్ చేస్తూ కోలుకుంటున్నట్టు కనిపిస్తున్నా, తుది ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇంకా రావాల్సి ఉంది. స్క్వాడ్‌లోకి రావాలంటే తీవ్ర పోటీ ఉన్న ఇలాంటి సమయంలో గాయాలవల్ల కెరీర్లు డోలాయమానంలో పడే ప్రమాదం ఉందనేది కొందరి వాదన. దీంతో శ్రీలంక టెస్టు సిరీస్ అనంతరం జరిగే సమీక్షలో కమలేశ్ జైన్, రిజ్వాన్ ఖాన్‌లతోపాటు సీవోఈ సిబ్బందిలోనూ కొత్త మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.



## ఆగస్ట్ 6నే.. 'తగలబెట్టే' టీజర్

నాని, కయాదు లోహర్ జోడీగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ప్రాజెక్ట్ 'ది ప్యారడైజ్'పై భారీ అంచనాలున్నాయి. ఈ చిత్రం ఫస్ట్ టీజర్‌ని ఆగస్ట్ 6న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. అయితే, దర్శకుడు శ్రీకాంత్ తాజా వ్యాఖ్యలు కొత్త ఊపును తెచ్చాయి. ఇటీవల ఓ సినిమా ఈవెంట్‌లో మాట్లాడుతూ, ఆగస్ట్ 6న విడుదల కానున్న టీజర్ 'తగలబడుతుంది' అని చేసిన వ్యాఖ్య వైరలైంది. దీంతో టీజర్‌పై అంచనాలు రెట్టింపయ్యాయి. మరి ఆ రోజు వచ్చే టీజర్ ఎలాంటి అనుభూతిని పంచుతుందో చూడాల్సిందే. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం సమకూరుస్తుంటే.. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాణం జరుగుతోంది.





## 20 ఏళ్లయినా.. ఆ ప్రేమ తగ్గొద్దు

సూర్య, మమితా బైజు జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆడియో విడుదల వేడుకలో సూర్య ప్రేమ, వివాహ బంధం, దంపతుల మధ్య పరస్పర గౌరవం గురించి హృద్యంగా మాట్లాడారు. ప్రేమ అనేది పెళ్లితో ఆగిపోయేది కాదని, బంధంలో అనురాగం ప్రతిరోజూ కనిపించాలని అన్నారు. 20 ఏళ్లు కలిసి ఉన్నా భాగస్వామిపై ప్రేమ తగ్గకూడదని, వయసుతో పాటు మనుషుల ఆలోచనలు మారినా, ఆప్యాయత మాత్రం ఎప్పుడూ చెక్కుచెదరకూడదని చెప్పారు. అలాగే కుటుంబంలో మహిళల త్యాగాలను ప్రస్తావిస్తూ,



ఇల్లు చూసుకోవడం, పిల్లలను పెంచడం వంటి బాధ్యతల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువ కష్టపడతారని, వారికి ప్రేమతో పాటు గౌరవం కూడా ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మమితా బైజు మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి సూర్య అంటే తనకు ఇష్టమని, గతంలో ఆయనతో పనిచేసే అవకాశం చేజారినా ఈసారి ఆ కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. సూర్యను నిజమైన జెంటిల్మన్‌గా అభివర్ణించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రంలో రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్, నాజర్ కీలక పాత్రలు పోషించారు.

## 'రామాయణ'లో ప్రతి పాత్రా ప్రత్యేకమే

దర్శకుడు నితీష్ తివారీ కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'రామాయణం'. రణ్‌బీర్ కపూర్, యష్, సాయిపల్లవి ప్రధాన పాత్రధారులు. ఈ చిత్రంలో నటి రకుల్ ప్రీత్ సింగ్ 'శూర్పణఖ' పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్, తాను ఈ పాత్రను ఎంచుకోవడానికి కారణాలను వెల్లడించారు. "భారతీయ సంస్కృతిలో రామాయణం అత్యంత ప్రాధాన్యమైన కావ్యం. అలాంటి కథను వెండితెరపై ఆవిష్కరిస్తున్నప్పుడు అందులో భాగమయ్యే అవకాశం రావడమే విశేషం. పాత్ర చిన్నదా పెద్దదా అన్న దానికంటే.. అంతటి ప్రతిష్టాత్మకమైన చిత్రంలో భాగం కావడమే నాకు ప్రధానం" అన్నారు. అలాగే, దర్శకుడు నితీష్ తివారీ మేకింగ్ శైలిని ఆమె ప్రశంసించారు. "శూర్పణఖ పాత్రను తీర్చిదిద్దిన తీరు, దానికి ఉన్న ప్రాధాన్యత నచ్చడంతోనే సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చా" అన్నారు. భారతీయ సినిమా చరిత్రలోనే ప్రత్యేకంగా నిలిచిపోయే ఈ చిత్రంలో నటించడం ఎంతో సంతోషాన్నిస్తోందని రకుల్ వెల్లడించారు.



## క్రిష్‌నుంచి 'జెంజ్ బ్యాచ్'

విభిన్న కథాంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుడు క్రిష్ జాగర్లమూడి, ఈసారి పూర్తి కొత్త నటీనటులతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా టైటిల్‌పై ఆసక్తికర అప్డేట్ వినిపిస్తోంది. 'జెంజ్ బ్యాచ్' అనే ట్రెండీ టైటిల్‌ను ఖరారు చేసినట్టు సమాచారం. కథకు తగినట్టుగానే ఈ పేరును ఎంచుకున్నారని తెలుస్తోంది. వేగంగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రసాద్ ల్యాబ్‌లో డబ్బింగ్ దశలో ఉంది. సినిమా అవుట్‌పుట్ ఆకట్టుకునేలా వచ్చిందని సమాచారం. కమర్షియల్ ఎలిమెంట్స్‌తోపాటు భావోద్వేగాలకు కూడా సమాన ప్రాధాన్యమిస్తూ, తనదైన శైలిలో క్రిష్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది. స్టార్ హీరోలపై కాకుండా బలమైన కథపై నమ్మకంతో సినిమాలు తీసే దర్శకుడిగా క్రిష్‌కు మంచి పేరుంది. ఈ నేపథ్యంలో మరోసారి కొత్త ప్రతిభను పరిచయం చేస్తూ, భిన్నమైన కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. మరి ఈ ప్రయత్నం క్రిష్‌కు హిట్‌ను అందిస్తుందా, లేదా మరోసారి కేవలం పేరు మాత్రమే మిగులుతుందా? అన్నది చూడాల్సి ఉంది.

## దేవుడే.. రెస్ట్ ఇచ్చాడు!

ప్రముఖ నటి రష్మిక 'మైసా' చిత్రీకరణ సమయంలో గాయపడి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తన ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. గాయం కారణంగా తనకు నొప్పిగా ఉందని, అయితే అది భరించలేనంత స్థాయిలో లేదని రష్మిక పేర్కొన్నారు. అభిమానులు ఆందోళన చెందొద్దని విజ్ఞప్తి చేశారు. 'హాయ్.. గాయాలు తగిలినప్పుడు నిజంగానే ఇబ్బందికరంగా ఉంటుంది. నేను గాయపడిన విషయం ఎవ్వరికీ తెలియకూడదనుకున్నాను, కానీ ఏం చేస్తాం? కొన్ని రోజులుగా నేను మీకు కనిపించకుండాపోయాను. అందుకు సారీ. నేను నా శరీరాన్ని ఓ యంత్రంలా కాకుండా, మనిషి దేహంలా చూడటం నేర్చుకోవాలి' అని పేర్కొన్నారు. 'ఇంతకీ నా గాయం ఎలాంటిదో మీకు వివరించాలంటే, కాసేపు నేను బయాలజీ టీచర్ అవతారం ఎత్తాలేమో. మన హిప్ (నడుము భాగం) ఇరువైపులా నాలుగు టెండన్లు ఉంటాయి. అవి హిప్ భాగాన్ని, కాళ్లను కలిపి ఉంచుతాయి. అయితే నా హిప్ కుడివైపున ఉన్న ఓ టెండన్ విడిపోయిందట. అది మళ్లీ అతుక్కున్న తరువాతే బాగా నడవగలను. నాకు నేనుగా ఎప్పుడూ లీవ్ తీసుకోనని తెలిసి, దేవుడే ఇలా బలవంతంగా రెస్ట్ ఇచ్చాడేమో అనిపిస్తోంది. అయితే నేనేమీ దీనిపై ఫిర్యాదు చేయడం లేదు. ఈ విశ్రాంత సమయాన్ని బాగా ఆస్వాదిస్తున్నాను. బోర్ కొట్టకుండా పజిల్స్ పరిష్కరిస్తున్నాను. అందులో నాకు ఇంత నైపుణ్యముందని ఇప్పటిదాకా నాకే తెలియదు. అయితే రన్నింగ్, ఎక్సర్‌సైజులు చేసే పరిస్థితి లేకపోవడంవల్ల బరువు పెరుగుతానేమో అని భయంగా ఉంది. ఖాళీ దొరికింది కదా అని ఫుడ్ బాగా లాగిస్తున్నాను. ముఖ్యంగా స్వీట్లు కనిపిస్తే డెజర్ట్ మాన్స్టర్ అయిపోతాను. మీరెవ్వరూ ఆందోళన చెందకండి. లవ్ యూ ఆల్ అన్నారు రష్మిక.



## అదీ.. వారణాసి ఐమాక్స్ సీక్రెట్

రాజమౌళి, మహేష్‌బాబు కాంబోలో రూపొందుతున్న భారీ చిత్రం 'వారణాసి'. అనౌన్స్‌మెంట్‌నుంచే ప్రాజెక్ట్ వార్తల్లో నిలుస్తోంది. ఈ సాహస కథను ఐమాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారన్న సంగతి తెలిసిందే. ప్రీమియం ఫార్మాట్‌ని ఎందుకు ఎంచుకున్నారన్న దానిపై రాజమౌళి ఇప్పటిదాకా స్పష్టత ఇవ్వలేదు. తాజాగా ఫ్రెంచ్ మ్యాగజైన్ 'త్సోనామి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయమై దర్శకుడు మాట్లాడారు. సినిమాలోని అపారమైన స్కేల్ దృష్ట్యానే ఐమాక్స్‌ను ఎంచుకున్నామని చెప్పారు. ప్రేక్షకులను పూర్తిగా కథలో లీనంచేసే సినిమాటిక్ అనుభూతిని అందించే సత్తా ఈ ఫార్మాట్‌కు ఉందని అభిప్రాయపడ్డారు. రామాయణంలోని అపార వానర సైన్యంతోపాటు, దాదాపు 300 అడుగుల ఎత్తుండే భారీ అంటార్కిటిక్ మంచు కొండలు కూడా చిత్రంలో ప్రధాన భాగంగా ఉన్నాయని తెలిపారు. ఈ తరహా భారీతనానికి న్యాయం చేయాలంటే ఐమాక్స్ యాస్పెక్ట్ రేషియో మాత్రమే సరిపోతుందని రాజమౌళి స్పష్టం చేశారు. 'వారణాసి'పై దర్శకుడి తాజా వ్యాఖ్యలు మరింత హైప్‌ను పెంచాయి.

